www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వినాయక చవితి శుభాకాంక్షలు



శనివారం | 7-9-2024 | పేజీలు: 16 + 32 పేజీల వినాయక ప్రత్యేకం | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 144

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 5.38 తదుపరి పంచమి; నక్షత్రం: చిత్త మ. 12.34 తదుపరి స్వాతి; వర్జ్యం: రా.6.51-8.39; దుర్ముహూర్తం: ఉ.6.05-7.43; అమృతఘడియలు: శే.ఉ.7.08, తె. 5.38 మొదలు; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.20 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

హైదరాబాద్ ● శనివారం 7 సెప్టెంబరు 2024

రూ.5.5 లక్షల కోట్లు గల్లంతు

సెన్సెక్స్ 1,017 పాయింట్లు డౌన్.. 25,000 దిగువకు నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వారాంతం (శుక్ర వారం) ట్రేడింగ్‌లో భారీ నష్టాన్ని చవిచూశాయి. ఒక దశలో 1,219 పాయింట్లు క్షీణించి 81,000 దిగువకు పడిపోయిన సెన్సెక్స్. చివరికి 1,017.23 పాయింట్ల (1.24 శాతం) నష్టంతో 81,183.93 వద్ద స్థిరపడింది. గత నెల 23 తర్వాత సూచీకిదే కనిష్ఠ ముగింపు స్థాయి. నిఫ్టీ విషయానికొస్తే, 292.95 పాయింట్లు (1.17 శాతం) పతనమై 24,852.15 వద్ద క్లోజైంది. మార్కెట్లో అమ్మకాలు పోటెత్తడంతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.49 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.460.18 లక్షల కోట్లకు (5.48 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. అంతర్జాతీయంగా ట్రేడింగ్ ట్రెండ్ ప్రతికూలంగా ఉండటంతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి. అమెరికా ప్రభుత్వం గత నెల ఉద్యోగాల కల్పన గణాంకాలు విడుదల చేసే నేపథ్యంలో అంతర్జాతీయంగా ఈక్విటీ ఇన్వెస్టర్లు అప్రమత్తమయ్యారు. జాబ్స్ డేటా అంచనాల కన్నా మెరుగ్గా ఉంటే, ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలోనూ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చన్న ఆందోళనలతో ఈక్విటీల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. దీంతో దేశీయ మార్కెట్లోనూ ఇన్వెస్టర్లు ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంకింగ్ సహా అన్ని రంగాల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. మన మార్కెట్ రికార్డు గరిష్ఠాల వద్ద ట్రేడవుతుండటం, చాలా షేర్లు అధిక ధరల వద్ద కదలాడుతుండటం కూడా ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించేందుకు ప్రేరేపించాయి. మరిన్ని ముఖ్యాంశాలు..



ఏథర్ ఎనర్జీ రూ.4,500 కోట్ల ఐపీఓ !

మరో దేశీయ విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి సిద్ధమవుతోంది. ఇందుకోసం వచ్చే వారం మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హియరింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించనుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.4,500 కోట్లు సమీకరించాలని యోచిస్తోంది. కొత్త షేర్ల జారీతో పాటు ఇప్పటికే కంపెనీ ఈక్విటీలో మదుపు చేసిన మదుపరుల్లో కొందరు తమ పెట్టుబడిలో కొంత మొత్తాన్ని ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా విక్రయిస్తారని సమాచారం. మరో ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ విజవంతమైన నెల రోజులకే ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమవడం విశేషం.

బజార్ స్టైల్ రిటైల్ లిస్టింగ్ ఓకే

రేఖా ఝున్‌ఝున్‌వాలా పెట్టుబడులు కలిగిన ఫ్యాషన్ రిటైలింగ్ కంపెనీ బజార్ స్టైల్ రిటైల్ లిమిటెడ్ శుక్రవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఐపీఓ ధర రూ.389 వద్దే లిస్టయినప్పటికీ, ఇంట్రాడేలో 10.78 శాతం వరకు పెరిగి రూ.430.95 వద్దకు ఎగబాకింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి షేరు ధర 2.73 శాతం లాభంతో రూ.399.65 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.2,982.08 కోట్లుగా నమోదైంది.

ఎన్ఎస్ఈలో బుల్



బీఎస్ఈలో మాదిరిగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లోనూ బుల్ బొమ్మను ఏర్పాటు చేశారు. బుల్‌తో పాటు భారత కుటుంబానికి ప్రాతినిధ్యం వహించే ఆరుగురు మనుషుల ప్రతిమలను సైతం ప్రతిష్ఠించారు. రెండు సెట్లుగా ఏర్పాటు చేసిన ఈ బొమ్మలను మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఆవిష్కరించారు. రెండు సెట్లలో ఒకటి ఎక్స్ఛేంజీ ఆవరణలో, మరొకటి బయట ఏర్పాటు చేసినట్లు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ తెలిపారు.

విశాఖ విమానాశ్రయంలో డిజియాత్ర

ముంబై: విశాఖపట్నం విమానాశ్రయం సహా దేశంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) నిర్వహణలోని 9 విమానాశ్రయాల్లో డిజియాత్ర సదుపాయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం ప్రారంభించారు. విశాఖ విమానాశ్రయంలో జరిగిన ఒక కార్యక్రమంలో అక్కడ ప్రత్యక్షంగానూ, మిగతా విమానాశ్రయాల్లో వర్చువల్ విధానంలోను దీన్ని ప్రారంభించారు. డిజియాత్ర ప్రారంభించిన ఇతర విమానాశ్రయాల్లో పాట్నా, రాయపూర్, భువనేశ్వర్, గోవా (దబోలిమ్), ఇండోర్, రాంచీ, కోయంబత్తూర్, బగ్డోగ్రా ఉన్నాయి. విమానాశ్రయాల్లో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ (ఎఫ్ఆర్‌టీ) ఆధారంగా ప్రయాణికుల ప్రాసెసింగ్ కాంటాక్ట్‌లెస్‌గా, నిరంతరాయంగా సాగిపోయేందుకు ఇది ఉపయోగపడుతుంది.

హ్యుండయ్ ఎక్స్‌టర్‌లో కొత్త వేరియెంట్లు



చెన్నై: హ్యుండయ్ మోటార్ ఇండియా ఎంట్రీ లెవెల్ ఎస్‌యూవీ ఎక్స్‌టర్‌లో రెండు కొత్త వేరియెంట్లను మార్కెట్లోకి తెచ్చింది. వీటిలో ఎస్ (ఓ)+ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వేరియెంట్ ధర రూ.7,86,300 కాగా ఎస్+ ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వేరియెంట్ ధర రూ.8,43,900. ఈ కొత్త వేరియెంట్లలో స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, కలర్ టీఎఫ్‌టీ మల్టీ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లేతో కూడిన డిజిటల్ క్లస్టర్, 8 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థ, ఆండ్రాయిడ్ ఆటో అండ్ యాపిల్ కార్‌ప్లే, వెనుక భాగంలో కూడా ఏసీ వెంట్లు ఈ వేరియెంట్ల ప్రత్యేకతలు. అలాగే వీటికి ఆరు ఎయిర్‌బాగ్‌లు, అన్ని సీట్లకు 3 పాయింట్ సీట్‌బెల్ట్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ వ్యవస్థ కూడా ఉంటాయి.

ఇక ఈ-ఫార్మాట్‌లోనే బీమా పాలసీలు

15 రోజుల్లో డెత్ క్లెయిమ్స్ సెటిల్‌మెంట్: ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: బీమా పాలసీలపై పాలసీ హోల్డర్ల హక్కులకు సంబంధించి బీమా నియంత్రణ అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. బీమా కంపెనీలు తప్పనిసరిగా తమ పాలసీలను ఎలక్ట్రానిక్ ఫార్మాట్ (ఈ-ఫార్మాట్)లోనే జారీ చేయాలని స్పష్టం చేసింది. అయితే పాలసీదారులు కోరితే, కంపెనీలు ఫిజికల్ కాపీ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. జీవిత బీమా పాలసీలకు సంబంధించీ ఐఆర్‌డీఏఐ కొత్త ఆదేశాలు జారీ చేసింది. పాలసీదారులు ప్రపోజల్ ఫారాన్ని ఆమోదించిన 15 రోజుల్లో కంపెనీలు పాలసీలు జారీ చేయాలని ఆదేశించింది. ప్రపోజల్ ఫారంతో పాటు ప్రీమియం వసూలు చేయడానికీ ఐఆర్‌డీఏఐ చెక్ పెట్టింది. మంచి ఆరోగ్యంతో ఉన్నట్టు పాలసీదారులు ప్రకటించిన వెంటనే జారీ చేసే పాలసీలపై మాత్రమే వెంటనే ప్రీమియం వసూలు చేసేందుకు అనుమతిస్తారు. బీమా కంపెనీలు ఇక పాలసీదారులకు పాలసీ డాక్యుమెంట్‌తో పాటు కస్టమర్ ఇన్ఫర్మేషన్ షీట్ (సీఐఎస్) కూడా తప్పనిసరిగా ఇవ్వాలి.

ఇతర ముఖ్య ఆదేశాలు

- జీవిత బీమా పాలసీలకు నెల రోజుల ఫ్రీ లుక్ పీరియడ్. పాలసీదారుడికి పాలసీ నచ్చకపోతే ఈ గడువులోగా పాలసీని రద్దు చేసుకునే స్వేచ్ఛ
- విజ్ఞప్తి అందిన 15 రోజుల్లో డెత్ క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్
- దర్యాప్తుతో ముడిపడిన డెత్ క్లెయిమ్స్ విజ్ఞప్తి అందిన 45 రోజుల్లో సెటిల్ చేయాలి
- సరెండర్ లేదా పాక్షిక ఉపసంహరణ విజ్ఞప్తులను వారం రోజుల్లో పరిష్కరించాలి.
- డ్యూ డేట్‌లోనే మెచ్యూరిటీ, ఇన్‌కమ్, సర్వైవల్ బెనిఫిట్స్, యాన్యుటీ చెల్లింపులు
- ప్రపోజల్ ఫారంలో పాలసీదారులు తప్పనిసరిగా ఒకరు లేదా ఇద్దరు నామినీల వివరాలు పేర్కొనాలి
- ఆరోగ్య బీమా పాలసీదారులకు జారీ చేసే సీఐఎస్‌లో తప్పనిసరిగా పాలసీ పేరు, ఎంత మొత్తానికి బీమా కవరేజీ తీసుకున్నారు? వంటి వివరాలు ఉండాలి
- క్యాష్‌లెస్ క్లెయిమ్స్ అనుమతిపై బీమా కంపెనీలు విజ్ఞప్తి అందిన గంట సేపట్లో నిర్ణయం తీసుకోవాలి
- క్యాష్‌లెస్ క్లెయిమ్‌లను మూడు గంటల్లో సెటిల్ చేయాలి
- హాస్పిటల్ నుంచి డిశ్చార్జి కోసం విజ్ఞప్తి అందిన మూడు గంటల్లోగా బీమా కంపెనీలు నిర్ణయం తీసుకోవాలి. ఆ లోగా నిర్ణయం తీసుకోకపోతే అయ్యే అదనపు ఖర్చులను బీమా కంపెనీలే భరించాలి.
- ట్రీట్‌మెంట్ సమయంలో పాలసీదారుడు చనిపోతే క్లెయిమ్ విజ్ఞప్తిని బీమా కంపెనీ వెంటనే ప్రాసెస్ చేసి సెటిల్ చేయాలి
- ట్రీట్‌మెంట్ సమయంలో పాలసీదారుడు చనిపోతే, హాస్పిటల్ అతని మృతదేహాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అప్పగించేలా చూడాలి.

కేరళకు కిమ్స్ హాస్పిటల్స్ విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కిమ్స్ హాస్పిటల్స్ తన కార్యకలాపాలను కేరళకు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా కన్నూర్‌లోని శ్రీచంద్ స్పెషాలిటీ హాస్పిటల్‌తో దీర్ఘకాలిక లీజు, ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్ ఒప్పందం కుదుర్చుకుంది. తన అనుబంధ సంస్థ కిమ్స్ స్వస్థ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఈ ఒప్పందం కుదుర్చుకుంది. కేరళలో తమ వైద్య సేవల విస్తరణకు ఇది తొలి అడుగని కిమ్స్ హాస్పిటల్స్ డైరెక్టర్, సీఈఓ డాక్టర్ బొల్లినేని అభినయ్ తెలిపారు. ప్రస్తుతం 180 పడకలు ఉన్న శ్రీచంద్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కిమ్స్ 350 పడకల ఆసుపత్రిగా విస్తరిస్తుంది.

సీఎం ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు రూ.2 కోట్ల విరాళం

భారత్ బయోటెక్

వరదలు, భారీ వర్షాలతో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలను ఆదుకునేందుకు కార్పొరేట్ సంస్థలు మేము సైతం అంటూ ముందుకు వస్తున్నాయి. తాజాగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే భారత్ బయోటెక్ సంస్థ రెండు రాష్ట్రాల సీఎం ఫ్లడ్ రిలీఫ్ ఫండ్‌కు రూ.కోటి చొప్పున విరాళం ప్రకటించింది. వరదలతో దెబ్బతిన్న ప్రజల పునరావాసం, ఉపశమనానికి సాయపడడం బాధ్యతగా భావించి ఈ విరాళం అందిస్తున్నట్టు తెలిపింది.

తెలంగాణ వరద సహాయ చర్యల కోసం రూ.2.5 కోట్లు

జీఎంఆర్ గ్రూప్

తెలంగాణ వరద బాధితుల సహాయ, పునరావాసం కోసం జీఎంఆర్ గ్రూప్ రూ.2.5 కోట్ల విరాళం ప్రకటించింది. దీనికి సంబంధించిన చెక్కును జీఎంఆర్ గ్రూప్ ప్రతినిధులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అందజేశారు.

నెల రోజుల్లో అప్రెంటిస్‌ల నియామకం

నెలకు రూ.5,000 స్టైఫండ్
ఐబీఏ సీఈఓ సునీల్ మెహతా

ముంబై: బ్యాంకులు పెద్దఎత్తున అప్రెంటిస్‌ల నియామకాలకు సిద్ధమవుతున్నాయి. నెల రోజుల్లోనే వీరి ఎంపిక పూర్తవుతుందని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) సీఈఓ సునీల్ మెహతా చెప్పారు. డిగ్రీ పూర్తి చేసి 21-25 సంవత్సరాల మధ్య వయసున్న యువతీ, యువకులు ఈ పోస్టులకు అర్హులని తెలిపారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన ప్రత్యేక నైపుణ్యాల్లో వీరికి శిక్షణ ఇచ్చి నెలకు రూ.5,000 చొప్పున స్టైఫండ్ చెల్లిస్తామన్నారు. ఐఐటీలు, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో డిగ్రీ పూర్తి చేసిన వారు ఇందుకు అనర్హులు. వీరి అప్రెంటిస్‌షిప్ ఏడాది పాటు ఉంటుంది. తర్వాత పనితీరు ఆధారంగా వీరిని బ్యాంకింగ్ కరస్పాండెంట్లుగా నియమించే అవకాశం ఉందని మెహతా చెప్పారు. అద్భుత పనితీరు కనబరిచే అప్రెంటిస్‌లను బ్యాంకులు రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకునే అవకాశం కూడా ఉందన్నారు.

హైదరాబాద్‌లో ఎజిలిసియం డెవలప్‌మెంట్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డేటా, అనలిటిక్స్ సొల్యూషన్స్ కంపెనీ 'ఎజిలిసియం' తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించింది. ఇందులో భాగంగా సైబర్‌సిటీలో కొత్తగా డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ద్వారా ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు వినూత్న డేటా, అనలిటిక్స్ సేవలు అందిస్తుంది. సైబర్‌సిటీలోని ఆర్ఎంజడ్ స్పైన్ క్యాంపస్‌లో ఈ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో 100 మంది నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,310 ▲	67,200 ▲	92,000 ▲
ముంబై	71,931 ▲	65,889 ▲	83,338 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	485
వరంగల్	472	గోదావరి	480
చిత్తూరు	518	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	99
కర్నూలు	99	నెల్లూరు	99
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		

స్పోర్ట్స్



పారాలింపిక్స్‌లో స్వర్ణం

హైజంప్‌లో ప్రవీణ్ గోల్డెన్ జంప్

గాయం నుంచి కోలుకొని..

పారాగేమ్స్‌లో హైజంపర్ ప్రవీణ్ కుమార్ పసిడి కలను నెరవేర్చుకున్నాడు. టోక్యో గేమ్స్‌లో రజతం మాత్రమే అందుకున్న తను ఈసారి మాత్రం అత్యుత్తమ ప్రదర్శనతో ఆసియా రికార్డును నెలకొల్పుతూ త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాడు. అయితే జావెలిన్‌త్రో, పవర్‌లిఫ్టింగ్‌లో పతకాలను ఆశించినా దీపేశ్, రాజమణి నిరాశపరిచారు. మొత్తంగా భారత్ ఖాతాలో 6 స్వర్ణాలు, 9 రజతాలు, 11 కాంస్యాలతో 26 పతకాలు చేరాయి.

పారిస్: పారాలింపిక్స్‌లో టార్గెట్-25 మెడల్స్ లక్ష్యాన్ని అలవోకగా దాటేసిన భారత అథ్లెట్లు తమ జోరును కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా మన ఖాతాలో ఆరో స్వర్ణం చేరింది. శుక్రవారం జరిగిన పురుషుల హైజంప్ టీ64 ఫైనల్స్‌లో ప్రవీణ్ కుమార్ 2.08 మీటర్ల ఎత్తు దువికి పసిడి పట్టాడు. ఈ సీజన్‌లో అతడికిదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. అంతేకాదు.. పారాలింపిక్స్‌లో ప్రవీణ్‌కిది వరుసగా రెండో పతకం. టోక్యో గేమ్స్‌లో అతను 2.07 మీటర్లతో రజతం అందుకున్నాడు. నొయిడాకు చెందిన ఈ 21 ఏళ్ల యువ అథ్లెట్‌కు పుట్టుకతోనే ఎడమ కాలు తక్కువ ఎత్తులో ఉంది. దీంతో ఆత్మనూన్యతా భావాన్ని పోగొట్టుకునేందుకు క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. మొదట వాలీబాల్ ఆడినా ఆ తర్వాత కోచ్ సత్యపాల్ సింగ్ ప్రోత్సాహంతో హైజంప్ వైపు దృష్టి సారించడంతో అతడి దశ మారింది. మరోవైపు పారాలింపిక్స్ హైజంప్‌లో స్వర్ణం గెలిచిన రెండో భారత అథ్లెట్‌గా ప్రవీణ్ నిలిచాడు. గతంలో మరియప్పన్ తంగవేలు ఈ ఫీట్ సాధించాడు. ఇక పారిస్ పారాగేమ్స్‌లో భారత్‌కిది మూడో హైజంప్ మెడల్. ఇప్పటికే టీ63 ఈవెంట్‌లో శరద్ రజతం, మరియప్పన్ కాంస్యం అందుకున్నాడు. పురుషుల 400 మీ. టీ47 హీట్1లో దిలీప్ 49.54సె. టైవింగ్‌తో మూడోస్థానంలో నిలిచి ఫైనల్ చేరాడు.

కనోయి స్ప్రింట్‌లో సెమీస్‌కు..

పురుషుల కనోయి స్ప్రింట్ కేఎల్1 200మీ. హీట్1లో యష్ కుమార్ ఆరో స్థానంలో, మహిళల వీఎల్2 200మీ. హీట్స్‌లో ప్రాచీ యాదవ్ నాలుగో స్థానంలో, మహిళల కేఎల్1 200మీ. పూజా ఓజా ఐదో స్థానంలో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించారు.

పతక 'రేసు'లో సిమ్రన్

మహిళల 100 మీ. టీ12 ఫైనల్లో మెడల్ సాధించలేకపోయిన సిమ్రన్ శర్మకు మరో అవకాశం దక్కింది. 200 మీ. టీ12 సెమీస్‌లో తను 25.03 సెకన్ల టైమింగ్‌తో తొలి స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. శనివారం ఫైనల్ జరగనుంది. మరోవైపు మహిళల జావెలిన్‌త్రోలో భావనాబెన్ చౌదరి 39.70మీ. దూరంతో ఐదో స్థానంలో నిలిచింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మూడు నెలల కిందట జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌కు గజ్జల్లో గాయమైంది. దాంతో ఆ పోటీలలో అతడు స్వర్ణంపై ఆశలు వదులుకున్నాడు. అసలు పతకమే లభించదేమోననే అనుమానాలు వ్యక్తమైనా..ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మూడో స్థానంలో నిలిచిన ప్రవీణ్ పారిస్ బెర్త్ పట్టేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్, పారాలింపిక్స్ మధ్య ఉన్న సమయం చాలా తక్కువ. గాయంనుంచి కోలుకొన్నాక పారిస్‌లో బరిలో దిగేందుకు కేవలం 15 రోజుల సమయమే మిగిలింది. ఇంత తక్కువ సమయంలో విశ్వక్రీడలకు సన్నద్ధమై ప్రవీణ్ అక్కడ ఎలాంటి ప్రదర్శన చేస్తాడోనన్న ఉత్కంఠ ఏర్పడింది. అయితే కుమార్ ఆశావహ దృక్పథం, ఓటమిని త్వరగా అంగీకరించని తత్వం కలిగిన కోచ్ సత్యపాల్ సింగ్ సహకారం వెరసి..పారిస్‌లో ఈ హైజంపర్ రికార్డు స్వర్ణాన్ని దక్కించుకొనేందుకు తోడ్పడింది. 'నేను ఈరోజు ఇంతగా విజయవంతం అయ్యానంటే అందుకు పూర్తి క్రెడిట్ సత్యపాల్ సర్‌దే. అలాగే స్పాన్సర్లు, ఫిజియో సహకారం కూడా మరువలేనిది. తక్కువ సమయంలోనే గాయంనుంచి కోలుకొని నేను రాణించడంలో కీలక భూమిక పోషించిన వారికి ఎంతో రుణపడి ఉన్నా' అని ప్రవీణ్ అన్నాడు.



భారత పతాకధారులు హర్విందర్, ప్రీతి

పారాలింపిక్స్ ముగింపోత్సవం

న్యూఢిల్లీ: ఆర్చరీ స్వర్ణ విజేత హర్విందర్ సింగ్, అథ్లెటిక్స్‌లో రెండు పతకాలు సాధించిన ప్రీతి పాల్ ఆదివారం జరిగే పారాలింపిక్స్ ముగింపు ఉత్సవంలో భారత పతాకధారులుగా వ్యవహరించనున్నారు. ఈ విషయాన్ని భారత ఒలింపిక్ సంఘం శుక్రవారం వెల్లడించింది. ప్రతిష్ఠాత్మక విశ్వ క్రీడల ముగింపు కార్యక్రమంలో త్రివర్ణ పతకాన్ని చేబూని ముందు నడవడం గర్వకారణంగా భావిస్తున్నామని హర్విందర్, ప్రీతిపాల్ వ్యాఖ్యానించారు.

పారాలింపిక్స్‌లో భారత్ షెడ్యూల్ నేడు

రోడ్ సైక్లింగ్: పురుషుల రోడ్ రేస్ సీ1-3 (పతక రౌండ్)- అర్షద్ షేక్ (మ. 1.00), మహిళల రోడ్ రేస్ సీ1-3 (పతక రౌండ్)- జ్యోతి గడేరియా (మ. 1.05);
కనోయింగ్ స్ప్రింట్: పురుషుల కేఎల్1 200 మీ. సెమీఫైనల్- యష్ కుమార్ (మ. 1.30), మహిళల వీఎల్ 200 మీ. సెమీఫైనల్ - ప్రాచీ యాదవ్ (మ. 2.04);
స్విమ్మింగ్: పురుషుల 50 మీ. బటర్‌ఫ్లై ఎస్7 హీట్స్ - సుయాశ్ యాదవ్ (మ. 1.55);
అథ్లెటిక్స్: పురుషుల 400 మీటర్ల రేస్ టీ47 (పతక రౌండ్) - దిలీప్ గావిత్ (రాత్రి 12.29).

డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా



న్యూఢిల్లీ: డిఫెండింగ్ చాంపియన్, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. గురువారం జ్యూరిచ్ డైమండ్ లీగ్ ముగియగా ఓవరాల్ స్టాండింగ్స్‌లో చోప్రా నాలుగో స్థానంలో నిలిచాడు. వాస్తవానికి తను జ్యూరిచ్ పోటీల్లో పాల్గొనకపోయినా అంతకుముందు దోహా, లాసాన్నే లీగ్‌ల్లో రెండో స్థానంలో నిలిచి 14 పాయింట్లు సాధించాడు. ఈనెల 13, 14 తేదీల్లో బ్రసెల్స్‌లో జరిగే ఫైనల్స్‌లో ఆరుగురు అథ్లెట్లు అమీతుమీ తేల్చుకోనున్నారు.

షూటర్ శౌర్యకు స్వర్ణం

న్యూఢిల్లీ: వినికిడి లోపం కలిగిన షూటర్ శౌర్య సైనీ వరల్డ్ డెఫ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించాడు. జర్మనీలోని హనోవర్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో శౌర్య పురుషుల 50 మీ. రైఫిల్ 3 పొజిషన్‌లో 452.4 పాయింట్లతో వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఈ టోర్నీలో ఇప్పటికే అతను 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో రజతం నెగ్గాడు.



పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జీవాంజి శుక్రవారం హైదరాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌లో ఆమెకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం తాను శిక్షణ పొందిన గోపీచంద్ అకాడమీకి చేరుకున్న దీప్తి..తల్లిదండ్రులు, కోచ్ రమేశ్‌తో కలిసి ఫొటోలకు పోజిచ్చింది.



సబలెంక

2 X 6



పెగులా

ఫైనల్లో సబలెంక, పెగులా

యూఎస్ ఓపెన్

న్యూయార్క్: డిఫెండింగ్ చాంపియన్ కోకో గాఫ్, వరల్డ్ నెంబర్‌వన్ స్వియటెక్ లాంటి ఫేవరెట్లంతా విఫలమైన వేళ.. అర్యానా సబలెంక మాత్రం యూఎస్ ఓపెన్‌లో దూకుడైన ఆటతీరుతో దూసుకెళ్తోంది. ఈ బెలారస్ స్టార్ ఇక్కడ నిరుడు చేజారిన కిరీటాన్ని అందుకునేందుకు అడుగు దూరంలో నిలుస్తూ వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. శనివారం జరిగే తుది పోరులో లోకల్ స్టార్, ప్రపంచ ఆరో ర్యాంకర్ జెస్సికా పెగులాతో రెండో ర్యాంకరైన 26 ఏళ్ల సబలెంక అమీతుమీ తేల్చుకోనుంది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో గతేడాది రన్నరప్ సబలెంక 6-3, 7-3 (2)తో అమెరికాకు చెందిన 13వ సీడ్ ఎమ్మా నవారోను ఓడించింది. గంటన్నరపాటు సాగిన పోరులో సబలెంక మ్యాచ్ ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించింది. గతరౌండ్లో డిఫెండింగ్ చాంప్ కోకో గాఫ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన నవారో.. ఇక్కడ మాత్రం సబలెంక బలమైన సర్వీసులకు ఏ దశలోనూ బదులివ్వలేకపోయింది. 8 ఏస్‌లు సంధించిన సబలెంక ఏకంగా 34 విన్నర్లతో విరుచుకుపడింది. మరోవైపు నవారో ఒక ఏస్, 13 విన్నర్లకు పరిమితమైంది. మరో సెమీఫైనల్లో 30 ఏళ్ల పెగులా 1-6, 6-4, 6-2తో అన్‌సీడెడ్, గతేడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరింది. ముచోవా 6 ఏస్‌లు, 34 విన్నర్లను సంధించినా ఫలితం లేకుండా పోయింది. ఏకంగా 40 అనవసర తప్పిదాలకు పాల్పడి మూల్యం చెల్లించుకుంది.

సిరియా బోణీ



హైదరాబాద్: అన్ని రంగాల్లో ఆధిపత్యం చెలాయించిన సిరియా..ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో తమ తొలి విజయం అందుకుంది. ఇక్కడి గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో సిరియా 2-0తో మారిషస్‌ను చిత్తు చేసింది. మ్యాచ్ 32వ నిమిషంలో మారిషస్ డిఫెండర్ సిటోరా సెల్ఫ్ గోల్‌తో ప్రత్యర్థికి ఆధిక్యం లభించింది. 70వ నిమిషంలో మహ్మూద్ సిరియా తరపున గోల్ చేశాడు. ఈ ఓటమితో మారిషస్ జట్టు టోర్నీ నుంచి నాకౌట్ అయింది. టోర్నమెంట్‌లో మూడో, చివరి మ్యాచ్‌లో భారత్, సిరియా తలపడనున్నాయి. సోమవారం ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తేనే భారత్ కప్ విజేతగా నిలుస్తుంది.

పడిక్కళ్, శ్రేయాస్ అర్ధ శతకాలు

ఇండియా 'డి'కి భారీ ఆధిక్యం

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): దేవదత్ పడిక్కళ్ (56), శ్రేయాస్ అయ్యర్ (54), అర్ధ శతకాలు సాధించడంతో ఇండియా 'సి'తో ఇక్కడ జరుగుతున్న దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లో ఇండియా 'డి'కి 202 పరుగుల ఆధిక్యం లభించింది. ఇండియా 'డి' రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆఖరికి 206/8 స్కోరు చేసింది. మానవ్ సుతార్ ఐదు వికెట్లు తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ 91/4తో రెండోరోజు..మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'సి' 168 పరుగులకు ఆలౌటైంది.

సచిన్‌ను వెనక్కు నెట్టిన ముషీర్

బెంగళూరు: ఇండియా 'బి' ఆటగాడు ముషీర్ ఖాన్ (181) దులీప్ ట్రోఫీ అరంగేట్రంలో మూడో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన టీనేజర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఈక్రమంలో సచిన్ (159)ను ముషీర్ వెనక్కు నెట్టాడు. ఇండియా 'ఎ'తో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ 202/7తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'బి' 321 రన్స్‌కు ఆలౌటైంది. సైనీ (56) జతగా 8వ వికెట్‌కు 205 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని ముషీర్ నెలకొల్పాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా 'ఎ' రెండోరోజు ఆఖరికి 134/2 స్కోరు చేసింది.

'రాజస్థాన్'కు రాహుల్ ద్రవిడ్

ముంబై: ఐపీఎల్‌లో తమ జట్టు ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్‌ను నియమించినట్టు రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) ఫ్రాంచైజీ యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది. గతంలో రాజస్థాన్‌కు కెప్టెన్‌గా, ఆ తర్వాత కోచ్‌గా వ్యవహరించిన ద్రవిడ్.. దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ అదే జట్టుకు మార్గనిర్దేశనం చేయనున్నాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 7-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 144 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

సాయం చేయండి



కేంద్ర మంత్రి సంజయ్‌ను సన్మానిస్తున్న సీఎం

వరద బాధిత తెలంగాణను ఆదుకోండి

ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.5,438 కోట్ల నష్టం

తక్షణ మరమ్మతులకు నిర్దేశించిన రేట్లను పెంచాలి

ఏపీతో సమానంగా నిధులు ఇవ్వాలి

విపత్తు నిధుల వినియోగ నిబంధనలు సడలించాలి

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరద బాధిత తెలంగాణను ఆదుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో అపార నష్టం వాటిల్లిందని, కేంద్రం తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు రూ.5,438 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలో తేలిందన్నారు. ఇంకా అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో నష్టం వివరాలను సేకరిస్తున్నారని, సమగ్ర అంచనాలు వచ్చిన తర్వాత నష్టం విలువ మరింత పెరిగే అవకాశం ఉందని వివరించారు. వరద నష్టాన్ని పరిశీలించేందుకు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, బండి సంజయ్‌తో

మిగతా 10వ పేజీలో...

ఆదుకుంటాం

నష్టాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్తా

రైతులు ధైర్యంగా ఉండాలి

రాజకీయాల కోసం ఇక్కడికి రాలే

ఇప్పటికే ఉన్న కేంద్రం నిధులు వాడుకుంటే.. కొత్త నిధులిస్తాం

10 కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్

వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే

అవసరమైన సాయాన్ని కేంద్రం నుంచి అందిస్తాం: బండి సంజయ్



ఖమ్మంలో శివరాజ్‌సింగ్ చౌహాన్

85% జిల్లాల్లో అసాధారణ విపత్తులు

2 ఏపీ, తమిళనాడు, కర్ణాటకలో పెరుగుతున్న కరువు

వరద నుంచి కరువుకు మారిన జిల్లాల్లో పాలమూరు, నల్గొండ, కర్నూలు: ఈపీఐ-గ్లోబల్, ఈఎస్ఆర్ఐ ఇండియా

రాజధానిలో భారీ వర్షం.. రోడ్లపై మోకాలిలోతు నీరు

10 సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు.. ఆరెంజ్ అలర్ట్

వరద బాధిత జిల్లాలు 29.. 3 కోట్ల చొప్పున సాయం: సీఎస్



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' **వినాయక చవితి శుభాకాంక్షలు.**

సెలవు

వినాయక చవితి సందర్భంగా మా కార్యాలయాలకు శనివారం సెలవు. కావున ఆదివారం (8-9-2024) 'ఆంధ్రజ్యోతి' సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.

- మేనేజింగ్ డైరెక్టర్

రాఖీలు, తిలకం, మెహిందీ వంటి వాటితో వచ్చే విద్యార్థులను

శిక్షించొద్దు

స్కూళ్లకు విద్యాశాఖ అధికారుల సర్క్యులర్ జారీ 10



'శ్రీ వినాయక పూజా విధానం'

ప్రత్యేక అనుబంధం నేటి దినపత్రికతో ఉచితంగా అందుకోండి

- మేనేజింగ్ డైరెక్టర్

ఆంధ్రజ్యోతి
నవ్య
శనివారం • 7 సెప్టెంబరు 2024



విఘ్నాలను తొలగించే మహా నాయకుడు వినాయకుడు. వినాయక చవితి నాడు గణనాథుని ప్రతిమ ప్రతి ఇంట్లో కొలువు తీరుతుంది. ఏకదంతుడి పూజను ఆధ్యాత్మిక సౌరభాలతో, ఆనందోత్సాహాలతో చేసుకుంటారు. ఈ పూజలో అనేక పత్రాలను ఆయనకు సమర్పిస్తారు. పత్రిపూజలో ఉపయోగించే ప్రతి ఆకుకు ఒక విశిష్ట ఔషధ గుణముంది. కొత్తమట్టితో గణపతి విగ్రహం చేసి.. దానికి ఆకుపచ్చని పత్రాలతో పూజ చేసి.. వాటన్నింటినీ బావుల్లోను, చెరువుల్లోను వదులుతారు. ఈ పత్రాల్లో ఉన్న ఔషధ గుణాలు - నీటిని శుద్ధి చేస్తాయి. ఇప్పుడు పూజకు ఉపయోగించే పత్రాల్లో ఉండే ఔషధ గుణాలేమిటో చూద్దాం..

శ్రీపత్రే నమః



మాచీ పత్రం: ఇది అందరికీ తెలిసిన మొక్క. పల్లెల్లో కూడా కనిపిస్తుంది. మాచపత్రి అనేది తెలుగు పేరు. ఈ మొక్క చామంతి జాతికి చెందినది. ఆకులు చీలినట్లుగా ఉంటాయి. పచ్చటి ఆకులను నలిపితే మంచి వాసన వస్తుంది. ఈ ఆకులను చల్లటి నీటితో తడిపి.. అలసిన కళ్ల మీద ఉంచుకుంటే - అలసట తగ్గుతుంది. ఈ ఆకులను పసుపు, నూనెలతో కలిపి మెత్తగా నూరి శరీరానికి రాసుకుంటే చర్మకాంతి పెరుగుతుంది. చర్మంపై దద్దుర్లు తగ్గుతాయి.



దూర్వార పత్రం: ఇదొక గడ్డిజాతి మొక్క. దూర్వం అంటే గరిక. ఇది నారుమళ్లలో ఎక్కువగా పెరుగుతుంది. దీనిలో తెల్ల గరిక, నల్ల గరిక అని రెండు రకాలు ఉన్నాయి. గరిక గడ్డిలో కాల్షియం,ఫాస్పరస్, ఫైబర్, పొటాషియం వంటివి అధికం. దీనిలోని పీచు పదార్థం జీర్ణసంబంధిత వ్యాధుల్ని నివారిస్తుంది. గరిక గడ్డిపొడి కూడా బయట మార్కెట్లో దొరుకుతుంది. శరీరంపైన గాయాలు, చర్మ వ్యాధులు, దద్దుర్లు, మూత్రంలో మంట, నాసిక, ఉదర సంబంధిత వ్యాధులు, మొలల నివారణకు కూడా చక్కటి మందుగా పనిచేస్తుంది.



అపామార్గ పత్రం: తెలుగులో దీనిని ఉత్తరేణి అంటారు. దీని ఆకులు గుండ్రంగా వుంటాయి. గింజలు, ముళ్లు ఉండే ఈ చెట్టు చాలా ప్రాంతాల్లో లభిస్తుంది. ఉత్తరేణి ఆకుల నుంచి రసాన్ని తీసి.. పొట్ట మీద పట్టించుకుంటే కొవ్వు కరుగుతుందని కొందరు భావిస్తారు. ఉత్తరేణి ఆకుల్ని ఎండబెట్టి.. కాల్చి బూడిద చేసి.. ఆ పొడిని తేనెలో కలుపుకొని తాగితే ఉబ్బసం, దగ్గు, ఛాతీ సమస్యలు తగ్గుతాయి.



బృహతీ పత్రం: దీనిని ములక అంటారు. ఇందులో చిన్న ములక, పెద్ద ములక, నేల ములక అని మూడు రకాలు. ఈ పత్రాలు వంగ ఆకులు మాదిరి, తెల్లని చారలతో ఉంటాయి. ఈ మొక్కకు గుండ్రటి పళ్లు కూడా కాస్తాయి. ఇది వర్షాకాల ప్రారంభంలో బంజరు భూముల్లో కనిపిస్తుంది. దీని పూలు వంగపండు లేదా ఎరుపు రంగులో ఉంటాయి. ఈ మొక్క కాయలను జాగ్రత్తగా పీకి రసం తీసి.. తేనెలో కలిపి తలకు రాసుకుంటే పేనుకొరుకుడు తగ్గుతుంది. ఈ మిశ్రమాన్ని నుదుటన రాసుకుంటే తలనొప్పి తగ్గిపోతుంది. ఈ ఆకుల్ని మెత్తగా నూరి.. ఆ మిశ్రమాన్ని మోకాళ్లకు రాసుకుంటే నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. దీనిని విషపురుగుల విషానికి విరుగుడుగా కూడా భావిస్తారు.



దుత్తూర పత్రం: దుత్తూరం అంటే ఉమ్మెత్త. దీనిది వంగ జాతి. కాయలకు ముళ్లు ఉంటాయి. పూలు తెల్లగా ఉంటాయి. ఈ మొక్కను వితంగా వాడితే ఔషధం, అతిగా వాడితే విషం అవుతుంది. మొక్క వేళ్లను శుభ్రంగా కడిగి.. చూర్ణంగా చేసుకుని తేనెతో కలిపి తాగితే దగ్గు, ఆయాసం తగ్గుతాయి. ఉమ్మెత్త ఆకులకు నూనె రాసి సెగ మీద వేడిచేసి.. గడ్డలపై ఉంచి కట్టుకడితే వాపు, నొప్పి పోతాయి. ఉమ్మెత్త ఆకుల రసాన్ని నువ్వుల నూనెతో కలిపి చర్మంపై రాసుకుంటే దద్దుర్లు, మంట, ఎగ్జిమా వంటివి మాయమవుతాయి. ఇది ఋతుస్రావ వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుందని ఆయుర్వేదం చెబుతోంది.



తులసీ పత్రం: అనాధి నుంచి భారతీయులు పూజించే పవిత్ర మొక్క తులసి. దేవతార్చనలో తప్పక ఉంటుంది. తులసిలోని ప్రతి భాగమూ అద్భుతమైన ఔషధమే. తులసి రసాన్ని పరగడుపున తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. తులసిని ఎండాకాలంలో తక్కువగా, చలికాలంలో ఎక్కువగా వాడాలి. దీనికి సూక్ష్మజీవుల్ని అంతం చేసే గుణం ఉంది. అందువల్ల దీనిని తరచూ ఏదో ఒక రూపంలో తీసుకోవాలి.



జాజి పత్రం: ఇది సన్నజాజి అనే మల్లిజాతి మొక్క. ఇందులో సన్నజాజి, విరిజాజి అనే రెండు రకాల మొక్కలు కనిపిస్తాయి. ఈ పువ్వుల నుంచి సుగంధ తైలం తీస్తారు. పువ్వుల సువాసన మనసుకు హాయిని, సాంత్వనను కలిగిస్తుంది. జాజి మొగ్గలతో నేత్ర వైద్యం కూడా చేస్తారు.



బదరీ పత్రం: బదరీ అంటే రేగు. దీనిలో రేగు, జిట్రేగు, గంగ రేగు అని మూడు రకాలు ఉంటాయి. పల్లెల్లో రోడ్ల పక్కన పొదల్లా విస్తారంగా పెరిగే రేగు అంటే తెలియని వాళ్లు ఉండరు. రేగు పళ్లు తీయగా, పుల్లగా గమ్మత్తయినా రుచితో ఉంటాయి. వీటి ఆకుల్ని మేకలు ఇష్టంగా తింటాయి. అధిక రక్తపోటు నియంత్రణకు రేగుపళ్లు ఎంతో తోడ్పడతాయి. ఇందులో కాల్షియం ఉంటుంది కాబట్టి.. ఎముకల దృఢత్వానికి ఉపకరిస్తాయి. రక్తశుద్ధికీ, మలబద్ధక నిర్మూలనకు చక్కటి మందు రేగు పండు. దీనిని క్రమం తప్పకుండా సేవిస్తే రోగ నిరోధక శక్తి మెరుగుపడుతుంది. రేగు ఆకులను కూడా ఔషధంగా వాడతారు.



చూత పత్రం: అంటే మామిడాకు. ఏ పండగొచ్చినా, శుభకార్యం జరిగినా గుమ్మానికి మామిడి తోరణాలను కడతాం. మామిడి పండ్లలో ఎన్ని పోషకవిలువలు ఉన్నయో.. ఆకుల్లో కూడా అనేక ఔషధగుణాలు దాగున్నాయి. మామిడి ఆకుల్ని శుభ్రంగా కడిగి.. మరిగే నీటిలో వేసి, కషాయంగా తాగితే.. శరీరంలోని వ్యర్థ పదార్థాలు కడిగేసినట్లు తొలగిపోతాయి. శ్వాసకోశ సమస్యలకు ఈ ఆకుల కషాయం చక్కటి మందుగా పనిచేస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లున్నా కరిగిపోతాయి. అజీర్తి, మానసిక ఒత్తిడి, రక్త విరేచనాలు, చర్మ వ్యాధులు వంటివి రావు.



కరవీర పత్రం: గన్నేరు పత్రానికి మరోపేరు కరవీర. దీనికి తెలుపు, పసుపు, ఎరుపు రంగుల పూలు పూస్తాయి. వినాయక పూజలో ఈ పూలకు విశిష్ట స్థానం ఉంది. అయితే గన్నేరు పువ్వులు, ఆకుల్ని వైద్యుల సహాయంతోనే వాడాలి. ఇవి విషానికి విరుగుడుగా పనిచేస్తాయి. మోతాదుకు మించి వాడితే విషం కూడా. అందుకని ఆయుర్వేద వైద్యుల సలహాలతోనే వీటిని తీసుకోవాలి.



మరువక పత్రం: దీనికి వాడుక భాషలో ధవనం అని పేరు. ఆకులు ఎండిన తర్వాత కూడా మంచి సువాసన వెదజల్లడం ఈ పత్రం ప్రత్యేకత. దీనిని సుగంధ ద్రవ్యాలలో, సౌందర్య సాధన ఉత్పత్తుల్లో కూడా ఉపయోగిస్తారు. ఇందులో యాంటీ ఆక్సీడెంట్లు పుష్కలంగా ఉంటాయి.





విష్ణుక్రాంత పత్రం: ఇది నీలం, తెలుపు పువ్వులుండే చిన్న మొక్క. నీలి పువ్వులుండే రకాన్ని విష్ణుక్రాంత అంటారు. జ్వరం, కఫం, దగ్గు, ఉబ్బసం తగ్గించడానికి, జ్ఞాపకశక్తి పెంపొందింపజేయడానికి ఉపయోగిస్తారు.



శమీ పత్రం: జమ్మిచెట్టు ఆకులనే శమీ పత్రం అంటారు. దసరా రోజుల్లో ఈ చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తారు.జమ్మి ఆకుల కషాయం తాగితే.. శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఉబ్బసం, ఆయాసం, దగ్గు, జలుబు వంటివన్నీ తగ్గుముఖం పడతాయి. పలు ఆయుర్వేద ఔషధాల్లోనూ ఈ వృక్ష సంబంధిత భాగాలను వాడతారు. చర్మ వ్యాధులకు కూడా ఇది చక్కటి మందు.



సింధువార పత్రం: సింధువార పత్రాన్నే వాడుకలో వావిలి అని కూడా పిలుస్తుంటారు. వావిలి ఆకుల్ని కొబ్బరినూనెలో మరిగించి.. ఆ నూనెను నిల్వ చేసుకుంటారు. మోకాళ్ల నొప్పులకు ఈ నూనె ఉపశమనం ఇస్తుంది. ఈ ఆకులను ఆవునెయ్యిలో వేయించి తింటే ముక్కులో నుంచి రక్తం కారడం ఆగుతుంది. వావిలి ఆకుల్ని బాగా నూరి రసం తీసి.. అందులో నువ్వుల నూనె కలిపి వేడి చేయాలి. అది చల్లారిన తరువాత దాన్ని గజ్జి, తామర, దద్దుర మీద పట్టిస్తే పోతాయి. వావిలి ఆకుల కషాయాన్ని పాలతో కలిపి తీసుకుంటే మలేరియా జ్వరం తొలగుతుంది.



అశ్వత్థ పత్రం: హిందువులు, బౌద్ధులు, జైనులు ఎంతో పవిత్రంగా పూజించే వృక్షం ఇది. రావి ఆకులనే అశ్వత్థ పత్ర మంటారు. రావి చెట్టును పూజించడం హైందవ సంప్రదాయం. దీనిలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అంటే త్రిమూర్తులు ఉంటారని నమ్మకం. రావి చెట్టు ఆకులు సమృద్ధిగా ప్రాణవాయువును అందిస్తాయి. రావి చిగుళ్లను పాలలో ఉడికించి తాగితే.. మెదడు చైతన్యవంతం అవుతుంది. రావి పండ్లుతింటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది.



దాడిమీ పత్రం: దాడిమీ అంటే దానిమ్మ ఆకు. శక్తి స్వరూపిణి అంబకు దాడిమీ ఫల నైవేద్యం ఎంతో ఇష్టం. దానిమ్మ ఆకులు, పువ్వులు, మొగ్గలు, బెరడు ఇలా ప్రతిదీ ఔషధమే. దానిమ్మ త్రిదోషాలను నివారిస్తుంది. హెచ్చుతగ్గులు కాకుండా సమతుల్యంగా ఉంచుతుంది. జఠరాగ్నిని ప్రేరేపించి గుండెకు మేలు చేస్తుంది. కడుపులో గ్యాస్, అల్సర్లకు దానిమ్మను మించిన ఔషధం లేదని ఆయుర్వేద వైద్యులు పేర్కొంటున్నారు. చెడు కొవ్వును తగ్గించి, గుండె జబ్బులు రాకుండా కాపాడటంలో దానిమ్మరసం అన్నిటికంటే శ్రేష్ఠమైనది.



అర్జున పత్రం: మద్దిచెట్టు ఆకులనే అర్జున పత్రమంటారు. ఇవి మర్రి ఆకుల్ని పోలి వుంటాయి. అడవులలో పెరిగే పెద్ద వృక్షం ఇది. ఈ చెట్టు బెరడులో కాల్షియం, అల్యూమినియం, మెగ్నీషియం ఉంటాయి. ఈ చెట్టు బెరడును కాల్చి.. పాలలో కలిపి తాగితే గుండె జబ్బులు తగ్గుతాయి. ఇందులో కాల్షియం ఎక్కువగా ఉండటం వల్ల.. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ బెరడు చూర్ణాన్ని తేనెలో కలిపి.. ముఖానికి రాసుకుంటే మొటిమలు పోతాయి.



దేవదారు పత్రం: ఇది అడవుల్లోనే పెరుగుతుంది. దేవతలకు అత్యంత ఇష్టమైన ఆకు దేవదారు. ఇది చాలా ఎత్తుగా పెరుగుతుంది. ఈ కలపతో చెక్కిన విగ్రహాలకు సహజత్వం ఉట్టిపడుతుంటుంది. ఎండిన చెట్టు కొమ్మలు కాలిస్తే.. సాంబ్రాణిలా మంచి వాసన వస్తుంది. ఈ చెట్టు బెరడు అజీర్తి, జీర్ణ సంబంధ వ్యాధులు, చర్మ వ్యాధులు, కంటి జబ్బుల్ని తగ్గిస్తుంది.



బిల్వ పత్రం: బిల్వ పత్రానికి మరోపేరు మారేడు. మూడు ఆకులు కలిసి ఉంటాయి. వీటిని శివుడికి, మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైనవిగా భావిస్తారు. ఆయుర్వేద ఔషధాలలో వాడతారు. మారేడులో పీచు పదార్థం ఎక్కువ. మలబద్ధకాన్ని తొలగిస్తుంది. శరీరానికి చలువ చేస్తుంది. మారేడు ఆకులు, కాయలు, వేర్లు వంటివన్నీ ఔషధాలే! మారేడు కాయల లోపలి గుజ్జు ను చక్కెరతో కలిపి తీసుకుంటే పేగు పూత తగ్గుతుంది. కడుపులోని అల్సర్లు కూడా పోతాయి. ఉదర సంబంధిత సమస్యలను నివారిస్తుంది. ఆకుల కషాయం తాగితే విరేచనాల నుంచి బయట పడొచ్చు. జిగట విరేచనాలు, జ్వరం, మధుమేహం, కామెర్లు, నేత్ర వ్యాధులు, శరీర దుర్గంధం తగ్గించడంలో మారేడును మించిన చెట్టు మరొకటి లేదు.



గండలీ పత్రం: దీనినే లతాదూర్వా అని కూడా అంటారు. భూమిపైన తీగమాదిరి పాకి కణుపులలో గడ్డి మాదిరి పెరుగుతుంది. మూర్ఛ వ్యాధి, కఫం, పొట్ట సంబంధ వ్యాధులు, నులి పురుగుల నివారణకు ఉపయోగపడుతుంది. దీని ఆకులు ఆహారంగా కూడా ఉపయోగిస్తారు.



అర్క పత్రం: జిల్లేడు ఆకులను అర్క పత్రమంటారు. తెల్లజిల్లేడుతో తయారుచేసిన వినాయకప్రతిమను పూజించడం వల్ల విశేష ఫలం వుంటుందన్నది ఓ నమ్మకం. చర్మ వ్యాధులు, సెగడ్డలు, కీళ్ళ నొప్పులు, చెవిపోటు, కోరింత దగ్గు, దంతశూల, విరేచనాలు, తిమ్మిర్లు, బోధకాలు, వ్రణాలు తగ్గించడానికి ఔషధంగా పనిచేస్తుంది.

వంటిల్లు

పండగ వచ్చిందంటే అందరూ కొత్త రుచులు కోరుకుంటారు. అలాంటి మూడు వంటలను మీకు అందిస్తున్నాం.. ఆస్వాదించండి..

పండగ రుచులు



వంకాయ కొబ్బరి పులావ్

కావాల్సిన పదార్థాలు: తరిగిన వంకాయ ముక్కలు (200గ్రాములు), బిర్యానీ బియ్యం (200 గ్రాములు) తరిగిన ఉల్లిపాయ ముక్కలు (200గ్రాములు), తరిగిన పచ్చిమిర్చి (50గ్రాములు), నూనె (తగినంత), నెయ్యి(తగినంత), అల్లం పేస్ట్ (రెండు టీస్పూన్లు), కరివేపాకు (రెండు రెబ్బలు), లవంగాలు (50 గ్రాములు), ఏలక్కాయలు (50గ్రాములు), దాల్చిన చెక్క (ఒక ఇంచు), బిర్యానీ ఆకు (5గ్రాములు), తరిగిన కొత్తిమీర (50 గ్రాములు), పుదీనా (50గ్రాములు), కొబ్బరి తురుము (ఒక కప్పు), తరిగిన క్యారెట్ (100గ్రాములు), తరిగిన బీన్స్ (100గ్రాములు), తరిగిన బంగాళదుంప ముక్కలు (100గ్రాములు), ఉప్పు (తగినంత), నీళ్లు (తగినన్ని)

తయారీ విధానం: ఒక మూకుడులోకి నూనె తీసుకొని వేడి చేయాలి. దీనిలో లవంగాలు, ఏలక్కాయలు, దాల్చిన చెక్క దోరగా వేయించాలి. ఇలా వేగిన మిశ్రమంలో ఉల్లిపాయలు, అల్లంపేస్ట్, వంకాయ ముక్కలను వేసి మూత పెట్టి ఉడకనివ్వాలి. ఇలా ఉడికిన మిశ్రమంలో నీళ్లు పోయాలి. దీనిలో కడిగిన బియ్యం, క్యారెట్, బీన్స్, బంగాళదుంపలు, బిర్యానీ ఆకు, నెయ్యి వేసి ఉడకనివ్వాలి. బియ్యం బాగా ఉడికిన తర్వాత దానిలో కొత్తిమీర, పుదీనా, కొబ్బరి తురుము, ఉప్పు, కరివేపాకు వేసి కొద్ది సేపు మంట మీద మగ్గనివ్వాలి.

జాగ్రత్తలు

- పులావు పొడిపొడిగా ఉంటేనే బావుంటుంది. అందువల్ల బియ్యం ముద్దగా కాకుండా చూసుకోవాలి.
- పులావు కోసం లేత వంకాయల్ని ఎంపిక చేసుకుంటే మంచిది. వంకాయ ముక్కలను ఎక్కువగా వేగనియ్యకూడదు.



ఉగ్గాని వడలు

కావాల్సిన పదార్థాలు: మరమరాలు (100 గ్రాములు), తరిగిన అల్లం ముక్కలు (రుచికి సరిపోయినట్లుగా), తరిగిన కొత్తిమీర (మూడు టీస్పూన్లు), సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు (రెండు టీస్పూన్లు), తరిగిన పుదీనా (ఒక టీస్పూను), శనగపిండి (తగినంత), వాము,(అర టీస్పూను) జీలకర్ర (ఒక టీస్పూను), పసుపు (అర టీస్పూను), నూనె (తగినంత), ఉప్పు (తగినంత)

తయారీ విధానం: మరమరాలను 10 నిమిషాలు నీటిలో నానబెట్టి బయటకు తీసి ఒక బేసిన్‌లో వేయాలి. ఈ బేసిన్‌లోనే అల్లం ముక్కలు, కొత్తిమీర, పచ్చిమిర్చి, పుదీనా, శనగపిండి, వాము, జీలకర్ర, పసుపు, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. ఈ ముద్దను ఉండలుగా చేసి- వడలు మాదిరిగా చేతితో వత్తాలి. ఆ తర్వాత వీటిని నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.

జాగ్రత్తలు

ఈ వడలను బాగా వేడి నూనెలో వేయించకూడదు. అలా వేయిస్తే మాడిపోయే అవకాశముంది. దోరగా వేయిస్తే తినటానికి చాలా బావుంటాయి.

కుడుముల బెల్లం పాయసం

కావాల్సిన పదార్థాలు: గోధుమ పిండి (ఒక కప్పు), పాలు (అర లీటరు) నెయ్యి (సరిపోయినంత), బెల్లం పొడి (ఒక టిన్నర కప్పు), ఏలక్కాయల పొడి (ఒక టీస్పూను), జీడిపప్పు (తగినంత), కిస్‌మిస్ (తగినంత), నీళ్లు (తగినన్ని)

తయారీ విధానం: ఒక గిన్నెలో గోధుమ పిండిని తీసుకొని నీళ్లతో కలిపి చిన్న ఉండలుగా చేసుకోవాలి. మూకుడులో నెయ్యి మరిగించి- దానిలో జీడిపప్పు, కిస్‌మిస్‌లను దోరగా వేయించాలి. వీటిని తీసి బయట పెట్టుకోవాలి. ఒక గిన్నెలో పాలను బాగా మరగించాలి. పాలు బాగా మరిగిన తర్వాత దానిలో బెల్లం పొడి, ఏలక్కాయల పొడి వేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చల్లారిన తర్వాత దానిలో ముందుగా చేసుకున్న గోధుమ పిండి ఉండలను వేయాలి. ఆ తర్వాత జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేయాలి.



జాగ్రత్తలు

- పాలు బాగా వేడిగా ఉన్నప్పుడు గోధుమ పిండి ఉండలను వేయకూడదు.
- ఏలక్కాయల పొడి వేసిన తర్వాత పాలను వేడి చేయకూడదు.



చెఫ్: వి. నగేష్
వివాహ భోజనంబు,
జూబ్లీహిల్స్, హైదరాబాద్
99899 61488

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వినాయక చవితి శుభాకాంక్షలు

శనివారం | 7-9-2024 | పేజీలు: 16 + 32 పేజీల వినాయక ప్రత్యేకం | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 144 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్టీ పగ్గాలు

తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకం

- బీసీ నేతకు పట్టం కట్టిన పార్టీ అధిష్ఠానం
- డీఎస్ తర్వాత నిజామాబాద్ జిల్లా నుంచి రెండో వ్యక్తి
- ఎన్ఎస్‌యూఐ నుంచి మహేశ్‌కుమార్ ప్రస్థానం
- పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కీలక స్థాయికి చేరిక
- పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషిచేస్తా: మహేశ్

న్యూఢిల్లీ/హైదరాబాద్/నిజామాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) నూతన అధ్యక్ష నియామకంపై ఊహాగానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎట్టకేలకు తెరదించింది. అందరూ ఊహించినట్లుగానే బీసీ నేతకే పట్టం కట్టింది. టీపీసీసీకి కొత్త అధ్యక్షుడిగా బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తూ



మిగతా 11వ పేజీలో...

జగన్ బుర్రలో 'బురద'!

తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో బురద రాజకీయం పరాకాష్ఠకు చేరుకుంది. అబద్ధాలే పునాదులుగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన జగన్మోహన్ రెడ్డి ప్రస్తుత వరదలపై కూడా అబద్ధాలను ప్రచారం చేస్తూ ఆనందిస్తున్నారు.

అమరావతిలో రాజధాని మొదటి నుంచీ ఇష్టం లేని జగన్మోహన్ రెడ్డి తన రోత మీడియా ద్వారా రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేయించారు. చంద్రబాబు తన ఇల్లు మునగకుండా కాపాడుకోనేందుకే ముందస్తు హెచ్చరికలు లేకుండా బుడమేరు గేట్లు ఎత్తేశారని జగన్ రెడ్డి తన అజ్ఞానాన్ని ప్రదర్శించారు.

4

చంద్రబాబు అర్ధరాత్రి అపరాత్రి తేడా లేకుండా బాధితులను ఆదుకోవడానికి మోకాళ్ల లోతు బురదను సైతం లెక్కచేయకుండా తిరుగుతుండగా, జగన్ మాత్రం కాసేపు నీళ్లలోకి దిగి ఫొటోలకు పోజులిచ్చి బురద రాజకీయాలకు తెరలేపారు.

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజధానిగా ఎంపిక చేసిన అమరావతికి ముంపు ప్రమాదం ఉందని ప్రచారం చేసిన జగన్ రెడ్డి.. ఇప్పుడు కూడా రాజధాని మునిగిపోయిందని చెత్త ప్రచారం మొదలుపెట్టారు. రాజధాని మునిగిపోయి ఉంటే హైకోర్టు, సచివాలయం ఎలా పని చేస్తున్నాయనే ఇంగితం లేకుండా రోత మీడియా కథనాలను వండి వార్చింది.



కొత్త పలుకు

బుడమేరు కట్టలు తెగడానికి ఇబ్రహీంపట్నం వద్ద 24 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్లాంట్ కారణం అని సరికొత్త ప్రచారానికి తెర లేపారు. 1998లో అప్పటి ప్రభుత్వ పాలసీ ప్రకారం ఆ ప్లాంట్‌కు జెన్‌కో అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు అనుమతించారు. ఈ ప్లాంట్ వల్ల వచ్చే ఆదాయంతోనే 'ఆంధ్రజ్యోతి' పత్రిక నడుస్తోందని నమ్మిన ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2009 తర్వాత దీనికి అనుమతులు రద్దు చేశారు. ఆ తర్వాతి ప్రభుత్వాలు పునరుద్ధరించినా జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ప్లాంట్‌కు అనుమతులు రద్దు చేశారు. నష్టపరిహారం ఇవ్వకుండా ప్లాంట్ తొలగిస్తే ఎలా? అని మాత్రమే మేం హైకోర్టును ఆశ్రయించాం. జరిగింది ఇది కాగా, చంద్రబాబు నాకు ఏదో మేలు చేశారని రోత పత్రికలో ప్రచారం చేస్తున్నారు.


చిత్రమేమిటంటే కృష్ణా నదికి వరద వస్తే ఈ ప్లాంట్ కూడా మునిగిపోతుంది. ఇప్పుడు కూడా మునిగిపోయింది. కృష్ణా నదికి భారీ వరద వచ్చినప్పుడు బుడమేరు నీరు నదిలో వెళ్లే అవకాశమే లేదు. ఇబ్రహీంపట్నం లోతట్టు ప్రాంతాలు కృష్ణా వరదల్లో మునిగిపోకుండా ఉండటానికి ఈ ప్లాంట్ రక్షణగా నిలబడిన సందర్భాలూ ఉన్నాయి. జగన్ రోత మీడియాలో చేస్తున్న ప్రచారం నిజమని రుజువు చేస్తే ఆ ప్లాంట్‌ను మా సొంత ఖర్చుతో తొలగించడానికి సిద్ధంగా ఉన్నాం.

రాజ్యసభలో తన పార్టీకి ఉన్న బలంపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆధారపడి ఉందని జగన్ రెడ్డి ఇప్పటిదాకా దిలాసాగా ఉన్నారు. ఇప్పుడు బీజేపీ ఒక వైపు నుంచి, టీడీపీ మరోవైపు నుంచి రాజ్యసభ సభ్యులను జగన్‌కు దూరం చేసే పనిలో ఉన్నాయి.

'గేయ కిరీటి' వడ్డేపల్లి కృష్ణ ఇక లేరు

- లలిత గీతాల రచయితగా ఖ్యాతి
- సినిమా పాటలతోనూ పేరు
- 'నంది' కమిటీ చైర్మన్‌గా, ఉమ్మడి ఏపీ సెన్సార్ సభ్యుడిగా సేవలు

9



జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూత

- బ్రెయిన్ ట్యూమర్‌తో అస్వస్థత..
- నెలన్నర నుంచి ఆస్పత్రిలో బీఆర్ఎస్ నేత
- పరిస్థితి విషమించడంతో భువనగిరికి..
- అశ్రునయనాలతో ప్రజల వీడ్కోలు
- తెలంగాణ ఉద్యమంలో జిట్టా చెరగని ముద్ర

2



బీసీ కమిషన్ చైర్మన్‌గా
నిరంజన్

- విద్య, రైతు కమిషన్ల సారథులుగా ఆకునూరి మురళి, కోదండరెడ్డి
- బీసీ కమిషన్‌లో ముగ్గురు సభ్యులు, కార్యదర్శిగా కమిషనర్
- ఒకేసారి.. రైతు కమిషన్ ఏర్పాటు, చైర్మన్ నియామకం
- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



నిరంజన్

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూడు కమిషన్లకు చైర్మన్లను ప్రకటించింది. కుల గణన నేపథ్యంలో చైర్మన్ సహా ఐదుగురితో కీలకమైన బీసీ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఎన్నికల హామీల మేరకు కీలకమైన విద్య, రైతు కమిషన్లకూ సారథులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ కమిషన్ చైర్మన్‌గా గోపిశెట్టి నిరంజన్, సభ్యులుగా రాయపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిని నియమించగా, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను నిర్ధారించేందుకు బీసీల గణన కోసం దీనినే అధీకృత (డెడికేటెడ్) కమిషన్‌గా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, విద్యా కమిషన్‌కు రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళిని, వ్యవసాయ-రైతు సంక్షేమ కమిషన్‌కు కాంగ్రెస్

మిగతా 11వ పేజీలో...

మనం దేవుళ్లమో.. కాదో ప్రజలే నిర్ణయిస్తారు

» ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

పుణె, సెప్టెంబరు 6: మనం దేవుళ్లమో.. కాదో ప్రజలే నిర్ణయిస్తారని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. శంకర్ దినకర్ కానే(భయ్యాజీ)1971లో మణిపూర్‌లో చేసిన సేవలను స్మరించుకుంటూ పుణెలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేవుళ్లమని మనమే ప్రకటించుకోకూడదని అన్నారు. కొందరు మెరుపులా ప్రకాశించాలని అనుకొంటారని, కాని అది నేలను తాకిన తర్వాత అక్కడ మునుపటి కంటే చీకటిగా మారుతుందని పేర్కొన్నారు. పనిమంతులు దీపంలా ఉండాలని, అవసరమైనప్పుడు వెలుగును పంచాలని సూచించారు. శంకర్ దినకర్ 1971 వరకు మణిపూర్‌లో బాలల విద్య కోసం పని చేశారు. మణిపూర్ విద్యార్థులను మహారాష్ట్ర తీసుకువచ్చి వారి చదువుకు తోడ్పడ్డారు. ప్రస్తుతం మణిపూర్‌లో ఘర్షణలతో నెలకొన్న పరిస్థితులు అత్యంత సవాలుగా మారాయని భగవత్ వివరించారు. అక్కడ నెలకొన్న ఘర్షణల్లో 200 మంది మరణించగా, 60,000 మంది నిరాశ్రయులుగా మారారు. ఇంతటి కఠిన పరిస్థితుల్లో కూడా ఆర్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అక్కడే ఉండి పనిచేస్తున్నారని ఆయన చెప్పారు.

రూ.20 లంచం తీసుకున్న మాజీ పోలీసును అరెస్టు చేయండి

» బెయిల్ తీసుకొని 25 ఏళ్లుగా పరార్

» 34 ఏళ్ల నాటి ఘటనలో విజిలెన్స్ కోర్టు తాజా ఆదేశం

పట్నా, సెప్టెంబరు 6: కూరగాయలు అమ్ముకొనే మహిళ నుంచి 34 ఏళ్ల క్రితం రూ.20 లంచం తీసుకున్న మాజీ పోలీసు కానిస్టేబుల్‌ను అరెస్టు చేయాలని బిహార్‌లోని స్పెషల్ విజిలెన్స్ కోర్టు గురువారం డీజీపీని ఆదేశించింది. ఈ కేసులో ఆయనకు ఇచ్చిన బెయిల్ రద్దయినా 25 ఏళ్లుగా పరారీలో ఉంటూ కోర్టుకు హాజరు కాకపోవడంతో మళ్లీ అరెస్టు చేయాలంటూ ఆదేశాలు ఇచ్చింది. సురేష్ ప్రసాద్ సింగ్ అనే కానిస్టేబుల్ గతంలో సహర్స రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వర్తించేవాడు. 1990 మే ఆరో తేదీన ఓ మహిళ నుంచి రూ.20 లంచం తీసుకున్నాడు. అతనిపై కేసు నమోదు కాగా, అనంతరం బెయిల్ మంజూరయింది. అయితే 1999 నుంచి అతను పరారీలో ఉండడంతో బెయిల్ రద్దయింది. ఆస్తులను జప్తు చేస్తున్నట్టు నోటీసు ఇచ్చినా స్పందించలేదు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేయగా సర్వీసు రికార్డులో నమోదుకు తప్పుడు చిరునామా ఇచ్చినట్టు తేలింది. పోలీసుల అవినీతిపై పెండింగ్ కేసులను ఇటీవల పరిశీలించిన స్పెషల్ విజిలెన్స్ జడ్జి సుదేశ్ శ్రీవాస్తవ ఈ కేసును గుర్తించారు. పరారీలో ఉన్న మాజీ కానిస్టేబుల్‌ను అరెస్టు చేయాలంటూ ఆదేశాలు ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన ఢిల్లీ ఆప్ ఎమ్మెల్యే గౌతం

» ఇండియా కూటమిలో విభేదాలు!

ఢిల్లీ, సెప్టెంబర్ 6: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ఓ పక్క చర్చలు జరుగుతుండగానే ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కాంగ్రెస్‌లోకి జంప్ చేస్తున్నారు. తాజాగా ఢిల్లీ సీమాపురి నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ క్యాబినెట్ మంత్రి, దళిత నేత రాజేంద్ర పాల్ గౌతం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, దేవేందర్ యాదవ్, పవన్ ఖేరా సమక్షంలో గౌతం హస్తం పార్టీలో చేరారు. వచ్చే ఏడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో గౌతం చేరికకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆప్ నుంచి వలసలు పార్టీకి లాభించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు దళిత హక్కుల కోసం గట్టిగా పోరాడే నేతగా పేరున్న గౌతం పార్టీని వీడటం పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్లేనని ఆమ్ ఆద్మీ నేతలంటున్నారు. మరోవైపు ఇండియా కూటమిలో విభేదాలు వచ్చే అవకాశముందని విశ్లేషకులు చెబుతున్నారు.

'ఏఐ 2024 అత్యంత ప్రభావశీలుర' జాబితాలో కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్

» టైమ్ మేగజీన్ ప్రశంస

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ టైమ్ మేగజీన్ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'ఏఐ 2024లో అత్యంత ప్రభావశీల ప్రజలు' జాబితాలో చోటు దక్కించుకున్నారు. 100 మందితో రూపొందించిన ఈ జాబితాలో ఆయనతో పాటు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ తదితరులు కూడా ఉన్నారు. గురువారం విడుదల చేసిన ఈ జాబితాలో 15 మంది భారతీయులు/భారత సంతతి వ్యక్తులు ఉండడం విశేషం. వీరిలో గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల కూడా ఉన్నారు. కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ నాయకత్వంలో సెమీకండక్టర్ తయారీ రంగంలో భారత్ టాప్ 5 దేశాల్లో ఒకటిగా నిలవనుందని మేగజీన్ కొనియాడింది. ఆధునిక ఏఐ సిస్టమ్‌లలో రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్లదే కీలక పాత్ర అని పేర్కొంది. అయితే ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో వైష్ణవ్ పలు సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపింది.

విజయవంతంగా అగ్ని-4 క్షిపణి ప్రయోగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) రూపొందించిన అగ్ని-4 బాలిస్టిక్ క్షిపణిని శుక్రవారం ఒడిసాలోని చాందీపూర్ క్షేత్రం నుంచి విజయవంతంగా ప్రయోగించినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. న్యూక్లియర్ కమాండ్ అథారిటీ పరిధిలోని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. 20 మీటర్ల పొడవు ఉన్న ఈ క్షిపణి 4,000 కి.మీ.దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలుగుతుంది. 1,000 కిలోల మందుగుండు సామగ్రిని తీసుకెళ్తుంది. నేలమీద తిరగగలిగే లాంచర్ ద్వారా దీన్ని ప్రయోగించవచ్చు. 2012లో తొలిసారిగా అగ్ని-4ను ప్రయోగించినప్పుడు అది 20 నిమిషాల్లో 3,000 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించింది. దాన్ని వృద్ధి చేసి ప్రస్తుతం ప్రయోగించారు.



85% జిల్లాల్లో అసాధారణ విపత్తులు

ఐదు దశాబ్దాల్లో 4 రెట్లు పెరిగిన తీవ్రత.. 45% జిల్లాల్లో కరువు నేలల్లో వరదలు

» ఈపీఐ-గ్లోబల్, ఈఎస్ఆర్ఐ ఇండియా అధ్యయనం



న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: రోజులతరబడి ముసురేసి, వాగుల్ని, వంకల్ని ఏకం చేసి జనావాసాల్ని ముంచేసే వర్షాలు.. హో..రుమంటూ తీరాన్ని తాకి బీభత్సం సృష్టించే ప్రళయ భీకర తుఫాన్లు.. మండుటెండలను మించి చుర్రున కాల్చేసే ఎండలు.. తీవ్రమైన కరువు కాటకాలు! ...దేశంలోని 85 శాతానికి పైగా జిల్లాలు ఇటీవలికాలంలో ఇలాంటి అసాధారణ ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటున్నాయని ఐపీఈ గ్లోబల్, ఈఎస్ఆర్ఐ-ఇండియా తాజా అధ్యయనం వెల్లడించింది! ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో కరువు పరిస్థితులు నానాటికీ పెరుగుతున్నట్టు తెలిపింది. బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, అసోం రాష్ట్రాల్లోని 60 శాతానికిపైగా జిల్లాలు కనీసం ఏడాదికి ఒక్క అసాధారణ ప్రకృతి ఉత్పాతాన్నైనా చవిచూస్తున్నట్టు వెల్లడైంది. సాధారణంగా ప్రకృతి విపత్తులంటేనే భయంకరంగా ఉంటాయి. కానీ, పర్యావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ఆ విపత్తులు ఇలా అసాధారణ స్థాయిలో ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని ఆ అధ్యయనం పేర్కొంది. గడిచిన ఐదు దశాబ్దాల్లో ఇలాంటి అసాధారణ ప్రకృతి విపత్తుల తరచుదనం(ఫ్రీక్వెన్సీ), తీవ్రత (ఇంటెన్సిటీ), అనూహ్యత(అన్‌ప్రెడిక్టబిలిటీ) నాలుగు రెట్లు పెరిగాయని వెల్లడించింది. గడిచిన దశాబ్దకాలంలో అయితే.. ఏకంగా ఐదురెట్ల పెరుగుదల ఉన్నట్టు తెలిపింది. అంతేకాదు.. 45% జిల్లాల్లో కరువునేలలను వరదలు ముంచేస్తుండగా, వరదలు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో కరువుకాటకాలు విలయతాండవం చేస్తున్నాయని ఈ అధ్యయన నివేదిక ఆందోళన వెలిబుచ్చింది. 1973 నుంచి 2023 నడుమ.. ఐదు దశాబ్దాల కాలంలో నమోదైన అసాధారణ ప్రకృతి విపత్తులను ఈ స్టడీలో భాగంగా విశ్లేషించారు. 'లీవరేజింగ్ జీఐఎస్ టెక్నాలజీ టు మిటిగేట్ క్లైమేట్ రిస్క్స్' పేరిట రూపొందించిన ఈ నివేదికను.. ఐపీఈ గ్లోబల్, ఈఎస్ఆర్ఐ ఇండియా కలిసి ఢిల్లీలో నిర్వహిస్తున్న క్లైమేట్ టెక్నాలజీ సదస్సు'లో ఆవిష్కరించారు. ఆ నివేదిక ప్రకారం..

- పెరిగిన కర్బన ఉద్గారాలు, ఒక పద్ధతి లేని ల్యాండ్‌స్కేప్ ప్లానింగ్, ప్రకృతిలోని మిగతా జీవులను ఏమాత్రం పట్టించుకోకుండా మనుషులే ప్రధానంగా భావించి చేపట్టే కార్యకలాపాలే ఈ అసాధారణ ప్రకృతి విపత్తులకు కారణం.
- దేశంలోని తూర్పు ప్రాంత జిల్లాలు అసాధారణ వరదల బారిన పడే ముప్పు ఎక్కువగా ఉంది.
- వరదప్రాంతాల నుంచి కరువు ప్రాంతాలుగా మారిన జిల్లాల జాబితాలో.. తెలుగు రాష్ట్రాలకు చెందిన మహబూబ్‌నగర్, నల్లగొండ, శ్రీకాకుళం, గుంటూరు, కర్నూలు ఉన్నాయి.

ఏం చేయాలి?

అసాధారణ ప్రకృతి విపత్తుల సంఖ్య పెరగడాన్ని నిరోధించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి కూడా నివేదిక పేర్కొంది. ఇందుకోసం.. నేషనల్ రిసైలెన్స్ ప్రోగ్రామ్ కింద.. క్లైమేట్ రిస్క్ అబ్జర్వేటరీ'ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. దాని ద్వారా భవిష్యత్తు ముప్పులను ముందే అంచనా వేసి, ఆ మేరకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, నగర స్థాయుల్లో నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. అలాగే.. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్లైమేట్ ఫండ్ (ఐసీఎఫ్)'నొకదాన్ని ఏర్పాటు చేసి పర్యావరణమార్పులకు ఎక్కువగా ప్రభావితం కాని కీలక మౌలిక వసతులను కల్పించాలని పేర్కొంది. కాగా.. మనదేశంలో తలసరి కర్బన ఉద్గారాల విడుదల అంతర్జాతీయ సగటుతో పోలిస్తే మూడో వంతు. అమెరికా చైనా వంటి దేశాలతో పోలిస్తే పిసరంతే! అయినా, పర్యావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నది మనదేశమేనని ఐపీఈ గ్లోబల్ వ్యవస్థాపకుడు, ఎండీ అశ్వజిత్ సింగ్ ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికే మానవాళిని పట్టిపీడిస్తున్న సమస్యలను పర్యావరణమార్పు మరింత పెంచుతుందని ఆయన హెచ్చరించారు. పర్యావరణ మార్పును ఎదుర్కొందుకు భారతదేశం ఇప్పటికీ 'మిటిగేషన్' విధానాన్నే అనుసరిస్తోందని.. దానికి బదులు 'అడాప్టేషన్' విధానాన్ని ఎంచుకోవాలని సూచించారు ('మిటిగేషన్' అంటే.. కర్బన ఉద్గారాలను తగ్గించుకోవడం వంటివి. అడాప్టేషన్ అంటే.. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా నడుచుకోవడం. అంటే.. మొక్కలు నాటడం, చెట్లు నరకకుండా ఉండం, ఏసీల వాడకం అవసరం లేకుండా సహజంగానే ఇళ్లు, కార్యాలయాలను చల్లగా ఉంచే విధానాల్లో నిర్మాణాలు చేపట్టడం వంటివి. కేరళలో ఇటీవల కొండచరియలు విరిగిపడ్డ ఘటన, గుజరాత్‌లో వరదలు, క్యుములోనింబస్ మేఘాలు గర్జించి.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టుగా అతి తక్కువ వ్యవధిలో భారీ వర్షాలు కురవడం వంటి ఘటనలు పర్యావరణమార్పు ప్రభావమేనని ఐపీఈ-గ్లోబల్‌కు చెందిన అవినాశ్ మొహంతీ పేర్కొన్నారు. 2036 నాటికి 147 కోట్ల మంది భారతీయులు ఈ అసాధారణ ప్రకృతివిపత్తుల బారిన పడతారని తమ విశ్లేషణలో వెల్లడైనట్టు తెలిపారు.

డబ్బుపై కాంక్ష లేదమ్మా.. నా పేరు పక్కన డిగ్రీలుండాలి

» రోగులకు సేవ చేయాలి.. నా బిడ్డ ఎప్పుడూ ఇవే చెప్పేది

» జూనియర్ వైద్యురాలి తల్లి ఆవేదన

కోల్‌కతా, సెప్టెంబరు 6: తమ కూతురు దారుణ హత్యాచార ఘటన మిగిల్చిన విషాదం నుంచి జూనియర్ వైద్యురాలి తల్లిదండ్రులు ఇంకా తేరుకోవడం లేదు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హతురాలి తల్లి విడుదల చేసిన ఓ బహిరంగ లేఖ మానవతావాదులను కన్నీరు పెట్టిస్తోంది. తమ కుమార్తెకు డాక్టర్ కావాలనే కోరిక బలంగా ఉండేదని చెబుతూ.. 'అమ్మా.. నాకు డబ్బు మీద మోజు లేదు.. నా పేరు పక్కన వైద్యురాలిగా డిగ్రీలు ఉండాలి.. నేను ఎప్పుడూ రోగులకు వైద్యసేవలు చేస్తూ ఉండాలి' అని తనతో అనేదని ఆ తల్లి లేఖలో పేర్కొంది. ఆమె కన్న ఈ కలలన్నింటినీ చిదిమేశారని ఆవేదన వ్యక్తింది. చిన్నప్పటి నుంచి తమ కూతురు డాక్టర్ కావాలని కలలు కన్నదని.. ఆ దిశగా ఆమెను ఉపాధ్యాయులు వెన్నుతట్టి ప్రోత్సహించడంతోనే తన స్వప్నం నెరవేరిందని.. ఇందుకు ఆ టీచర్లందరికీ ధన్యావాదాలు తెలుపుకొంటున్నానని పేర్కొంది. ఆర్జీకర్ ఆస్పత్రిలోని ఘటనాస్థలిలో ఆధారాలను చెరిపేసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆమె ఇప్పటికే ఆరోపించిన సంగతి తెలిసిందే. కాగా ఆర్జీకర్ ఆస్పత్రిలో ఆర్థిక అవకతవకలకు సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శుక్రవారం దాడులు చేసింది. ఘోష్ సహచరుల ఇళ్లలోనూ సోదాలు జరిగాయి.

లోకం తీరు



రూ.2వేల లోపు పేమెంట్స్‌కూ జీఎస్టీ?

» అగ్రిగేటర్ల ద్వారా జరిపే చెల్లింపులకు..

» ఈ నెల 9న జీఎస్టీ మండలి భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు రూ.2వేలలోపు లావాదేవీలపై జీఎస్టీ విధించమని చెప్పిన మోదీ సర్కారు ఇప్పుడు ఆ భారం మోపేలా ఉంది. రేజర్‌పే, పైన్‌లాబ్స్ వంటి పేమెంట్ అగ్రిగేటర్ల ద్వారా ప్రజలు జరిపే చెల్లింపులకు కూడా వస్తుసేవల పన్ను (జీఎస్టీ)ను విధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు వీటి ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డులతో జరిపే లావాదేవీల్లో రూ.2వేలకు పైబడిన వాటిపైనే జీఎస్టీ వసూలు చేస్తున్నారు. అయితే రూ.2వేలలోపు చెల్లింపులపైనా 18 శాతం జీఎస్టీ విధించే ప్రతిపాదనను జీఎస్టీ మండలి పరిశీలిస్తున్నట్టుగా తెలుస్తోంది. సోమవారం (9వ తేదీన) ఢిల్లీలో జరగనున్న జీఎస్టీ మండలి సమావేశంలో దీనిపై చర్చించనున్నారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు 2017 నుంచి రూ.2వేలలోపు చెల్లింపులపై పేమెంట్ అగ్రిగేటర్ల (పీఏ)కు జీఎస్టీ మినహాయింపును ఇస్తున్నారు. దీని వల్ల చెల్లింపులు చేసే ప్రజలపై భారం పడటం లేదు. అయితే ఈ పేమెంట్ అగ్రిగేటర్లు బ్యాంకింగ్ కంపెనీలు, ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్లు లేదా ఎన్‌బీఎఫ్‌సీల కిందకు రారని, ఈ అగ్రిగేటర్లు ఇంటర్‌మీడియటరీలుగా వ్యవహరిస్తున్నట్టు చట్టం చెబుతోంది. ఈ నేపథ్యంలో రూ.2వేలలోపు అగ్రిగేటర్ల ద్వారా జరిపే చెల్లింపులపై జీఎస్టీ విధించాలని మండలి నామినేట్ చేసిన ఫిట్‌మెంట్ కమిటీ సిఫారసు చేసినట్టు తెలుస్తోంది. దీంతో జీఎస్టీ మండలి సమావేశంలో దీనికి ఓకే చెబుతారా లేదా అనేది తేలనుంది. రూ.2వేల లోపు అగ్రిగేటర్ల ద్వారా జరిపే చెల్లింపులపై జీఎస్టీ విధిస్తే ఆ భారాన్ని వారు వినియోగదారులకు బదిలీ చేసే అవకాశం ఉంటుంది. టీ స్టాళ్లను నిర్వహించే వారి నుంచి భారీ ఈ-కామర్స్ కంపెనీల వరకు ఈ అగ్రిగేటర్ల సేవలు అందుతున్నాయి.

కాంగ్రెస్‌లోకి ఫొగట్, పునియా

» ఖర్గేతో భేటీ తర్వాత వేణుగోపాల్ సమక్షంలో పార్టీలో చేరిన రెజ్లర్లు



కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో ఫొగట్, బజరంగ్ పునియా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 6: రెజ్లర్లు వినేశ్ ఫొగట్, బజరంగ్ పునియా కాంగ్రెస్‌లో చేరారు. వీరిద్దరూ కాంగ్రెస్‌లో చేరతారంటూ కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. రెండు రోజుల కిందట ఇద్దరూ వెళ్లి రాహుల్ గాంధీని కూడా కలిశారు. కొద్ది రోజుల్లో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఫొగట్, పునియా శుక్రవారం కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం. తొలుత వీరిద్దరూ ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి, ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ హరియాణా ఇన్‌చార్జి దీపక్ బబారియా సమక్షంలో కాంగ్రె స్ కండువా కప్పుకొన్నారు. అనంతరం విలేకరులతో వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఫొగట్, పునియాలు రాహుల్‌ను కలిసినందుకు రైల్వే అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారని చెప్పారు. రాజకీయ నేతలను కలవడం ద్వారా సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతను కలవడం నేరమా? అని ప్రశ్నించారు. కాగా, శుక్రవారం ఫొగట్ రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేసినట్లు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఫొగట్ మాట్లాడుతూ.. రెజ్లింగ్ క్రీడాకారిణిగా తనకు అండగా నిలిచిన దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని.. వారి ఆకాంక్షలకు అనుగుణంగానే తాను ఆడినట్లు భావిస్తున్నానని చెప్పారు. తాము క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం గర్వంగా ఉందన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన రెజ్లర్ వినేశ్ ఫొగట్ హరియాణాలోని జులానా నుంచి అసెంబ్లీకి పోటీ చేయనున్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ తొలి జాబితాలో ఆమె పేరు ఉంది. మరో రెజ్లర్ బజరంగ్ పునియాను అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు.

భారత్ నుంచి రహస్యంగా ఎలక్ట్రానిక్స్ కొనుగోళ్లు!

» ఉక్రెయిన్‌పై యుద్ధంలో పైచేయికి రష్యా వ్యూహం

» పశ్చిమ దేశాలకు తెలియకుండా అమలు.. వెల్లడించిన ఫైనాన్షియల్ టైమ్స్

లండన్, సెప్టెంబరు 6: ఉక్రెయిన్‌పై యుద్ధంలో పైచేయి సాధించటానికి రష్యా.. భారత్ నుంచి ఎలక్ట్రానిక్స్ తదితర కీలక సామగ్రిని, టెక్నాలజీలను రహస్యంగా కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడైంది. పశ్చిమ దేశాలకు తెలియని మార్గాల ద్వారా వీటి సేకరణ జరుగుతున్నట్లు తెలిసింది. బ్రిటన్‌కు చెందిన ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక దీనికి సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం.. 2022 అక్టోబరులో రష్యా పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వశాఖ దాదాపు రూ.8,200 కోట్ల (ఆ సమయంలో వంద కోట్ల డాలర్లకు సమానం) మేర ఖర్చు చేసి భారత్ నుంచి కీలకమైన ఎలక్ట్రానిక్స్‌ను కొనాలని ప్రణాళిక రచించింది. భారత్‌కు చమురు విక్రయాల ద్వారా రష్యా బ్యాంకుల్లో నగదు రూపంలో పోగుపడిన రూపాయలను ఈ విధంగా ఖర్చు చేయవచ్చని రష్యా ప్రభుత్వం భావించింది. రష్యా-భారత్ సంయుక్తంగా ఉత్పత్తి చేసి అభివృద్ధి పరిచే ఎలక్ట్రానిక్స్ సంస్థలకు పెట్టుబడులను భారీ ఎత్తున తరలించాలని కూడా నిర్ణయించింది. ఈ మేరకు కొన్ని లీకైన ఉత్తర ప్రత్యుత్తరాలను ఫైనాన్షియల్ టైమ్స్ ప్రస్తావించింది. కొన్ని రకాల ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, యంత్రాలకు సంబంధించి 2022 సంవత్సరం మధ్యలో భారత్ నుంచి రష్యా పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరిపినట్లుగా ఆధారాలున్నాయని తెలిపింది. ఇన్నోవియో వెంచర్స్ అనే భారత కంపెనీ 49 లక్షల డాలర్ల విలువైన డ్రోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలను రష్యాకు సరఫరా చేసిందని, కిర్గిస్థాన్‌కు 6 లక్షల డాలర్ల విలువైన సామగ్రిని పంపిందని వెల్లడించింది. 5.68 లక్షల డాలర్ల విలువైన రేడియో ఎలక్ట్రానిక్ సిస్టమ్స్‌ను రష్యా కంపెనీ టెస్ట్‌కాంప్లెక్ట్ భారత్ నుంచి దిగుమతి చేసుకుందని, రష్యా మిలిటరీ సామగ్రి సేకరణలో ఈ కంపెనీ ప్రధాన పాత్ర పోషిస్తున్నదని పేర్కొంది. సదరు కంపెనీపై అమెరికా, ఈయూ ఆంక్షలు ఉన్న విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో గుర్తు చేసింది.

బీఆర్‌ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి కన్నుమూత

బ్రెయిన్ ట్యూమర్‌తో అస్వస్థత.. నెలన్నర నుంచి ఆస్పత్రిలో..

» పరిస్థితి విషమించడంతో లామాపై భువనగిరికి తరలింపు

» సొంతగడ్డపై కన్నుమూయాలన్న కోరికతో వెంటిలేటర్ తొలగింపు

» అశ్రునయనాలతో వీడ్కోలు జన సంద్రమైన భువనగిరి

» టీఆర్‌ఎస్‌తో రాజకీయాల్లోకి కాంగ్రెస్, వైసీపీలో సేవలు

» యువ తెలంగాణ పేరిట సొంత పార్టీ

» ఎన్నికల ముంగిట కాంగ్రెస్‌లోకి వెంటనే బీఆర్‌ఎస్‌లోకి..

» మంచి స్నేహితుడిని కోల్పోయా: రేవంత్





బాలకృష్ణారెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న హరీశ్‌రావు



బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీ, యాదాద్రి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధనే లక్ష్యంగా యువతను సంఘటితం చేసి మలి దశ ఉద్యమంలో క్రియాశీల ప్రాత పోషించిన జిట్టా బాలకృష్ణారెడ్డి (52) కన్నుమూశారు. ఏ పార్టీలో ఉన్నా.. ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించిన ఆయన బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ కన్నుమూశారు. అస్వస్థతకు గురవడంతో జూలై 22న బాలకృష్ణారెడ్డి సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చేరారు. మధ్యలో ఆరోగ్యం కొంత మెరుగుపడడంతో ఐసీయూ నుంచి ప్రత్యేక గదికి తరలించారు. కానీ, ఇన్‌ఫెక్షన్లు, పలు అవయవాల పనితీరు దెబ్బతినడంతో పరిస్థితి విషమించింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా చికిత్సకు బాలకృష్ణారెడ్డి శరీరం సహకరించలేదు. ఆరోగ్యం విషమించడంతో రెండు రోజులుగా వెంటిలేటర్‌పై ఉంచారు. శుక్రవారం ఉదయం లామా (Leaving against medical advice)పై బాలకృష్ణారెడ్డిని కుటుంబ సభ్యుల తోడుగా ఇంటికి పంపించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పుట్టిన గడ్డపైనే తుది శ్వాస వదలాలనే బాలకృష్ణారెడ్డి కోరిక మేరకు భువనగిరికి తీసుకొచ్చారు. భౌతిక కాయాన్ని.. అమరుల స్తూపం వద్ద కొంతసేపు ఉంచాక కిలోమీటరు దూరంలో మగ్గంపల్లిలో ఉన్న ఆయన ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లారు. అభిమానుల కోసం 4 గంటల పాటు అక్కడ ఉంచారు. స్వగ్రామం భువనగిరి మండలం బొమ్మాయిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

సామాజిక సేవకు కదిలి.. యువతను ఏకం చేసి

భువనగిరి జిల్లాలో తెలంగాణ మలి దశ ఉద్యమమంటే గుర్తుకొచ్చేది జిట్టా బాలకృష్ణారెడ్డి. తన ఆశ, ఆశయం, ఆకాంక్ష తెలంగాణనే అంటూ అనేక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చారు. తెలంగాణ సంప్రదాయ, సంస్కృతికి అద్దంపట్టేలా భువనగిరిలో కార్యక్రమాలు నిర్వహించారు. యువతను చైతన్యపరిచి ఆరోగ్య శిబిరాలు, గ్రామీణ క్రీడలు, శ్రమదానాలు, రక్తదానాలను ప్రోత్సహించారు. డాక్టర్ చిలుముల రాంచంద్రారెడ్డి ఫౌండేషన్ సాయంతో 2003లో రూ.1.20 కోట్లతో భువనగిరిలో అమ్మమ్మ, తాతయ్యలు చిలుముల శివరాజిని, నారాయణరెడ్డి పేరిట ప్రభుత్వ కళాశాలను నిర్మించారు. 106 గ్రామాల్లో రూ.3.50 కోట్లతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఎయిమ్స్ స్థాపన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో నేషనల్ యూత్ ఫెస్టివల్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నుంచి నేషనల్ యూత్ అవార్డు అందుకున్నారు. 2005లో మూసీ పరిరక్షణ యాత్ర చేపట్టారు. 1998లో రంగారెడ్డి జిల్లా యువజన, 1999లో హైదరాబాద్ జూనియర్ చాంబర్స్ సామాజిక సేవ, 2005లో భారత ప్రభుత్వం నుంచి జాతీయ ఉత్తమ యువజన సేవా పురస్కారం అందుకున్నారు.

కన్నీరుమున్నీరైన అభిమానులు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మందుల సామేల్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, తీన్మార్ మల్లన్న, బీఆర్‌ఎస్ కీలక నేతలు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు జిట్టా భౌతిక కాయానికి నివాళులర్పించారు. భువనగిరిలోని అమర వీరుల స్తూపం వద్ద జిట్టాను చూడగానే అభిమానులు కన్నీరుమున్నీరయ్యారు. ఫాంహౌస్‌కు భారీ ర్యాలీగా వెళ్లారు. జిట్టా చేపట్టిన ఉద్యమాలను గుర్తుచేస్తూ కళాకారులు పాటలు పాడారు.

సీఎం రేవంత్, దత్తాత్రేయ దిగ్భ్రాంతి

జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువతను ఏకం చేసి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారని, ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మంచి స్నేహితుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. జిట్టా బాలకృష్ణారెడ్డి యువకుడు, జాతీయ భావాలున్న నాయకుడని, సమాజ సేవకు అంకితభావంతో పనిచేశారని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.

20 ఏళ్ల వయసులోనే.. మేనమామ ప్రోద్బలంతో

బొమ్మాయిపల్లిలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి, రాధమ్మ దంపతులకు 1972లో మొదటి సంతానంగా జన్మించారు బాలకృష్ణారెడ్డి. 1993లో హైదరాబాద్ ఎల్బీనగర్ డీవీఎం కళాశాల నుంచి బీకాం పూర్తి చేశారు. అమెరికాలో ఉండే మేనమామ డాక్టర్ చిలుముల రామచంద్రారెడ్డి ప్రోద్బలంతో 1992లో వివేకానంద యువజన సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణారెడ్డి ప్రస్థానం మొదలుపెట్టారు. యువజన సంఘాల సమితి రాష్ట్ర, నార్త్ అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2003లో టీఆర్‌ఎస్‌లో చేరి 2007లో ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ టికెట్ దక్కకపోవడంతో భువనగిరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2009లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయన హఠాన్మరణం తర్వాత వైసీపీలోకి వెళ్లారు. ఆ పార్టీ తెలంగాణ వ్యతిరేక ధోరణి నచ్చక బయటకు వచ్చారు. 2010లో యువ తెలంగాణ పార్టీని స్థాపించారు. 2022లో దానిని బీజేపీలో విలీనం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. నిరుడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. నెల రోజులలోనే బీఆర్‌ఎస్‌లోకి వెళ్లారు. ఎన్నికల ప్రచార సభలో జిట్టా అనారోగ్యానికి గురయ్యారు. కొన్ని రోజులు రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన కోలుకుని బీఆర్‌ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాగా, జిట్టా బాలకృష్ణారెడ్డికి భార్య సునీత, కుమారుడు వివేకానందరెడ్డి, కుమార్తె ఝాన్సీ ఉన్నారు.

పాస్‌పోర్టు ఐదేళ్లకు ఇప్పించండి

» ఏపీ హైకోర్టులో జగన్ అత్యవసర పిటిషన్

అమరావతి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ పునరుద్ధరణకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు కఠిన షరతులు విధించడాన్ని సవాల్ చేస్తూ ఏపీ మాజీ సీఎం జగన్ అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం విచారణ ప్రారంభమైన వెంటనే ఆయన తరపున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. కుమార్తె పుట్టినరోజు వేడుకలకు ఈ నెల 3 నుంచి 25 వరకు లండన్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు జగన్‌కు అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఆయన సీఎంగా ఉండగా డిప్లమేటిక్ పాస్‌పోర్టు ఉండేదని, పదవి నుంచి దిగిపోయాక జనరల్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. పాస్‌పోర్టును ఐదేళ్లపాటు పునరుద్ధరించేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చిందని వెల్లడించారు. 'ఓ పరువు నష్టం కేసు పెండింగ్ ఉన్నందున విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని పాస్‌పోర్ట్ అధికారులు జగన్‌కు సూచించారు. అందుకోసం ఆయన ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా.. ఏడాది పాటు మాత్రమే పాస్‌పోర్టు రెన్యువల్‌కు అనుమతిస్తామని కోర్టు ఆదేశించింది. ఈ నెల 6 నుంచి 27 మధ్య మాత్రమే లండన్ వెళ్లాలని షరతులు విధించింది' అని చెప్పారు.

రుణమాఫీ కాలేదని.. రైతు ఆత్మహత్య

మేడ్చల్ వ్యవసాయ కార్యాలయం వద్ద ఘటన.. అతడు, తల్లికి కలిపి రూ.3లక్షలకు పైగా పంట రుణం

» ఇద్దరికీ ఒకే రేషన్ కార్డు.. అందుకే మాఫీ కాలేదా?

» 2 సూసైడ్ నోట్లు.. చావుకు తల్లి కూడా కారణమంటూ ఆవేదన!



సురేందర్‌రెడ్డి (ఫైల్)

దుబ్బాక, మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 6: పంటలు పండకపోవడంతో పుట్టి పెరిగిన ఊరు నుంచి బతుకుదెరువు కోసం మరోచోటుకు పోయి రెక్కల కష్టం చేసుకొని బతుకుతున్న ఆ వ్యక్తి రుణమాఫీపై గంపెడాశలు పెట్టుకున్నాడు. తీసుకున్న పంట రుణం కట్టే స్థోమత లేక రెన్యువల్ చేస్తూ వచ్చిన అతడు తనకు పథకం వర్తిస్తే.. రూ.1.92 లక్షలు మాఫీ అయి గుండెల మీద ఉన్న భారం పోతుందనుకున్నాడు! అయితే అతడికి రుణమాఫీ కాలేదు. అన్నకు గతంలో ఓసారి.. ఇప్పుడూ మొత్తంగా రెండు సార్లు రుణమాఫీ జరిగినా, తనకు మాఫీ వర్తించలేదంటూ కొన్నాళ్లుగా తీవ్ర మనోవేదనతో ఉన్న అతడు ఎటూపాలుపోని స్థితిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మేడ్చల్ వ్యవసాయ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. మృతుడు సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన సోలిపేట సురేందర్ రెడ్డి (52). దుబ్బాక మాజీ ఎమ్మెల్యే దివంగత సోలిపేట రామలింగారెడ్డికి సురేందర్ రెడ్డి స్వయాన చిన్నాన్న కుమారుడు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. చిట్టాపూర్ గ్రామానికి చెందిన సోలిపేట ప్రతాపరెడ్డి, సుశీల దంపతులకు రవీందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి కుమారులు. వారసత్వంగా వచ్చిన భూమిలో ఇద్దరు కుమారులకు 4.05 ఎకరాల చొప్పున రాగా.. తల్లి సుశీల పేరిట రెండు ఎకరాలు ఉంచారు. సోదరులిద్దరూ కుటుంబాలతో కలిసి బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితమే హైదరాబాద్‌కు వలసొచ్చారు. భార్య మంజుల, కుమారుడితో కలిసి సురేందర్ రెడ్డి మూడేళ్లుగా మేడ్చల్ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉంటున్నాడు. భార్యాభర్తలు ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్నారు. తల్లి సుశీల.. పెద్ద కుమారుడు రవీందర్ రెడ్డి వద్ద ఉంటోంది. ఊర్లో ఉన్న ఇల్లు కూలి పోగా ఉన్న భూమినంతా కౌలుకిచ్చారు. 2012లో చిట్టాపూర్ ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకులో అన్న రవీందర్ రెడ్డి, తల్లి సుశీలతో పాటు సురేందర్ రెడ్డి రూ.40వేల రుణం తీసుకున్నాడు. అప్పు కట్టలేక రెన్యువల్ చేస్తూ వస్తున్నాడు. చివరిసారి గత ఏడాది నవంబరు నెలలో రెన్యువల్ చేశాడు. తాజాగా అతడి రుణం వడ్డీతో కలిపి రూ.1.92 లక్షలకు, తల్లి పేరిట తీసుకున్న రుణం రూ.1.15 లక్షలకు చేరింది. ఇటీవల జరిగిన రుణమాఫీలో సురేందర్ రెడ్డి, సుశీలకు మాఫీ జరగలేదు. గతంలో ఓసారి, తాజాగా మళ్లీ సోదరుడు రవీందర్ రెడ్డికి రుణమాఫీ జరిగిందని.. తనకు మాత్రం పథకాన్ని వర్తింపజేయలేదని సురేందర్ రెడ్డి ఆవేదనకు గురయ్యాడు. నెల రోజులుగా తల్లి, సోదరుడితో కలిసి బ్యాంకుకు తిరుగుతున్నాడు. తల్లి పేరు తన రేషన్ కార్డులో ఉండటంతోనే మాఫీ జరగలేదని.. వేర్వేరుగా రేషన్ కార్డులు ఉంటే మాఫీ జరిగేదని బంధువుల వద్ద ఆవేదన పంచుకున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం మేడ్చల్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఇనుప నిచ్చెనకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు మృతుడి వద్ద బ్యాంకు స్లిప్‌ల మీద రాసివున్న రెండు సూసైడ్ నోట్లు లభ్యమయ్యాయి. ఒకదాంట్లో.. 'చిట్టాపూర్ బ్యాంకులో రుణమాఫీ కానందున ఆత్మహత్య' అని.. మరో దాంట్లో 'నా చావుకు కారణం నా అమ్మ' (ఇద్దరి పేర్లూ ఒకే రేషన్ కార్డులో ఉండటం?) అని రాసి ఉంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదైంది.

సురేంద్ రెడ్డి ఆత్మహత్య బాధాకరం: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రకటనలతో రైతులు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని, రుణమాఫీ కాదేమోనన్న ఆవేదనతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు శుక్రవారం ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. రుణమాఫీ కాలేదన్న కారణంతో రైతు సురేందర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం తనకెంతో బాధ కలిగించిందని పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడొద్దని.. ప్రభుత్వంపై మనమంతా కలిసి పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

భీమదేవరపల్లి, సెప్టెంబరు 6: ఆర్థిక ఇబ్బందులతో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామానికి చెందిన మాలమర్రి రవీందర్ (52) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వంగర పోలీసుల కథనం ప్రకారం.. రవీందర్-కవిత దంపతులకు అశ్విని, అన్వేష్ పిల్లలు. అశ్విని ఎంఏ, బీఈడీ పూర్తి చేసింది. అన్వేష్ ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఈ కుటుంబానికి నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. పిల్లల ఉన్నత చదువు కోసం లక్షల్లో అప్పులు చేశాడు. పత్తి, మొక్కజొన్న పంట సాగులో సరైన దిగుబడి రాకపోవడం.. అప్పులు ఎలా తీర్చాలో పాలుపడకపోవడంతో తీవ్ర ఆందోళన చెందిన రవీందర్ బుధవారం ఇంటి నుంచి పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి ఇంటికి కూడా రాలేదు. శుక్రవారం అక్కడ ఓ చింతచెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో రవీందర్ కనిపించాడు.

రైల్వేలకు సంబంధించి అన్ని రకాల హెల్ప్‌లైన్‌లను ఏకీకృతం చేస్తూ 139 నంబరును వన్ స్టాప్ కాంటాక్ట్‌గా ఏర్పాటు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఇకపై ప్రయాణికులు ఏదైనా సమాచారం, సహాయం కావాల్సి వస్తే నేరుగా 139 నంబరుకు ఫోన్ చేయవచ్చు. 139 హెల్ప్‌లైన్ ప్రస్తుతం 12భాషల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది.

- హైదరాబాద్ సిటీ

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ యాదవ/ఏర్ర శాఖ / అప్పర్ మిడిల్ క్లాస్ / 37y / 5'4" ఎత్తు / M. ఫార్మసీ వధువుకి Hyd లో జాబ్ కలిగిన మంచి జీతం కలిగిన ఆస్తి ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్:9989597799 AJH-14804

★ కుల పట్టింపు లేదు / రెడ్డి /26y / 5'4"/ B.Tech/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. ఫోన్:9885463158 AJH-16394

★ SC మాల / B.Tech/ పోస్టల్ Dept/C.Govt. అకౌంటెంట్ / మంచి జీతం / 5'3" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-16393

★ పద్మెర / B.Tech (సివిల్)/ Govt. AE / ఎలక్ట్రికల్ Dept./ మంచి జీతం / 5'4" ఎత్తు / 28 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 9618579861 AJH-16393

★ యాదవ / B.Tech / Govt. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ RI / మంచి జీతం / 5'4" ఎత్తు / 28 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9963757612 AJH-16393

★ 58y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT. ఫ్యామిలీ పెన్షన్ / సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేరు / ఎలాంటి బాదరబంధీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. కుల/ఆస్తి పట్టింపు లేదు. ఫోన్ : 7995376608 AJH-002619

★ 60y / రెండవ పెళ్ళి / విడో / ఫెయిర్ / GOVT. రిటైర్డ్ / పిల్లలు లేరు / సొంత ఇల్లు రెంట్స్ ప్రాపర్టీ/ ఏలాంటి బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858258 AJH-002619

★ కుల పట్టింపు లేదు / చౌదరి /2nd మ్యారేజ్ / 42 / 5'5" / ఫెయిర్ / డాక్టర్ రేడియాలజిస్ట్ / మంచి ఆస్తిగల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9160437267 AJH-002518

★ కుల పట్టింపు లేదు / చౌదరి / డైవర్సీ / 41 / 5'6" / ఫెయిర్ / DM కార్డియాలజీ / మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9642853580 AJH-002518

★ రెడ్డి 2nd మ్యారేజ్ / కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు / Qly: డిగ్రీ, Age32, సొంత బిజినెస్‌లు కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను / 1st or 2nd ఓకే / అన్ని వయస్సుల వరుడు సంబంధాలు కలవు. ఫోన్: 6300012897 AJH-002598

★ రెడ్డి విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / Age:35, Qly:B.Com /Private Job కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. All Caste marriages Available. Ph: 8121347478 AJH-002598

★ రెడ్డి 2nd మ్యారేజ్ :-(కుల/ఆస్తి) ప్రసక్తి లేదు / Age:30, Qly: B.Com / Own House / Land & Business గల వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి 1st, 2nd సంబంధాలు కలవు. Ph: 9059099496 AJH-002598

★ 2వ పెళ్ళి / 46y / Govt. టీచర్ / మంచి జీతం / సొంత ప్రాపర్టీ కలిగిన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9666498650 AJH-002599

వధువు కావలెను



★ గౌడ/B.Tech/C.Govt. స్కేల్-1 ఆఫీసర్ / బ్యాంక్ ఆఫ్ ఇండియా / మంచి జీతము / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 7032058965 AJH-16394

★ పద్మశాలి / B.Tech / Govt.Asst. Exq. ఇంజినీర్ /GHMC / మంచి జీతము / 5'8" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 7032058965 AJH-16394

★ డైరెక్ట్/కుల పట్టింపు లేదు/మున్నూరుకాపు / 32/5'8"/ BHMCT / లెక్చరర్ / హైదరాబాద్ / మంచి జీతము / ఆస్తి గల వరుడికి ఏదైన జాబ్ చేస్తున్న 1st/2nd తగిన వధువు కావలెను. ఫోన్: 9440122661 AJH-16394

★ SC మాల/ ఏకైక కుమారుడు / M.Tech / C. Govt. / కస్టమ్స్ ఆఫీసర్ / మంచి జీతము / 6' ఎత్తు / 31 సం.ల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 9505667050 AJH-16393

★ రెడ్డి/ M.Tech(IIT) / C. Govt. Asst. మేనేజర్ / ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ / మంచి జీతము / 5'10" ఎత్తు/ 29. సం.ల వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్: 8790689274 AJH-16393

★ రజక/ M.Tech/ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ / మున్సిపాలిటీ Dept / 5'8" ఎత్తు/ 31. సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. ఫోన్: 8897389698 AJH-16393

★ 2వ పెళ్ళి/ B.Tech(EEE)/ Govt. ఎంప్లాయి / ట్రాన్స్‌కో / ఎలక్ట్రికల్ Dept / మంచి జీతం / 5'8" ఎత్తు/ 34. సం.ల పిల్లలు లేని వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్: 9963757612 AJH-16393

★ విశ్వబ్రాహ్మణ/ M.Tech,Ph.D/ C.Govt. డైరెక్టర్ / IC గ్రూప్-ఎ, గెజిటెడ్ / మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ / మంచి జీతము / 5'11" ఎత్తు/ 30 సం.ల అందమైన వరుడికి అందమైన వధువు కావలెను. ఫోన్: 9618579861 AJH-16393

★ చేనేత సామాజిక వర్గం / కుల పట్టింపు లేదు / 28y/5'5"/B.Tech (NIT) MNC కంపెనీలో, మంచి జీతం గల వరునికి తగిన వధువు కావలెను. నో బ్రోకర్స్, డైరెక్ట్ సంప్ర: 9553582479 AJH-002598

★ పద్మశాలి / ప్రభుత్వ ఉద్యోగి. M.Sc., B.Ed., 47y /H: 5'5"/ మొదటి వివాహం. కుల పట్టింపు లేదు / వధువు ప్రభుత్వ ఉద్యోగిని అయి ఉండాలి. రెండవ వివాహమైనా ఓకే. పిల్లలు లేని వారై ఉండాలి. డైరెక్టుగా సంప్రదించండి. 9949447956 AJH-002599

★ మాల క్రిస్టియన్స్ వయస్సు 43 సం॥ ఎత్తు 5/7 వరుడు M.Sc ప్రవేటు కాలేజ్ లెక్చరర్ మంచి జీతం సొంత బిల్డింగ్ వరుడికి వధువు కావలెను. వధూవరులకి సెకండ్ క్రిస్టియన్ సంబంధాలు చూడబడును. Cont: 7794911019 AJD:199508

★ Govt. Family Pensioner కు, Govt. Pensioner (or) Govt. Job (Widow) కలిగిన వధువు కావలెను. No Broker (or) No Fees, Direct Cell : 7382332172. AJG-191872

కళ్యాణ వేదిక

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-002619

★ సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే / అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8688006130 / 8555980066 AJH-002619

★ గంగపుత్రుల (అగ్నికుల క్షత్రియ, బెస్త, గూండ్ల, వాడబలిజ, జాలరి, పట్టీలు, నెయ్యాల, పల్లెకార్లు, వన్నెరెడ్డి) పెళ్లి సంబంధాలకై సంప్రదించండి. వాట్సాప్ నెంబర్ : 9000541008 (ఎ) AJH-002516

★ రజక /డాక్టర్స్ / ఇంజనీర్స్ / Govt. Jobs / Abroads / పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. కోట్ల శ్రీనివాస్. ఫోన్: 8106303155 / 9391265304 AJH-002599

★ 2nd కమ్మవారి వివాహ సంబంధాలకై ప్రత్యేకముగా INDIA / US, BUSINESS / DOCTORS కొరకు నడుపబడుచున్న సంస్థ. ప్రభాకర్ చౌదరి. ఫోన్ : 9346099976 AJH-002518

★ శ్రీ రిజిస్ట్రేషన్: అన్ని కులాల Govt / SWE / డాక్టర్స్ / NRI / బిజినెస్ / PVT/2nd పెళ్లి సంబంధాలకై నిజాయితీగా సర్వీస్. ఈ ప్రకటన 100% నిజం. ఫోన్: 9866775306 AJH-002599

V.I.P MATRIMONY
(కమ్మ వారికి మాత్రమే) Vizag-Hyd-B'lore
కమ్మ వారి వివాహ సంబంధాలకై ప్రత్యేకముగా నడుపబడుచున్న సంస్థ
✆ : 8143538383

వధువు కావలెను

★ కమ్మ (INDIA): 26 6' IIT, IIM 55LPA 75Cr. ★ 29 6' BE (Bits) MS (PURDUE) 70LPA 100 Cr. ★ 8143538383

★ కమ్మ (INDIA): 25 5'9" BE + M.Tech (IIT) Govt Job 12LPA Hyd 35Cr. Seeks Well Settled Bride ★ 8143538383

★ కమ్మ (INDIA): 29 6' BE (USA) MBA(ISB) 50LPA 170Cr. Hyd. Seeks V.Fair Bride ★ 8143538383

★ కమ్మ (INDIA): 26 5'11" CA CPA 30LPA 50Cr. ★ 28 5'9" BE, MBA 38LPA 125Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 25 5'9" US CITIZEN CFA $200K 50 Cr. Seeks INDIA BASED V.FAIR GIRL ★ 8143538383

★ కమ్మ (USA): 26 6' IIT, MS FACE BOOK $300K 50 Cr. ★ 27 6' IIT, MS GOOGLE $300K 25 Cr. ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 27 5'11" MD (Radiology) MBBS (Govt.) US CITIZEN 50Cr Seeks Doctor / Engg. Bride ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 28 5'8" MS(GS), DM Gastro 150Cr. ★ 27 5'11" M.CH. (Urology) 100"Cr. ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 25 5'9" MS BUSINESS HYD 300 Cr. ★ 28 6' MBA BUSINESS 400 Cr. ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 28 5'11" MS $180K 50Cr. ★ 27 5'10" IIT 35LPA 25Cr. ★ 8143538383

వరుడు కావలెను

★ కమ్మ (INDIA): 24 5'5" V.FAIR MBA (IIM) 52LPA 50Cr. ★ 26 5'6" V.FAIR CA 30 LPA 20Cr. ★ 8143538383

★ కమ్మ (INDIA): 23 5'4" V.FAIR BE (IIT) 45LPA 30Cr. ★ 25 5'7" V.FAIR M.Tech 26LPA 50Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 24 5'6" V.FAIR BE(IIT), MS $220K 70Cr. ★ 25 5'4" V.FAIR BE(Bits), MS $195K 50Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 23 5'7" V.FAIR Green Card BS $140K 200Cr. ★ 26 5'8" CITIZEN (US) $100K 100Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 24 5'7" MS $100K 100Cr. ★ 23 5'5" MS $120K 8Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 23 5'4" MS, BE (NIT) $180K 150Cr. ★ 25 5'8" V.FAIR MS $100K 100Cr. ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 23 5'5" V.FAIR 5'6" MBA BUSINESS Family Hyd 700Cr. Seeks Well Settled Business Boy ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 25 5'4" V.FAIR M.Sc BUSINESS 500 Cr. Seeks Well Settled Boy Job Business ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 26 5'3" V.FAIR MS BUSINESS 500 Cr. Seeks Only Business Family Boy. ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 24 5'6" V.FIAR IIT MS $220K 40Cr. ★ 26 5'8" V.FAIR BE, MBA 100 Cr. ★ 8143538383

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.
9985921380, 9703618806, 9985921386

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK




కొత్తపలుకు

జగన్ బుర్రలో 'బురద'!

తెలంగాణలో ఖమ్మం జిల్లాను ముంచింది మున్నేరు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడను ముంచింది బుడమేరు. ఇటు మున్నేరు, అటు బుడమేరు ఆక్రమణలకు గురవడంతో పాటు ప్రణాళిక లేకుండా నిర్మాణాలకు అనుమతించడంతో భారీ వర్షం కురిసినప్పుడు వరద పోటెత్తి దిగువ ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నాయి. ఇటు ప్రజల స్వార్థం, అటు ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల దిగువ ప్రాంతాల ప్రజలు వరద తాకిడికి గురవుతున్నారు. వరదలు సంభవించినప్పుడు యథావిధిగా బురద రాజకీయాలు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో బురద రాజకీయం పరాకాష్ఠకు చేరుకుంది. అబద్ధాలే పునాదులుగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రస్తుత వరదలపై కూడా అబద్ధాలను ప్రచారం చేస్తూ ఆనందిస్తున్నారు. ఆయనకు చెందిన రోత మీడియా తన కడుపు మంటను దాచుకోకుండా బురద రాజకీయాలకు తన వంతు సహాయం చేస్తోంది.

> తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో ఇప్పుడు అరెస్టుల పర్వం మొదలైంది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఈ దాడి కేసును ఊరగాయ వేసిన పోలీసులు ఇప్పుడు ప్రభుత్వం మారగానే జాడీ నుంచి బయటకు తీసి విచారణను వేగవంతం చేశారు. పోలీసు శాఖ ఇలా ప్రభుత్వాలను బట్టి నడుచుకోవడమే విషాదం. అదే పోలీసులు అప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా వ్యవహరించడం ఏమిటి? నేరం జరిగినప్పుడు పోలీసులు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చాలి కదా? అప్పుడైనా ఇప్పుడైనా పోలీసులు తమ పని తాము చేస్తే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు కదా. ప్రభుత్వం ఎవరిదైనా తప్పు చేయడానికి ఎవరికైనా భయం ఉండాలి కదా? ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున వైసీపీ కార్యాలయంపై దాడి చేసినా పట్టించుకోరా? పోలీసులు ఉన్నది అధికారంలో ఉన్న వారి సేవలో తరించడానికి కాదు కదా? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఎలా?

అమరావతిలో రాజధాని ఏర్పాటుకావడం మొదటి నుంచీ ఇష్టం లేని జగన్మోహన్ రెడ్డి తన రోత మీడియా ద్వారా రాజధాని మునిగిపోయిందని ప్రచారం చేయించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఇల్లు ముంపునకు గురికాకుండా కాపాడుకొనేందుకే ముందస్తు హెచ్చరికలు లేకుండా బుడమేరు గేట్లు ఎత్తేశారని జగన్ రెడ్డి తన అజ్ఞానాన్ని ప్రదర్శించారు. అదే సమయంలో సదరు రోత మీడియాలో మాత్రం చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందని, రెండవ అంతస్థులోకి నీరు ప్రవేశించిందని అబద్ధాలు ప్రచారం చేశారు. కృష్ణా నది దిగువన కృష్ణలంక వద్ద రిటైనింగ్ వాల్‌ను తాను నిర్మించి ఉండకపోతే మరింత ప్రాణనష్టం జరిగి ఉండేదని కూడా చెప్పుకొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్ధరాత్రి అపరాత్రి అన్న తేడా లేకుండా వరద బాధితులను ఆదుకోవడానికి మోకాళ్ల లోతు బురదను సైతం లెక్కచేయకుండా యువకుడిలా తిరుగుతుండగా, జగన్ రెడ్డి మాత్రం కాసేపు నీళ్లలోకి దిగి ఫొటోలకు పోజులిచ్చి బురద రాజకీయాలకు తెరలేపారు. అబద్ధాలను పదే పదే ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారని, ఫలితంగానే 2019లో తాను ముఖ్యమంత్రిని కాగలిగానని జగన్‌కు తెలుసు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజధానిగా ఎంపిక చేసిన అమరావతికి ముంపు ప్రమాదం ఉందని ప్రచారం చేసిన జగన్ రెడ్డి.. ఇప్పుడు కూడా తన రోత మీడియా ద్వారా రాజధాని మునిగిపోయిందని చెత్త ప్రచారం మొదలుపెట్టారు. ఒక సామాజిక వర్గంపై కక్ష పెంచుకున్న జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కూడా ఆ దుష్టాచారాన్ని వదులుకోవడం లేదు. చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రాష్ట్రానికి ఎక్కడ పెట్టుబడులు వస్తాయోనన్న దుగ్ధతో జగన్‌కు అండగా ఉండే సైకో గుంపు సోషల్ మీడియా వేదికగా "అమరావతిని మర్చిపోయి తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి" అని ప్రచారం కూడా చేసింది. ఒక రాష్ట్రం పట్ల ఇంతకంటే ద్రోహం ఉంటుందా? జగన్ రెడ్డి అనే వ్యక్తికి ఆంధ్రప్రదేశ్ పట్ల కనీస అభిమానం కూడా ఉండదు. తాను అధికారంలో ఉండటమే ఆయనకు కావాల్సింది. సైకో గుంపునకు, పేటీఎం బ్యాచ్‌కు కూడా జగన్ అధికారంలో ఉంటే చాలు.. రాష్ట్రం ఏమైపోయినా ఫర్వాలేదు. అందుకే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా కాకముందే రాళ్లు వేయడం ప్రారంభించారు. పనిలో పనిగా భవిష్యత్తులో తనకు పోటీ అవుతాడని భావిస్తున్న మంత్రి లోకేశ్‌ను కూడా టార్గెట్ చేసుకున్నారు. విద్యా శాఖలో చీమ చిటుక్కుమన్నా భూతద్దంలో చూపించడం ద్వారా లోకేశ్‌ను ఫెయిల్యూర్‌గా ముద్ర వేసే ప్రయత్నాలను జగన్ అనుచర మూక ప్రారంభించింది. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో ఆడపిల్లలు స్నానం చేసే బాత్‌రూంలలో కెమెరాలు ఏర్పాటు చేశారంటూ అబద్ధాలు ప్రచారం చేశారు. తనకు తప్ప ముఖ్యమంత్రి పదవిలో కొనసాగే అర్హత మరెవరికీ లేదని నమ్ముతున్న జగన్ రెడ్డి, ప్రజలను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంతకుముందే 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఇప్పుడు నాలుగవసారి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబును ఆ పదవికి అర్హుడా అని ప్రశ్నిస్తున్నారు. అర్హతలను బట్టి అయితే ముఖ్యమంత్రి అయ్యే అర్హత జగన్ రెడ్డికి ఏమాత్రం లేదని మెజారిటీ ప్రజలు తీర్పు ఇచ్చారు. జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరుగుతున్నట్టుగానూ, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నట్టుగానూ కనిపించిన రోత మీడియాకు ఈ మూడు నెలల్లోనే రాష్ట్రం వల్లకాడు అయినట్టుగా కనిపిస్తోంది. జగన్ మనసులో ఏముందో సదరు రోత మీడియా ప్రచారం చేస్తోంది. రోత మీడియా ప్రచారం చేసే కథనాలను వైసీపీ మూక అందిపుచ్చుకుంటోంది. ఇదీ ప్రస్తుతం జరుగుతున్న తంతు. చంద్రబాబుకు పనీపాటా లేదు, అందుకే వరద ప్రాంతాల్లో తిరుగుతున్నారని జగన్ రెడ్డి భావిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు తనలా ఎంచక్కా హెలికాప్టర్‌లో ఒక రౌండ్ తిరిగి సరిపెట్టకుండా బురదలో తిరగడం ఏమిటి? అని జగన్‌కు అనిపిస్తుండవచ్చు. పరిపాలన చేయడం తనకు తప్ప మరెవరికీ చేతకాదని జగన్ నమ్ముతుండవచ్చు గానీ ప్రజలు అలా అనుకోవడం లేదు. అందుకే తాజా ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు మాత్రమే ఇచ్చారు. నిజానికి చంద్రబాబు సరిగ్గా ప్లానింగ్ చేసి ఉంటే జగన్ రెడ్డికి రెండు మూడు సీట్లకు మించి వచ్చి ఉండేవి కావు. జగన్ రెడ్డి అభిప్రాయంతో, నమ్మకంతో నిమిత్తం లేకుండా ప్రజలు మాత్రం ఆయన ముఖ్యమంత్రిగా పనికిరాడని తేల్చిపారేశారు. ఈ నేపథ్యంలో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన జగన్ రెడ్డి, ఆత్మవంచన చేసుకుంటున్నారు. వరద ప్రాంతంలో కొద్దిసేపు పర్యటించినప్పుడు, ఇప్పుడు ముఖ్యమంత్రిగా నువ్వుంటే బాగుండేదని ప్రజలు నినాదాలు చేసినట్టుగా ప్రచారం చేసుకుంటూ ఆనందం పొందుతున్నారు. వరదలొస్తే రాజధాని అమరావతి మునిగిపోతుందని అధికారంలో ఉన్నప్పుడు తాను చేసిన ప్రచారం నిజమని మళ్లీ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని మునిగిపోయి ఉంటే హైకోర్టు, సచివాలయం ఎలా పనిచేస్తున్నాయనే ఇంగితం కూడా లేకుండా రోత మీడియా కథనాలను వండి వార్చింది. తాము చెప్పే అబద్ధాలను ఎంతో కొంత మంది నమ్మకపోతారా అన్నది జగన్ అండ్ కో భావన. గతంలో అలా నమ్మడం వల్లనే ప్రజలు ఆయనకు అధికారం కట్టబెట్టారు. అందుకే ఇప్పుడు కూడా రాజధాని విషయంలోనే కాకుండా బుడమేరు విషయంలోనూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల ప్రజలకు బుడమేరు గురించి తెలిసే అవకాశం లేదు. అందుకే జగన్ రెడ్డి అబద్ధాలకు పదును పెట్టారు. చంద్రబాబు ఇల్లు మునగకుండా ఉండేందుకే బుడమేరు గేట్లు ఎత్తారని చెప్పడం తెలియక చేసిన పని కాదు. రోత మీడియాలో చంద్రబాబు ఇల్లు మునిగిపోయిందని రాసినప్పుడు ఇలా ఎలా చెబుతారని ప్రశ్నించే విలేఖరులు కూడా ఇప్పుడు లేరు. మీడియాలో వైరుధ్యాల వల్ల జగన్ అండ్ కో చేస్తున్న అసత్య ప్రచారం ఎంతో కొంత ప్రజల్లోకి వెళుతోంది. రాష్ట్రంలో ఏ అనర్థం జరిగినా అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని ప్రజలంతా నమ్మాలని ఆయన కోరుకుంటున్నారు. అందుకే ఈ బరితెగింపు.



akbar

నిరూపిస్తే ఇచ్చేస్తాం!

బుడమేరు కట్టలు తెగడానికి ఇబ్రహీంపట్నం వద్ద 24 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ హైడల్ ప్లాంట్ కారణం అని సరికొత్త ప్రచారానికి తెర లేపారు. నిజానికి ఈ ప్లాంట్ ఏర్పాటు విషయం 1998లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు కూడా తెలియదు. అప్పటి ప్రభుత్వ పాలసీ ప్రకారం ఆ ప్లాంట్‌కు జెన్‌కో అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు అనుమతించారు. ఈ ప్లాంట్ వల్ల వచ్చే ఆదాయంతోనే 'ఆంధ్రజ్యోతి' పత్రిక నడుస్తోందని నమ్మిన ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2009 తర్వాత దీనికి అనుమతులు రద్దు చేశారు. ఆ తర్వాతి ప్రభుత్వాలు పునరుద్ధరించినా జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ప్లాంట్‌కు అనుమతులు రద్దు చేశారు. నిజానికి మా ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే కొద్దిపాటి విద్యుత్ అతి తక్కువ ధరకే ప్రభుత్వానికి సరఫరా చేసే వాళ్లం. నష్టపరిహారం ఇవ్వకుండా ప్లాంట్ తొలగిస్తే ఎలా? అని మాత్రమే మేం హైకోర్టును ఆశ్రయించాం. జరిగింది ఇది కాగా, చంద్రబాబు నాకు ఏదో మేలు చేశారని రోత పత్రికలో ప్రచారం చేస్తున్నారు. విచిత్రమేమిటంటే కృష్ణా నదికి వరద వస్తే ఈ ప్లాంట్ కూడా మునిగిపోతుంది. ఇప్పుడు కూడా మునిగిపోయింది. కృష్ణా నదికి భారీ వరద వచ్చినప్పుడు బుడమేరు నీరు నదిలోకి వెళ్లే అవకాశమే లేదు. ఇంకా చెప్పాలంటే ఇబ్రహీంపట్నం లోతట్టు ప్రాంతాలు కృష్ణా వరదల్లో మునిగిపోకుండా ఉండటానికి ఈ ప్లాంట్ రక్షణగా నిలబడిన సందర్భాలూ ఉన్నాయి. జగన్ రోత మీడియాలో చేస్తున్న ప్రచారం నిజమని రుజువు చేస్తే ఆ ప్లాంట్‌ను మా సొంత ఖర్చుతో తొలగించడానికి సిద్ధంగా ఉన్నాం. కనీస ప్రమాణాలు, నైతిక విలువలు పాటించని జగన్ రోత మీడియాకు బురద చల్లడం తప్ప మరేమీ తెలియదు. కడుపుకు అన్నం తినేవాళ్లు ఎవరూ ఇలాంటి ప్రచారాలు చేయరు. అధికారంలో ఉన్నప్పుడు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు బాబూ కొడుకులు ఈ మినీ హైడల్ ప్రాజెక్ట్ ఉసురు తీసే ప్రయత్నం చేశారు. మా ప్లాంట్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిందని రుజువు చేస్తే దాన్ని జగన్ అండ్ కోకు ఇచ్చేస్తాం. అయితే జగన్ మాత్రం తన రోత పత్రికను ఇప్పుడు బూతు పత్రికగా మార్చే ప్రయత్నంలో ఉన్నట్టున్నారు. అందుకే చెత్తతో పత్రికను నింపుతున్నారు. అధికారం కోల్పోయామన్న జగన్ అండ్ కో బాధను ఎవరు తీర్చాలి? ప్రజలే తీర్చాలి! అయితే ఐదేళ్లపాటు చేసిన అరాచకాలను ప్రజలు ఇప్పట్లో మరచిపోయేలా లేరే! అందుకే అబద్ధాలను నమ్ముకొని మరోమారు ప్రజలను వంచించే ప్రయత్నం చేస్తున్నారు. జగన్ రెడ్డి ఏ ముహూర్తంలో పుట్టారో కానీ ఆయనలో మానవ లక్షణాలు నానాటికీ కనుమరుగవుతున్నాయి.

> ప్రజలంటే చంద్రబాబుకు వెరపు ఉంటుంది. జగన్ మాత్రం ప్రజలను వెర్రిబాగులోళ్లుగా భావిస్తారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు చేశారు. చేసేవాళ్లను ప్రోత్సహించారు. అన్నీ గుర్తుపెట్టుకున్న ప్రజలు తగిన సమయంలో తగిన తీర్పు ఇచ్చారు.

> నిజానికి మా ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే కొద్దిపాటి విద్యుత్ అతి తక్కువ ధరకే ప్రభుత్వానికి సరఫరా చేసే వాళ్లం. నష్టపరిహారం ఇవ్వకుండా ప్లాంట్ తొలగిస్తే ఎలా? అని మాత్రమే మేం హైకోర్టును ఆశ్రయించాం. జరిగింది ఇది కాగా, చంద్రబాబు నాకు ఏదో మేలు చేశారని రోత పత్రికలో ప్రచారం చేస్తున్నారు. విచిత్రమేమిటంటే కృష్ణా నదికి వరద వస్తే ఈ ప్లాంట్ కూడా మునిగిపోతుంది. ఇప్పుడు కూడా మునిగిపోయింది. ఇంకా చెప్పాలంటే ఇబ్రహీంపట్నం లోతట్టు ప్రాంతాలు కృష్ణా వరదల్లో మునిగిపోకుండా ఉండటానికి ఈ ప్లాంట్ రక్షణగా నిలబడిన సందర్భాలూ ఉన్నాయి. జగన్ రోత మీడియాలో చేస్తున్న ప్రచారం నిజమని రుజువు చేస్తే ఆ ప్లాంట్‌ను మా సొంత ఖర్చుతో తొలగించడానికి సిద్ధంగా ఉన్నాం. అధికారంలో ఉన్నప్పుడు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్టు బాబూ కొడుకులు ఈ మినీ హైడల్ ప్రాజెక్ట్ ఉసురు తీసే ప్రయత్నం చేశారు. మా ప్లాంట్ వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగిందని రుజువు చేస్తే దాన్ని జగన్ అండ్ కోకు ఇచ్చేస్తాం.

జగన్ అంతే!

చంద్రబాబును జైలుకు పంపడం వల్లే జగన్ రెడ్డి అధికారం కోల్పోయారని రాజమండ్రి మేధావిగా ప్రచారంలో ఉన్న ఉండవల్లి అరుణ్ కుమార్ చెబుతున్నారు గానీ, అందరికంటే ప్రజలే తెలివైనవాళ్లు. జగన్ రెడ్డి చేసిన అరాచకాలు అన్నింటినీ గుర్తుంచుకోవడం వల్లనే ప్రజలు ఆయన పార్టీని చిత్తుగా ఓడించారు. వరదల విషయంలో బురద రాజకీయం చేస్తున్న జగన్ రెడ్డికి వరద బాధితులకు విరాళం ఇవ్వడానికి మాత్రం మనసు రాదు. సొంత సొమ్ము ఇవ్వడానికి మనసు రానప్పుడు తాను ఏర్పాటు చేసిన కంపెనీలు లాభాల్లో ఉన్నాయి కదా? ఆ కంపెనీలైనా విరాళాలు ప్రకటించవచ్చు కదా? అంతటి విశాల హృదయం ఆయనకు ఎక్కడిది? ఇంతవరకూ ఆయన ఒక్కరికైనా రూపాయి సహాయం చేసిన సందర్భాన్ని చూశామా? లేదే! దటీజ్ జగన్! వన్ వే ట్రాఫిక్ మాత్రమే ఆయన విధానం. వారం రోజులుగా వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలు చంద్రబాబుపై తిరగబడకపోవడం పాపం, జగన్ రెడ్డికి నచ్చడం లేదు. మూడో వంతు వరదల్లో చిక్కుకున్నప్పటికీ మృతుల సంఖ్య ఎక్కువగా లేకపోవడం కూడా ఆయనకు రుచించడం లేదు. విశ్రాంతి కూడా తీసుకోకుండా బాధితులను ఆదుకోవడానికి యువకుడిలా శ్రమిస్తున్న చంద్రబాబును పలువురు ప్రశంసిస్తుండగా, జగన్ అండ్ కో మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు. విజయవాడ పూర్తిగా మునిగిపోయి వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయి ఉంటే సైకో గుంపు ఆనందించి ఉండేది. రాజధాని మునిగిపోలేదు. చంద్రబాబు ఇల్లు కూడా మునిగిపోలేదు. మరోవైపు ముంపు ప్రాంతాలు కోలుకుంటున్నాయి. ఇవన్నీ జగన్‌కు సహజంగానే రుచించవు. జగన్‌తో పాటు అదే రక్తం పంచుకు పుట్టిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాత్రం చంద్రబాబు కృషిని ప్రశంసించారు. అయితే అందరికీ సహాయం అందడం లేదని ఆమె అన్నారు. ఇందులో కొంత నిజం ఉంది. అందుకే పీకల్లోతు నీళ్లలో చిక్కుకున్న ప్రజలకు ఆహారం అందించడానికి డ్రోన్లను ఉపయోగించారు. వరదల వల్ల రాజధాని మునగలేదు. చంద్రబాబు ఇంట్లోకి నీరు రాలేదని బాధపడుతూ కూర్చోకుండా సొంత పార్టీ మునిగిపోకుండా కాపాడుకోవడంపై జగన్ రెడ్డి దృష్టి పెట్టడం మంచిది.

అదే జరిగితే శిక్ష ఖాయం!


రాజ్యసభలో తన పార్టీకి ఉన్న బలంపై కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆధారపడి ఉందని జగన్ రెడ్డి ఇప్పటిదాకా దిలాసాగా ఉన్నారు. ఇప్పుడు రాజ్యసభలో కూడా వైసీపీకి చిల్లు పడింది. భారతీయ జనతా పార్టీ ఒక వైపు నుంచి, తెలుగుదేశం పార్టీ మరోవైపు నుంచి రాజ్యసభ సభ్యులను జగన్‌కు దూరం చేసే పనిలో ఉన్నాయి. ఇప్పటికే బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణ తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. మరికొందరూ అదే బాటలో ఉన్నారు. విజయసాయి రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, నిరంజన్ రెడ్డి వంటి వాళ్లతో భారతీయ జనతా పార్టీ సంప్రదింపులు జరుపుతోంది. మిగతావారు తెలుగుదేశం పార్టీతో టచ్‌లో ఉన్నారు. రాజ్యసభలో బిల్లులు ఆమోదం పొందడానికి బీజేపీకి నలుగురు సభ్యుల బలం అదనంగా కావాలి. ఈ కారణంగా వైసీపీకి చెందిన నలుగురిని చేర్చుకోవడానికి బీజేపీ స్కెచ్ వేస్తోంది. వైవీ సుబ్బారెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్ మినహా మిగతా వారందరూ బీజేపీ, తెలుగుదేశం పార్టీలలో ఏదో ఒక దానితో చేతులు కలుపుతారని ప్రచారం జరుగుతోంది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం సాఫీగా నడవాలంటే లోక్‌సభలో తెలుగుదేశం పార్టీ మద్దతు అవసరం. ఈ కారణంగా జగన్ రెడ్డికి పరోక్ష సహాయం అందించే పరిస్థితిలో కేంద్రం లేదు. రాజ్యసభలో వైసీపీ బలంపై ఆధారపడకూడదన్న నిర్ణయానికి బీజేపీ రావడానికి కూడా ఇదే కారణం. తెలుగుదేశం, బీజేపీ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ విజయవంతమైతే అవినీతి కేసులలో విచారణ వేగం పుంజుకొని వచ్చే ఎన్నికల నాటికి జగన్, విజయసాయి రెడ్డిలకు శిక్షలు పడే అవకాశం ఉంది. అదే జరిగితే జగన్ రెడ్డి రాజకీయ జీవితం ప్రశ్నార్థకం అవుతుంది. వివేకానంద రెడ్డి హత్య కేసులో జగన్ సతీమణి భారతి ప్రమేయంపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. ఈ కారణంగా పార్టీ నాయకత్వ బాధ్యతలను ఆమె చేపట్టినప్పటికీ పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. ప్రస్తుతానికి మాత్రం ఇవన్నీ ప్రశ్నలే. మరికొంత కాలం వేచి చూస్తే గానీ జగన్ రాజకీయ భవితవ్యంపై స్పష్టత ఏర్పడదు. ఈ విషయం అలా ఉంచితే, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో ఇప్పుడు అరెస్టుల పర్వం మొదలైంది. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఈ దాడి కేసును ఊరగాయ వేసిన పోలీసులు, ఇప్పుడు ప్రభుత్వం మారగానే జాడీ నుంచి బయటకు తీసి విచారణను వేగవంతం చేశారు. పోలీసు శాఖ ఇలా ప్రభుత్వాలను బట్టి నడుచుకోవడమే విషాదం. అదే పోలీసులు అప్పుడు ఒకలా, ఇప్పుడు మరోలా వ్యవహరించడం ఏమిటి? నేరం జరిగినప్పుడు పోలీసులు తమ విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చాలి కదా? అప్పుడైనా ఇప్పుడైనా పోలీసులు తమ పని తాము చేస్తే ఇటువంటి పరిస్థితి వచ్చేది కాదు కదా. ప్రభుత్వం ఎవరిదైనా తప్పు చేయడానికి ఎవరికైనా భయం ఉండాలి కదా? ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున వైసీపీ కార్యాలయంపై దాడి చేసినా పట్టించుకోరా? పోలీసులు ఉన్నది అధికారంలో ఉన్న వారి సేవలో తరించడానికి కాదు కదా? ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను విస్మరిస్తే ఎలా? దేశంలో వివిధ వ్యవస్థలు అధికారంలో ఉన్న వారికి ఊడిగం చేయడం వల్లనే వాటిపై ప్రజలకు నమ్మకం పోతున్నది. నేరస్తులు ఎదురుదాడి చేస్తూ తప్పించుకుంటున్నారు. జగన్ రెడ్డిపై ఉన్న కేసులే ఇందుకు నిదర్శనం. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించాల్సిందే. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఒక మహిళను లైంగికంగా వేధించిన విషయం తెలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క రోజు కూడా జాప్యం చేయకుండా ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఏం జరిగింది? ఇలాంటి వారికి ప్రమోషన్లు ఇచ్చారు. మంత్రులను చేశారు. చంద్రబాబు, జగన్‌కు మధ్య ఉన్న మౌలిక తేడా ఇదే. ప్రజలంటే చంద్రబాబుకు వెరపు ఉంటుంది. జగన్ మాత్రం ప్రజలను వెర్రిబాగులోళ్లుగా భావిస్తారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలు చేశారు. చేసేవాళ్లను ప్రోత్సహించారు. అన్నీ గుర్తుపెట్టుకున్న ప్రజలు తగిన సమయంలో తగిన తీర్పు ఇచ్చారు. అయినా జగన్ రెడ్డిలో మార్పు రాకపోవడం ఆయన ఖర్మ. ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని ఆయన ఎప్పటికి తెలుసుకుంటారో!

> వరదల విషయంలో బురద రాజకీయం చేస్తున్న జగన్ రెడ్డికి వరద బాధితులకు విరాళం ఇవ్వడానికి మాత్రం మనసు రాదు. సొంత సొమ్ము ఇవ్వడానికి మనసు రానప్పుడు తాను ఏర్పాటు చేసిన కంపెనీలు లాభాల్లో ఉన్నాయి కదా? ఆ కంపెనీలైనా విరాళాలు ప్రకటించవచ్చు కదా? అంతటి విశాల హృదయం ఆయనకు ఎక్కడిది? ఇంతవరకూ ఆయన ఒక్కరికైనా రూపాయి సహాయం చేసిన సందర్భాన్ని చూశామా? లేదే! దటీజ్ జగన్! వన్ వే ట్రాఫిక్ మాత్రమే ఆయన విధానం. వారం రోజులుగా వరదల్లో చిక్కుకున్న విజయవాడ ప్రజలు చంద్రబాబుపై తిరగబడకపోవడం...పాపం, జగన్ రెడ్డికి నచ్చడం లేదు. మూడో వంతు వరదల్లో చిక్కుకున్నప్పటికీ మృతుల సంఖ్య ఎక్కువగా లేకపోవడం కూడా ఆయనకు రుచించడం లేదు. విశ్రాంతి కూడా తీసుకోకుండా బాధితులను ఆదుకోవడానికి యువకుడిలా శ్రమిస్తున్న చంద్రబాబును పలువురు ప్రశంసిస్తుండగా, జగన్ అండ్ కో మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.

గతానికి శిఖరం... భావికి జ్ఞాపకం

నవంబర్ 23, 1975 న ఎమర్జెన్సీలో కాళోజీ 'సిరాచుక్క' అన్న మకుటంతో ఒక చిన్న శక్తివంతమైన కవిత రాశాడు. దాంట్లో 'A single drop of Ink/ that make the millions to think' అని BYRON రాసిన కవిత్వ పాదాలను ఉటంకిస్తూ 'ఒకే ఒక్క సిరాచుక్క/ లక్ష మెదళ్ళకు కదలిక/ అన్నాడు బైరన్/ నిజమేనా అది?/ మరి నేను ఒలకబోసిన / సిరా సీసాలకొద్ది గాదు/ పీపాలకొద్ది / ఏ ఒక్క మెదడు కదిలినట్టు లేదు/ మొదట నా మెదడులో ఉంటేగా కదలిక/ మరోడ్ని కదిలించ' ఇది కాళోజీలో ఉన్న ఆత్మానుశోధనకు సంబంధించీ, తను ప్రజలకు ఏదైనా సామాజిక సంబంధి ఐన ఒక కీలక అంశాన్ని ప్రస్తుతిస్తున్నపుడు ముందు దాన్ని తనకు తాను అన్వయించుకుని, అనుశీలించుకుని నిజాయితీగా ఆత్మపరీక్ష చేసుకుంటాడు. ఈ తత్వం ఆయనలోని స్వచ్ఛతనూ, నిర్మలతనూ, కొన్ని సందర్భాల్లో ఆయన పొందే అంతర్ ఘర్షణనూ, నిస్సహాయతనూ, వేదనను కూడా ప్రకటించిన సందర్భాలను మనకు ప్రదర్శిస్తుంది. ఉదాహరణకు 'ఎందుకో నా హృదిని' కవితలో ఆయనంటాడు.. 'ఎందుకో నా హృదిని / ఇన్ని ఆవేదనలు?/ అవనిపై జరిగేటి అవకతవకల జూచి/ ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?/ పరుల కష్టముజూచి పగిలిపోవును గుండె/ మాయ మోసము జూచి, మండిపోవును ఒళ్ళు/ ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?/ తప్పు దిద్దగలేను దారి చూపగలేను/ తప్పుజేసిన వాని దండింపగాలేను/ కష్టపడువారలను కాపాడగాలేను/ ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు/ అవకతవకల నేను సవరింపలేనపుడు/ పరులకష్టాలతో పనిఏమి మాకనెడు/ అన్యులను జూచైన హాయిగమనలేను/ ఎందుకో నా హృదిని- ఇన్ని ఆవేదనలు?'. ఇక్కడ కవి అంతర్ముఖుడై తన నిస్సహాయతను గుర్తిస్తూనే అంతిమంగా ప్రజలపట్ల తనకు ఉండవలసిన ధర్మపక్షాన్ని వహించవలసిన బాధ్యతను స్వీకరిస్తున్న కార్యశీలతను వ్యక్తపరుస్తున్నాడు. అదే విధంగా ఒకసారి ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఒక దఫా శాసనమండలి సభ్యుడుగా కూడా పని చేసినా ఎన్నడూ ఏ రాజకీయ పార్టీలలోనూ లేడు, రాజకీయ నిర్మాణంలో కూడా లేడు. మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం తాను రాజకీయాల్లో చేసిన మొదటి, ఆఖరి తప్పని తన జీవిత చరిత్రలో చెప్పుకున్నాడు కూడా. తదాదిగా తనను తాను అతిస్పష్టంగా నిర్వచించుకున్న కాళోజీ పూర్తిగా అనితరసాధ్యమైన మార్గంలో చివరిశ్వాస వరకు ప్రజలపక్షం వహిస్తూనే తాను ఎవరినీ అనుకరించకుండా తనదైన సరళగంభీర శైలిలో, తనను ఎవరూ అనుకరించలేని ఎవరికీ సాధ్యంకాని తనదే ఐన తెలంగాణ స్వచ్ఛ నుడికారంతో, పలుకుబడితో తన విశిష్టమైన సాహిత్య దృక్పథాన్ని తను ఎంతో గాఢ తాత్వికతతో అనువదించిన ఖలీల్ జిబ్రాన్ మూల వస్తుతత్వాన్ని ఇట్లా చెప్పాడు కాళోజీ. 'నేను జీవనాన్ని, జీవనదాన్ని, నేను ప్రస్తుతాన్ని, నిన్నటి స్వప్నాన్ని, రేపటి జ్ఞాపకాన్ని, గతానికి శిఖరాన్ని, భావికి ఆధారాన్ని,- నేను గతిని, ప్రస్తుతాన్ని, ఉన్నదాన్ని, బ్రతికున్నదాన్ని, గతాన్ని స్వగతంగా గలదాన్ని, భావిని స్వభావంగా గలదాన్ని' ఇది కాళోజీ మూల తత్వం.

1940 లలో ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సంస్థానంలో 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ', 'ఈ నిజాం రాజు జన్మజన్మల బూజు' అంటూ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న దాశరథి ఉద్యమ సహచరుడుగా కాళోజీకి సన్నిహితుడయ్యాడు. నిజాం రాచరిక పాలనకు, రజాకార్ల పైశాచిక కృత్యాలకు స్పందించి కాళోజీ రాస్తున్న గేయాలను ప్రచురించి ప్రజలకు పంచాలనే ప్రయత్నంలో భాగంగా కాళోజీ కవితలకు ప్రజాబాహుళ్యంలో అప్పటికే ప్రజాదరణ పొందిన కవితలను కూర్చి దేశోద్ధారక గ్రంథమాల తరఫున 1953లో ఆలంపురం సభలో శ్రీశ్రీ చేత ఆవిష్కరింపజేశారు. అదే కాళోజీ మొట్టమొదటి కవితా సంపుటి 'నా గొడవ'. కావ్యావిష్కరణ చేస్తూ శ్రీశ్రీ 'యుద్ధంలో ఫ్రాన్స్ కవులంతా చెల్లాచెదురుగా పారిపోతే లూయీ అరగాన్ ఒక్కడే దేశంలో నిలబడి మహాప్రజా విశ్వాసాన్ని వెల్లడించే గీతాలు రాశాడు. కాళోజీ లూయీ అరగాన్ వంటివాడు, తెలంగాణ మూగజీవుల హృదయాల్ని ప్రతిబింబింపజేశాడు' అని ప్రశంసించాడు.



srini

> కాళోజీ చూపు వేరు, దృష్టి వేరు.. చింతన వేరు.. జీవితం వేరు. ప్రశ్నించడం, ధిక్కరించడం, అధిక్షేపించడం, అవసరమైనపుడు విప్లవించడం, ప్రతిఘటించడం... ఇవన్నీ ఆయన జీవితంలో నిత్యకృత్యాలై సాగిన జీవక్రియలు. ఇవే ఆయన జీవన శైలి. ఇవన్నింటినీ మించి 'ఆర్ద్రత' నిండిన హృదయంతో వెన్నవలె కన్నీరై కరిగిపోవడం ఆయన స్వచ్ఛమైన మానవతకు నిదర్శనం. 'అతిథివోలె వుండి వుండి/ అవని విడిచి వెళ్ళుతాను' అని ప్రశాంతంగా నిష్క్రమించిన ప్రజాకవి కాళోజీ ఈ దేశ సంపద.

ఇదే పరంపరలో కాళోజీ 'నేనూ – నా గొడవ' శీర్షికన నా గొడవ సంపూర్ణ కవితల సంపుటి వెలువడినప్పుడు 2-9-2001 న ఒక ప్రవేశిక రాస్తూ అన్నాడు 'జరిగినదంతా చూస్తూ ఎరగనట్లు పడిఉండగ సాక్షీభూతుణ్ణిగాను. సాక్షాత్తూ మానవుణ్ణి' అని నా గొడవలో చెప్పుకున్నా. అగో ఆ మానవుణ్ణి కాబట్టే చుట్టుపట్ల జరిగే ప్రతి విషయానికి స్పందించడం, ఆలోచన- అసమ్మతి, నిరసన- ధిక్కారం, ప్రతిఘటన, ప్రతి ఘటనా కార్యక్రమం. నేననుకున్న అవకతవకలను సవరించే ప్రయత్నం. నా వలెనే అవకతవకలను సవరించే వారితో సహకరించే ప్రయత్నం. ఎవరితోనూ సంపూర్ణంగా ఏకీభవించకపోవడం- మరెవరూ నాతో ఏకీభవించకపోవడం- నాకనిపిస్తుంది- ఒకరితో ఏకీభవించే ధోరణికన్నా ఒకరిని మనతో ఏకీభవింపజేయాలన్నదే పరస్పర సహకారానికి గొప్ప లోటేమోనని. ఇంతకూ మనస్సేమో క్షణమో తీరున మారి రకరకాలుగా ఆడిస్తున్నది. దాన్ని అచలం చేసే నా ప్రయత్నం ఎప్పుడూ ఫలించలేదు. ఈ 'నా గొడవ' మొదటి సంపుటి వెలువరిస్తున్న నాటికి ఒక విలక్షణమైన, అతి స్పష్టమైన ఆలోచనా ధోరణి ఉంది కాళోజీకి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు సమైక్య రాష్ట్రానికి మద్దతు తెల్పిన కాళోజీ తర్వాత తర్వాత వలసపాలకుల చేత జరుగుతున్న దోపిడీని ఎప్పటికప్పుడు ప్రొఫెసర్ జయశంకర్‌తో కలిసి అర్థం చేసుకున్నాడు. 'ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావ' కాంక్షను రగిల్చే రాజకీయ బాధ్యతను భుజానికెత్తుకున్న ఆద్యులలో ప్రప్రథమ వ్యక్తి కాళోజీ. 1969లో తెలంగాణ తొలి ఉద్యమ నిర్మాణంలో కాళోజీ పాత్ర గణనీయమైంది. అప్పుడు ఆవిర్భవించిన తెలంగాణ ప్రజా సమితి వరంగల్లు మహానగరంలో 1-5-1969న నిర్వహించిన ప్రజాసభలో కాళోజీ మహాగ్రహంతో చదివిన కవిత 'ప్రాంతం వాడే దోపిడీ చేస్తే..' ఆ కవితలో అంటాడు. 'దోపిడి చేసే ప్రాంతేతరులను/ దూరం దాకా తన్ని తరుముతం/ ప్రాంతం వాడే దోపిడి చేస్తే/ ప్రాణంతోనే పాతర వేస్తం..' అని. అది నిప్పులను నింగినిండా విరజిమ్మిన ఉద్యమ కవిత. తెలంగాణ సాధనలో ఈ కవిత వహించిన పాత్ర మహోన్నతమైంది. ఒక్క ఆలోచన, ఒక్క విలువైన మార్గదర్శక సూత్రం మనిషి జీవితాన్నే మార్చగలదు అంటానికి కాళోజీ నాకు దానం చేసిన ఒకే ఒక అమృతవాక్యం నిజంగానే నా జీవితాన్ని నిర్మించింది. అది-

'తొలగి తోవ ఎవడిచ్చు- త్రోసుకొని పోవలయు
బ్రతుకు పోరాటము- పడకు ఆరాటము' (బ్రతుకు- 1951)

'థింక్ డిఫరెంట్లీ' అని అంటాడు ప్రపంచ ప్రసిద్ధి చెందిన అమెరికన్ వ్యక్తిత్వ వికాస గురువు స్టీఫెన్ ఆర్ కోవె. కోవె లాంటి ఆధునిక వ్యక్తిత్వ నిర్మాణ నిపుణులు, తాత్విక చింతనాపరులకంటే ముందే.. ఎప్పుడో అత్యంతాధునిక ఆలోచనలతో భిన్నంగా కవిత్వం రాసి, భిన్నంగా పోరాడి, భిన్నంగా జీవించి.. చివరికి భిన్నంగా మరణించినవాడు కాళోజీ (మరణానంతరం తన భౌతికకాయాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అధ్యయనార్థం ఇవ్వడం 2002లో ఎంతో భిన్నమైన నిర్ణయమే). కాళోజీ చూపు వేరు, దృష్టి వేరు.. చింతన వేరు.. జీవితం వేరు. ప్రశ్నించడం, ధిక్కరించడం, అధిక్షేపించడం, అవసరమైనపుడు విప్లవించడం, ప్రతిఘటించడం... ఇవన్నీ ఆయన జీవితంలో నిత్యకృత్యాలై సాగిన జీవక్రియలు. ఇవే ఆయన జీవన శైలి. వీటన్నింటినీ మించి 'ఆర్ద్రత' నిండిన హృదయంతో వెన్నవలె కన్నీరై కరిగిపోవడం ఆయన స్వచ్ఛమైన మానవతకు నిదర్శనం. కదిలిస్తే కన్నీరై కాళోజీ ప్రవహించిన సందర్భాలు కోకొల్లలు. అధిక వయసుతో, నేపథ్యాలతో, ఇతరేతర పరిగణనలతో సంబంధం లేకుండా 'మనుషులందరితో' నీళ్ళలో నీళ్ళవలె కలిసిపోయి జీవించడం ఒక్క కాళోజీకి మాత్రమే సాధ్యమైంది.

తన 'స్వగతం' కవితలో నమోదు చేసుకున్నట్టే,

'అతిథివోలె వుండి వుండి/ అవని విడిచి వెళ్ళుతాను/ పల్లె పట్టణంబులనక
పల్లెనై తిరిగినాను / మురికిపేట నడుమనున్న / ఇరుకులలో యిరికినాను
కూటిపేద తన కబళము/ నోటికీయ గుడిచినాను
....
అతిథివోలె వుండి వుండి / అవని విడిచి వెళ్ళుతాను-'

అని ప్రశాంతంగా నిష్క్రమించిన ప్రజాకవి కాళోజీ ఈ దేశ సంపద. ఆయన శాశ్వతుడు.

• రామా చంద్రమౌళి
కాళోజీ అవార్డ్ గ్రహీత

(సెప్టెంబర్ 9: కాళోజీ 110వ జయంతి)

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8 కనిష్ఠం 22.9

73 ప్రాంతాల్లో నిమజ్జన కొలనులు

● పోర్టబుల్, ఎస్కలేటర్ పాండ్స్ ఏర్పాటు ● కమిషనర్ ఆమ్రపాలి

6

దుబాయ్‌లో గణపతి ప్రసాదం

బిర్యానీస్.కామ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో..



అవిఘ్నమస్తు!

- ఉత్సాహంగా వినాయక ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు
- ఆగమనం నుంచి నిమజ్జనం వరకు అంతటా ప్రత్యేకత
- ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లైవ్ స్ట్రీమింగ్‌లో వేడుక

మహా గణపతి పండగకు మహానగరం సిద్ధమైంది. ఎటువంటి విఘ్నాలూ లేకుండా నవరాత్రులు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వినాయక పండగంటే నగరంలో ప్రత్యేక సందడి ఉంటుంది. విగ్రహ ప్రతిష్ఠాపన మొదలు పూజలు, నిమజ్జనం వరకు ఆ సందడి కొనసాగుతుంది. గణపతి బప్పా మోరియా.. ఆదా లడ్డూ ఖాళీయా.. అంటూ యువతీయువకులు కేరింతలు కొడుతుంటారు.

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): గణేష్ పండుగ అంటేనే డీజే పాటలు.. తీన్‌మార్ స్టెప్పులకు స్పెషల్‌గా ఉంటుంది. అయితే, గతంలో విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసే సమయంలో మాత్రమే డీజే పాటలు, బ్యాండు మేళాలను వినియోగించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కుర్రకారు కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నారు. గణేష్ ఆగమన్.. పేరిట తమ ప్రాంతంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. ఒకే రకం టీషర్టులు, కుర్తాలు ధరించి, పేపర్ షాట్స్ పేలుస్తూ, డ్యాన్సులు వేస్తూ ఘనంగా తీసుకెళ్తున్నారు. పలుచోట్ల మహిళలు సైతం మంగళహారతులుతో స్వాగతనృత్యాలు చేస్తూ గణపతిని సాదరంగా స్వాగతిస్తున్నారు.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లైవ్ స్ట్రీమింగ్..

టెక్నాలజీని వాడుకుని తమ గణనాథుడిని ఇతరులకు చూపించేందుకు యువతీ, యువకులు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌వాసులు, గణేష్ మండలి సభ్యులు పోటీపడుతున్నారు. ఈ మేరకు గణపయ్యను మండపానికి తీసుకురావడం మొదలుకుని ప్రతి కార్యక్రమాన్ని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లైవ్ స్ట్రీమింగ్ ఇస్తున్నారు. తద్వారా సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలిచేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇలా ప్రతి విషయాన్ని అందరికి చూపించి ఏడాదిపాటు గుర్తుండిపోయేలా

మిగతా 6వ పేజీలో..



ఖైరతాబాద్ గణపతి ప్రత్యేకతలు

ఎత్తు	: 70 అడుగులు
వెడల్పు	: 28 అడుగులు
బరువు	: 40 టన్నులు
ఖర్చు	: కోటి రూపాయలు

150 మంది కళాకారులు దాదాపు 65 రోజులు రాత్రింబవళ్లు కష్టపడి విగ్రహాన్ని సిద్ధం చేశారు.



రాంనగర్‌లోని శ్రీగణపతి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్భాటంగా వినాయకుడి ఆగమనం

కొలువైన సప్తముఖ మహాశక్తి గణపతి

- నేడు గవర్నర్, ముఖ్యమంత్రి పూజలు
- 10 రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

6

ఖైరతాబాద్ గణేషుడి తర్వాత.. బాచుపల్లిలో 28 అడుగుల గణనాథుడు

బాలాపూర్ గణేశ్.. వెరీ స్పెషల్

పహాడిషరీఫ్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వినాయకుడి ఉత్సవాలతో పాటు, నిమజ్జన ఊరేగింపు కూడా బాలాపూర్ గణేష్‌తోనే మొదలుకావడం ఆనవాయితీగా వస్తోంది. అలాంటి గణనాథుడి విగ్రహాన్ని ఈ సంవత్సరం వినూత్నంగా తీర్చిదిద్దారు. తల పైభాగంలో అమృతం కోసం సముద్రంలో మంధర పర్వతాన్ని దేవతలు, రాక్షసులు మదనం చేస్తున్నట్లుగా రూపొందించారు. కూర్చున్న ఆకృతిలో కనిపించే బొజ్జ గణపయ్య ఒక చేతిలో సింహం చిత్రాలతో కూడిన త్రిశూలం, రెండో చేతిలో ఓంకారం, మూడవ చేతిలో గొడ్డలి, నాలుగో చేతిలో లడ్డూ పెట్టే వీలుగా విగ్రహాన్ని తీర్చిదిద్దారు. అయోధ్య రామాలయం తీరులో మండపాన్ని నిర్మిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి తెలిపారు. కాగా, బాలాపూర్ లడ్డూకు కూడా ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. 1994లో రూ.450కు ప్రారంభమైన లడ్డూ వేలం గత సంవత్సరంలో రూ. 18.90 లక్షలు పలికింది. వేలం ద్వారా వచ్చిన డబ్బుతో ఇప్పటి వరకు రూ.1,40,71,970లు వెచ్చించి ఆలయాల అభివృద్ధి, షెడ్డు నిర్మాణం, బోరు, వరద బాధితులకు సహాయం వంటి కార్యక్రమాలు చేపట్టారు.



బాలాపూర్ గణనాథుడి విగ్రహ నమూనా





ఎర్రగడ్డలో విగ్రహాల కొనుగోలుదారుల సందడి

రూ.2వేల కోట్లతో అధునాతన ఉస్మానియా ఆస్పత్రి

● రెండు నెలల్లో పనులకు శంకుస్థాపన : మంత్రి

8

హైడ్రా.. ఆపరేషన్ నాలా..!

- వరద ప్రవాహ వ్యవస్థ అడ్డంకుల తొలగింపుపై నజర్
- ముంపు ముప్పు నేపథ్యంలో ప్రాధాన్యత
- రాంనగర్‌లోని మణెమ్మ బస్తీ తరహాలో చర్యలు
- సమాచారమివ్వాలని కోరుతోన్న ఏజెన్సీ
- సోమవారం నుంచి బుద్ధభవన్‌లో ప్రత్యేక కౌంటర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): వర్షాలు.. ముంపు ముప్పు నేపథ్యంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) వరద నీటి నిర్వహణ మెరుగుదలపై దృష్టి సారించింది. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగిస్తూనే, ఆపరేషన్ నాలా కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. నాలాల్లో వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న నిర్మాణాల తొలగింపునకు రంగం సిద్ధం చేస్తోంది. నాలాలకు అడ్డుగా ఉన్న, కబ్జా చేస్తు చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని పౌరులను కోరుతోంది. రాంనగర్‌లోని మణెమ్మ బస్తీలో స్థానికుల ఫిర్యాదు మేరకు పలు ప్రభుత్వ విభాగాలు ఇటీవల ఆక్రమణలు తొలగించాయి. అదే తరహాలో ఇతర ప్రాంతాల్లోనూ చర్యలు చేపట్టాలని హైడ్రా భావిస్తోంది. జీహెచ్‌ఎంసీతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ఏరియాల్లో నాలాల విస్తరణకు ప్రస్తుతం ప్రాధాన్యతమిస్తున్నారు.

నాలాలకు అడ్డుగా..

జీహెచ్‌ఎంసీ పరిధిలో 370 కి.మీల మేర మేజర్ నాలాలు, 1250 కి.మీల వరద నీటి కాలువలు (స్ట్రామ్ వాటర్ డ్రైన్) ఉన్నాయి. వీటి ప్రవాహ వ్యవస్థ సామర్థ్యం గంటకు 2 సెం.మీలు మాత్రమే . కొన్నాళ్లుగా తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదవుతోన్న నేపథ్యంలో రహదారులు జలమయమవుతున్నాయి. నాలాల పక్కనున్న కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయి. పట్టణీకరణ నేపథ్యంలో నగరంలో పరిస్థితులు మరింత తీసికట్టుగా మారుతున్నాయి. ఈ ఇబ్బందులకు చెక్‌పెట్టేలా హై-సిటీ

మిగతా 6వ పేజీలో..

నాలాల ఆక్రమణల సమాచారమివ్వండి



నాలాలకు అడ్డుగా ఉన్న, కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాల సమాచారం ఇవ్వండి. సోమవారం నుంచి బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉంటారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు తీసుకుంటాం. పూర్తి వివరాలు సమర్పిస్తే క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటాం.

- ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్

అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కావు

● రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు సాధ్యం కావని, పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కులవృత్తులు బతకాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం ద్వారా సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ పర్యావరణాన్ని రక్షించవచ్చన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన విగ్రహాలతో వాతావరణ కాలుష్యంతో పాటు చిన్న వయసులోనే కేన్సర్, డయాబెటిస్, గుండె జబ్బులు, కిడ్నీసమస్యల బారిన పడే అవకాశం ఉంటుందన్నారు. మట్టి విగ్రహాలను పూజించి కులవృత్తులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్లు కదిరివన్, వెంకటాచారి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఆశన్న, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సురేష్‌బాబు, జిల్లా అధికారులు పెరికే యాదయ్య, జయశంకర్, ఆర్. కోటాజీ, సీపీఓ డాక్టర్ సురేందర్, వివిధ శాఖల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



మట్టి గణపతితో మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్

ఆర్థికం.. ఆరోగ్యం.. తయారీ

- ఏఐతో అత్యధిక ఉద్యోగాలు వచ్చే రంగాలివే
- కోల్పోయేవాటితో పోలిస్తే కొత్త ఉద్యోగాలే ఎక్కువ
- ఏఐ సదస్సులో వెల్లడించిన నిపుణులు
- ముగిసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు



చర్చాగోష్టిలో పాల్గొన్న నిపుణులు



సిద్ధార్థ్ నంద్యాలకు తన చేతి గడియారాన్ని బహుకరిస్తున్న మంత్రి

హైదరాబాద్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధతో అత్యధిక ఉద్యోగాల కల్పన జరిగే మొదటి మూడు రంగాల్లో ఆర్థిక, ఆరోగ్యం, తయారీ రంగాలు ఉంటాయని నిపుణులు వెల్లడించారు. ఈ మూడు రంగాల్లో ఏఐ వినియోగంపై ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. హెచ్ఐసీసీలో జరుగుతున్న అంతర్జాతీయ ఏఐ సదస్సులో భాగంగా శుక్రవారం నిర్వహించిన వివిధ చర్చాగోష్ఠుల్లో పలు జాతీయ, అంతర్జాతీయ ఏఐ నిపుణులు పాల్గొన్నారు. విద్యారంగంలో ఏఐ వినియోగంపై ఖాన్ అకాడమీ వ్యవస్థాపకుడు సల్ ఖాన్, ఏఐ భవిష్యత్తు విప్లవంపై న్యూయార్క్‌లోని ఎన్‌వైయు స్టర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ్ సుందరరాజన్ మాట్లాడారు. భారత్‌లో ఏఐ భవిష్యత్తుపై ఎన్‌విడియా ఏషియా సౌత్ ఎండి విశాల్

మిగతా 6వ పేజీలో..

రహదారులు జలమయం


వనస్థలిపురం పనామా రోడ్డుపై వర్షం నీరు

- నగరంలో వర్షం
- గచ్చిబౌలిలో అత్యధికంగా 4.3 సెం.మీ
- నేడు గ్రేటర్‌కు ఎల్లో హెచ్చరికలు

హైదరాబాద్‌సిటీ/చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం కురిసిన భారీవర్షంతో పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమ్యాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ ప్రాంతాల్లో కురిసిన రహదారులపై భారీగా వరదనీరు నిలిచిపోయింది. అమీర్‌పేట, పంజాగుట్ట, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ గచ్చిబౌలి, మాదాపూర్, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ ప్రధాన రహదారులపై ట్రాఫిక్ జాం సమస్యలు తలెత్తి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి చాదర్‌ఘాట్ కాజ్ వే బ్రిడ్జిపై వరద నీరు చేరడంతో వాహనాదారులు ఇబ్బందులకు గురయ్యారు. ముసారాంబాగ్ బ్రిడ్జిపైకి ఒకవైపు సమీపంలో ఉన్న సివరేజి పొంగడంతో రహదారి బురదమయంగా మారింది. మలక్‌పేట అక్షయ్ హోటల్, న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ కింద రోడ్డుపై వరద నీరు భారీ చేరడంతో ట్రాఫిక్‌జాంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు వాతావరణశాఖ అధికారులు శనివారం ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు.

కొలువైన సప్తముఖ మహాశక్తి గణపతి

- నేడు గవర్నర్, ముఖ్యమంత్రి పూజలు
- 10 రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

ఖైరతాబాద్,సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ సప్తముఖ మహాశక్తి గణపతి ఒక రోజు ముందుగానే భక్తులకు దర్శనం ఇచ్చారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో పాటు సరస్వతి, మహాలక్ష్మి, పార్వతుల సమేతంగా 7 తలలు, 14 చేతులు, తలపై ఏడు పడగల నాగశేషువుతో ఆకట్టుకుంటున్నారు. గణపతితో పాటు రాహుకేతువుల విగ్రహాలు మరో ఆకర్షణగా నిలవగా గత సంవత్సరం దేశమంతా ధ్యానించి ప్రతిష్ఠాపజేసిన అయోధ్య బాల రాముడి విగ్రహం చూడముచ్చటగా తయారుచేశారు. ఏటా గణపతికి ఇరువైపులా ఉండే మండపాల్లో శ్రీనివాస కళ్యాణం, శివపార్వతుల కళ్యాణం ఘటాలు ఆకట్టుకుంటున్నాయి.

తొలిరోజు ఇలా..

శనివారం ఉదయం 8 నుంచి 9: ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గణపతికి 75 అడుగుల జంధ్యం, 75అడుగుల కండువాతో పాటు భారీ గరికమాల, గణపతితో పాటు అన్ని విగ్రహాలకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ఇందులో తెలంగాణ సాంస్కృతాక మండలి ఆధ్వర్యంలో 100 మంది కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు.

ఉదయం 11.00 గంటలకు: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గణపతికి తొలి పూజలు నిర్వహిస్తారు

మధ్యాహ్నం 3.00 గంటలకు: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గణపతికి పూజలు నిర్వహిస్తారు.

- వీటితో పాటు ప్రతిరోజూ గణపతి సమక్షంలో నిత్య హోమం జరుగుతుంది. ఉదయం 5-30 నుంచి 7.30 వరకు ఈ హోమం ఉంటుంది.

అవిఘ్నమస్తు!

(5వ పేజీ తరువాయి)

ముందుకుసాగుతున్నారు. మరో వైపు నవరాత్రులపాటు మండపాల వినూత్న ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకున్నారు. కాలనీలు, అపార్ట్‌మెంట్ల, భారీ మండపాల వద్ద కొంతమంది స్ర్కీన్లు ఏర్పాటు చేసి సినిమాలను ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తున్నారు. మరికొందరు బుల్లితెర కమెడీయన్లు, సంగీత కచేరీలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కాగా, కాలనీలు, గల్లీల్లో పిల్లలు, మహిళలకు ఆటల పోటీలు పెట్టి బహుమతులను అందజేయాలని భావిస్తున్నారు. మొత్తంగా మహా గణపతిని మండపానికి మనసారా స్మరించి తీసుకొస్తూ.. నిమజ్జనానికి ఉత్సాహంతో తరలిస్తూ.. చిన్నా, పెద్దా అంతా భక్తిప్రపత్తులను చాటుకుంటున్నారు.

10 రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రులు పురస్కరించుకొని ఖైరతాబాద్ బడా గణేషుని దర్శనం కోసం లక్షలాది మంది భక్తులు పదిరోజులపాటు వచ్చే అవకాశం ఉన్నందున ఖైరతాబాద్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

సెప్టెంబర్ 7 నుంచి 17 వరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ముఖ్యంగా వారంతాల్లో, ప్రభుత్వ సెలవు దినాల్లో భక్తులు రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, వాహనదారులు తప్పనిసరిగా పోలీసులు ఏర్పాటు చేసిన డైవర్షన్స్‌ను పాటించాలని సూచించారు.

- వీవీ విగ్రహం, రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా మింట్ కాంపౌండ్ వైపు వచ్చే సాదారణ ట్రాఫిక్‌ను రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిరంకారీ జంక్షన్ వైపు అనుమతించరు.
- పాత సైఫాబాద్ పీఎస్ నుంచి బడా గణేష్ వైపు సాధారణ ట్రాఫిక్‌ను రాజ్‌దూత్ లైన్ వైపు అనుమతించకుండా ఇక్బాల్ మినార్ వైపు మళ్లించబడుతుంది.
- ఇక్బాల్ మినార్ నుంచి మింట్ కాంపౌండ్ వచ్చే ట్రాఫిక్‌ను మింట్‌లైన్ ఎంట్రెన్స్ వద్ద తెలుగుతల్లి జంక్షన్‌వైపు మళ్లిస్తారు.
- నిరంకారి నుంచి వచ్చే ట్రాఫిక్‌ను ఖైరతాబాద్ పోస్టాఫీస్
- రైల్వేగేట్, ఓల్డ్ సైఫాబాద్ పీఎస్ వైపు అనుమతించరు.

ఖైరతాబాద్ గణేషుడి తర్వాత..

నిజాంపేట్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలు మొదుపెట్టి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాచుపల్లి మాజీ సర్పంచ్, కార్పొరేటర్ ఆగం పాండు ఆధ్వర్యంలో 28 అడుగుల భారీ వినాయకుడిని ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్ గణేషుడి తర్వాత ఇదే అతి పెద్ద విగ్రహమని పాండు తెలిపారు.



దుబాయ్‌లో గణపతి ప్రసాదం

- బిర్యానీస్.కామ్ వెబ్‌సైట్‌లో అమ్మకాలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని దుబాయ్‌లోని తెలుగు ప్రజలకు స్పెషల్ పండుగ భోజనాన్ని అందుబాటులో ఉంచారు. గణపతిని కొలిచి పిండి వంటలు తయారు చేసుకునే వెసులుబాటు, తీరిక లేని వారికి ప్రసాదాన్ని ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచడం ఆసక్తికరంగా మారింది. ఈ మేరకు వినాయక చవితి నైవేద్యం ప్యాక్ కింద చంకర పొంగళి 250 గ్రాములు, పులిహోర 250 గ్రాములు, పూర్ణాలు 5, గారెలు 5, ఉండ్రాళ్లు 5, కుడుములు 5ను విక్రయిస్తున్నారు. వినాయక చవితి రోజున గణపతిని పూజించే భక్తులను ఆకట్టుకునేందుకు ఏబ కరామా ప్రాంతంలోని జబీల్‌రోడ్డులోని ఏబ ఆర్తీ ప్లాజా బిల్డింగ్‌లో అమ్మకాలు చేస్తున్నట్లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బిర్యానీస్.కామ్ వెబ్‌సైట్ విడుదల చేసిన పోస్టర్ నగరంలో వైరల్‌గా మారింది. గణపతి భక్తులకు దుబాయ్‌లో కూడా సేవలందించడం బాగుందని పలువురు పేర్కొన్నారు.



73 ప్రాంతాల్లో నిమజ్జన కొలనులు

- పోర్టబుల్, ఎస్కలేటర్ కొలనుల ఏర్పాటు
- కమిషనర్ ఆమ్రపాలి


విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటుచేసిన తాత్కాలిక కొలను

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల నేపథ్యంలో విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై జీహెచ్ఎంసీ దృష్టి సారించింది. గ్రేటర్ వ్యాప్తంగా 73 కొలనులను సంస్థ అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇందులో ఇప్పటికే కొన్ని కొలనులు సిద్ధమ య్యాయని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కమిషనర్ ఆమ్రపాలి కాట పేర్కొన్నారు. 27 బేబి పాండ్స్. 24 పోర్టబుల్, 22 ఎస్కలేటర్ పాండ్స్ ఏర్పాటు చేశారు. రెండు నుంచి ఐదు అడుగుల ఎత్తున్న విగ్రహాలను ఈ కొలనుల్లో నిమజ్జనం చేయొచ్చు. చెరువులు కలుషితం కాకుండా 3.10 లక్షల పర్యావరణహిత ప్రతిమలను పంపిణీ చేసిన జీహెచ్ఎంసీ.. నిమజ్జనానికి తాత్కాలిక కొలనులను ఏర్పాటు చేస్తోంది. గణనాథులను తీసుకెళ్లే మార్గాల్లో ఇబ్బందులు లేకుండా రహదారుల మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపు వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాల నేపథ్యంలో మండపాల సమీపంలో, ప్రధాన మార్గాలు, నిమజ్జన కొలనుల వద్ద పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఆర్థికం.. ఆరోగ్యం.. తయారీ..

(5వ పేజీ తరువాయి)

ధూపర్, యోటా ఇన్‌ఫ్రా ఎండీ సునీల్ గుప్తా తదితరులు మాట్లాడారు. ప్రపంచంపై ఏఐ ప్రభావంపై అమెరికా విదేశాంగ శాఖ సీనియర్ సలహాదారుడు ఎరిక్ స్మిత్, ఇతర అంతర్జాతీయ నిపుణులు మాట్లాడారు.

ఉద్యోగుల పాత్ర మారుతుంది..

ఏఐ ప్రభావంతో అనేకమంది ఉద్యోగాలు కోల్పోతారన్న ప్రచారంపై.. అత్యధిక మంది నిపుణులు విభేదించారు. ప్రతీ రంగంలో ప్రతీ కంపెనీ ఏఐ ఆధారిత టెక్నాలజీని వినియోగిస్తోందన్నారు. దీంతో సహజంగానే ఉద్యోగులంతా ఏఐపై ప్రావీణ్యం సాధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇతర రంగాల్లోనూ ఏఐతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అయితే ఆర్థికం, ఆరోగ్యం, తయారీ రంగాల్లో ఉద్యోగాల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. 'బ్యాంకింగ్, బీమా లాంటి అనేక రంగాల్లో సంస్థలు సమాచార విశ్లేషణ (డేటా అనాలిటిక్స్)పై ఆధారపడతాయి. ప్రజారోగ్యానికి సంబంధించి ఏఐతో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. రోగి ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించడంతో అతడి ఆరోగ్య భవిష్యత్తును ముందుగానే పసిగట్టవచ్చు. దీంతో రక్తపోటు, మధుమేహం, హృద్రోగ సమస్యలను ముందుగానే నివారించే అవకాశం ఏర్పడుతుంది' అని నిపుణులు వివరించారు. సమావేశంలో భాగంగా హాకథాన్ విజేతలకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నగదు పురస్కారాలు అందించారు. తమతో రూమ్ షేర్ చేయాలనుకునే వారి మనస్తత్వం గుర్తించే ఫ్లాట్‌మేట్ ఏఐని అభివృద్ధిచేసిన ఐఐటీ కాన్పూర్ విద్యార్థి నితిన్ మొదటి పురస్కారాన్ని అందుకున్నారు. అతిపిన్న ఏఐ నిపుణుడిగా ఖ్యాతిగాంచిన భారత సంతతికి చెందిన యువ పరిశోధకుడు, 14 ఏళ్ల సిద్దార్థ్ నంద్యాల ఆవిష్కరణలను వీక్షించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మురిసిపోయారు. ఏఐతో అతడి ప్రతిభను ప్రశంసిస్తూ తన చేతికున్న గడియారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా వరల్డ్ ట్రేడ్ అసోసియేషన్స్‌తో పాటు పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వంతో ఎంవోయు కుదుర్చుకున్నాయి.

హైడ్రా.. ఆపరేషన్ నాలా..!

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమంలో భాగంగా నాలాల విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నారు. దీనికి సమాంతరంగా ఆక్రమణల తొలగింపూ చేపట్టాలన్నది సర్కారు యోచనగా తెలుస్తోంది. ఈ క్రమంలో దీర్ఘకాలంగా ఉంటోన్న ప్రజలకు ఇబ్బంది లేకుండా నివాసేతర నిర్మాణాలను మాత్రమే తొలగించాలని నిర్ణయించారు. గతంలో జీహెచ్ఎంసీ నిర్వహించిన సర్వేలో నగరంలోని నాలాలపై 12 వేలకుపైగా ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించారు. ఇందులో దాదాపు 35 శాతం వరకు నివాసేతర నిర్మాణాలే. నాలాలకు అడ్డంగా రెండు, మూడంతస్తుల భవనాలు నిర్మించారు. కొన్నిచోట్ల 30 అడుగుల వెడల్పు ఉన్న నాలాలు.. పది అడుగుల లోపునకు కుచించుకుపోయాయి. ఇంకొన్నిచోట్ల నాలాలు రెండు, మూడు అడుగుల కంటే వెడల్పు లేకపోవడం గమనార్హం. దీంతో పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. నాలాల సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు అవసరమని గతంలో ప్రణాళికలు రూపొందించారు. నిధుల కొరత, ఆక్రమణల తొలగింపు, పునరావాసం తదితర ఇబ్బందుల నేపథ్యంలో కార్యరూపం దాల్చలేదు. 'నివాసేతర ఆక్రమణల తొలగింపు ద్వారా వరద ప్రవాహ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం' అని హైడ్రా వర్గాలు చెబుతున్నాయి. చెరువుల్లో ఆక్రమణల ఫిర్యాదులనూ హైడ్రా పరిశీలిస్తోంది. చెరువులను రంగనాథ్ పరిశీలిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో పలు చెరువుల్లో నీటి నిల్వల ఆధారంగా ఎఫ్‌టీఎల్‌ను సూత్రప్రాయంగా అంచనా వేస్తున్నారు.

వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే

రాజేంద్రనగర్, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ అధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి హనుమాన్‌గర్‌లో ఉన్న పత్తికుంట కొలన్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. పత్తికుంట కొలన్ వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేలా క్రేన్ సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ఈఈ వి.శ్రీనివాసులు, ఇంజనీరింగ్ విభాగం ఏఈ వెంకోబా, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో తదితరులు ఎమ్మెల్యేకు పర్యావరణ వినాయకుడి విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ వై.శ్రీధర్, కె.ఎస్ దయానంద్, జి.బాబురావు, వేణుగోపాల్, శ్రీధర్‌రెడ్డి, రాజు, పి.రవీందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం కల్పించాలి: కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం కల్పించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఐసీడీఎస్ అనుబంధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. అంగన్‌వాడీల్లో పిల్లల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను నిబద్ధతతో చేపట్టి హాజరుశాతం పెంచాలన్నారు. వారికి బలవర్ధకమైన ఆహారం అందించి, ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలని, వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పిల్లలకు 11 రకాల వైద్య చికిత్సలు అందించాలన్నారు. జిల్లాలో సఖీ కేంద్రాన్ని త్వరితగతిన పూర్తిచేసి దసరా వరకు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.



అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఏడో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి నాంపల్లి 11వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి అనిత జీవిత ఖైదు శిక్ష విధించారు. బాధితురాలి కుటుంబానికి జిల్లా లీగల్ అథారిటీ సెల్ నుంచి రూ. 5లక్షలు నష్టపరిహారం అందించాలని శుక్రవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. బాలిక తల్లిదండ్రులు చిన్నప్పుడే విడిపోయారు. దాంతో తల్లి వద్ద ఉంటూ చత్రినాకలోని ఓ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతుంది. ఒక రోజు బాలిక అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లివస్తుండగా.. ఆమె స్నేహితురాలి సోదరుడు రాకేష్ అలియాస్ చింటూ బలవంతంగా బాలికను వారి ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తీవ్ర రక్తస్రావంతో ఇంటికి వచ్చిన బాలిక జరిగిన విషయం తల్లికి చెప్పగా, కుమార్తెతో కలిసి తల్లి చత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి, బాలికను భరోసా కేంద్రానికి పంపారు. ఆ తర్వాత బాలికకు తరచూ పొత్తికడుపులో నొప్పి వస్తుండటంతో తల్లి భరోసా సిబ్బందిని ఆశ్రయించింది. 2021లో మరోసారి ఆస్పత్రిలో చేర్పించగా.. తీవ్ర ఇన్‌ఫెక్షన్ వల్ల ఆరోగ్యం క్షీణించి 3 రోజుల అనంతరం మృతిచెందింది. ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్‌రెడ్డి చార్జిషీట్ దాఖలు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి అనిత.. నిందితుడు రాకేష్‌కు జీవిత ఖైదు విధిస్తూ తీర్పును ఇచ్చారు. నిందితునికి సరైన శిక్షపడేలా ఇన్వేస్టిగేషన్ చేసిన ఇన్‌స్పెక్టర్‌ను, లీగల్ సిబ్బందిని సీపీ అభినందించారు.







లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

రాజేంద్రనగర్: మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్ పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. మైలార్‌దేవుపల్లి అలీనగర్‌లో బిహార్‌కు చెందిన ఫుడాన్ సాహరా (28) స్క్రాప్ పరిశ్రమలో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. 2022లో అతడు మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడగా, అప్పటి రాజేంద్రనగర్ ఏసీపీ కేసు నమోదు చేశారు. తగిన సాక్ష్యాధారాలతో నిందితుడుని కోర్టులో హాజరుపరుచగా, న్యాయస్థానం ఫుడాన్ సాహరాకు 20ఏళ్ల జైలు, రూ.8వేలు జరిమానా విధించింది. బాలికకు నష్టపరిహారంగా రూ.3లక్షలు ఇవ్వాలని కోర్టు తీర్పు చెప్పిందని మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ తెలిపారు.


కుప్పకూలి అక్కడిక్కడే ఒడిశా వాసి మృతి

మూత్ర విసర్జన కోసం కారు దిగి..

రాజేంద్రనగర్, సెప్టెంబర్6 (ఆంధ్రజ్యోతి): కారులో ప్రయాణం చేస్తున్న వ్యక్తి మూత్ర విసర్జన కోసం కిందకి దిగి అక్కడిక్కడే కుప్పకూలి మృతిచెందాడు. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన తేజేశ్వర్ (40) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి షాద్‌నగర్‌లో నివాసం ఉంటూ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం బోయిన్‌పల్లిలో ఉంటున్న బంధువుకు వద్దకు వెళ్లేందుకు షాద్‌నగర్ నుంచి క్యాబ్‌లో బయలుదేరాడు. మార్గమధ్యంలో ఆరాంఘర్ పీవీ నర్సింహ్మారావు ఎక్స్‌ప్రెస్ వే వద్దకు రాగానే మూత్ర విసర్జన కోసం కారును ఆపమన్నాడు. డ్రైవర్ కారు ఆపడంతో కిందకు దిగి రక్తం వాంతులు చేసుకుని కుప్పకూలి మృతిచెందాడు. క్యాబ్ డ్రైవర్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వద్ద ఉన్న ఫోన్ నంబర్ ఆధారంగా బోయిన్‌పల్లిలో ఉంటున్న బంధువు త్రివిక్రమ్‌కు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.







తాళం వేసిన ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి 50 తులాల బంగారం, రూ. 2.3లక్షల నగదును ఎత్తుకెళ్లారు. రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ లక్ష్మీనగర్ కాలనీలో నివసం ఉంటున్న లోక్‌నాథ్‌రెడ్డి కన్సల్టెంట్‌గా పనిచేస్తాడు. ఆగస్టు 28న కుటుంబంతో కలసి ఇంటికి తాళం వేసి విజయవాడలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించిన వాచ్‌మన్.. లోక్‌నాథ్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా 50 తులాల బంగారం, రూ. 2.3 లక్షల నగదు కనిపించలేదు. దాంతో అతడు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో ఒకరి హత్య


మంగళహాట్: గుర్తుతెలియని కొందరు ఓ వ్యక్తిని హత్య చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీతారాంబాగ్ ప్రాంతానికి చెందిన సయ్యద్ తాజాముల్ అహ్మద్(46) గురువారం రాత్రి పడుకొని, శుక్రవారం ఉదయం లేచి చూసేసరికి తలపై బలమైన గాయాలు ఉండడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
ttps://ejyothy.com/U383708లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తర్వాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.



మీ కుమార్తెపై కేసు నమోదైంది.. అరెస్ట్ కాకుండా ఉండాలంటే డబ్బులు కట్టాల్సిందే

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మీ కుమార్తెపై కేసు నమోదైంది, అరెస్ట్ కాకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించిన సైబర్‌నేరగాళ్లు మహిళ నుంచి రూ.1.90 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళ(70) కుమార్తె విదేశాల్లో ఉంటోంది. విదేశీ నంబర్‌ల నుంచి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు తమను తాము పోలీస్ అధికారులమని పరిచయం చేసుకున్నారు. 'మీ కుమార్తె పెద్ద నేరం చేసి పట్టుబడిందని, ఆమెకు సహకరించిన మరో వ్యక్తినీ అదుపులోకి తీసుకున్నామని' చెప్పారు. మీ కుమార్తె అరెస్ట్ కాకుండా ఉండాలంటే వెంటనే రూ.1.90 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డబ్బు చెల్లించకుండా ఆలస్యం చేస్తే అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. భయపడిన మహిళ వారు సూచించిన ఖాతాకు డబ్బు బదిలీ చేసింది. తర్వాత కుమార్తెకు ఫోన్ చేసిన ఆమె మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.



వైఎస్ షర్మిల అజ్ఞానంతో మోదీ, చంద్రబాబుపై విమర్శలు: చిన్నయ్య దొర

బర్కత్‌పుర, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అజ్ఞానంతో మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు ప్రభుత్వాలపై విమర్శలు చేస్తున్నదని ఉమ్మడి ఏపీ మున్సిపల్ కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు బీజేపీ నేత గోరకపూడి చిన్నయ్యదొర ఆరోపించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వరదలపై మోదీ ప్రభుత్వం స్పందించడం లేదని షర్మిల చేసిన ఆరోపణలు విడ్డూరమన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఏపీలోని చంద్రబాబు ప్రభుత్వం వరద బాధితులకు పూర్తి సహాయక చర్యలు చేపట్టిందన్నారు. వాస్తవాన్ని విస్మరించి షర్మిల రాజకీయాలతో ముడిపెడుతుందని ధ్వజమెత్తారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ వారికి ఏం సహాయం చేస్తుందో చెప్పకుండా రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు.









ఉత్సవాలకు రండి



బాలాపూర్ గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు విచ్చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు.
-పహాడీషరీఫ్, ఆంధ్రజ్యోతి

జేఎన్‌జేతోపాటు మిగతా జర్నలిస్టులకూ ఇళ్ల స్థలాలు ఇవ్వండి

● సీఎంకు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలోని (జేఎన్‌జే) జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ తెలిపింది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం చొరవ తీసుకొని, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించడంతోపాటు, ఈనెల 8న జర్నలిస్టుల సమ్మేళనం నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపింది. అయితే జేఎన్‌జేతో పాటు మిగిలిన జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలకు, సొసైటీల్లో లేని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలను అందించేందుకు అవసరమైన కొత్త విధానాన్ని సీఎం ప్రకటించాలని కోరుతూ కమిటీ శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది.

'గ్రేటర్' సొసైటీకి కూడా..

చిక్కడపల్లి, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో సానుకూలంగా ఉన్నందుకు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. ఇదే సమయంలో తమ సొసైటీకి కూడా ఇళ్ల స్థలాల ప్రకటన చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం త్యాగరాయగానసభలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డిని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సమావేశం ఆమోదించింది.



యాత్ర బృందంతో మేజర్ జనరల్ రాకేశ్ మనోచా

నగరానికి చేరిన టెరిటోరియల్ ఆర్మీ సైకిల్ యాత్ర

అల్వాల్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): టెరిటోరియల్ ఆర్మీ 75వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 30న లడఖ్‌లోని సియాచిన్ బేస్ క్యాంపు నుంచి ప్రారంభమైన సైక్లింగ్, సెయిలింగ్, స్కూబా డైయింగ్ యాత్ర శుక్రవారం సికింద్రాబాద్ చేరుకుంది. తెలంగాణ, ఆంధ్రా సబ్‌ఏరియా మేజర్ జనరల్ రాకేశ్ మనోచా, ఇతర సీనియర్ ఆర్మీ అధికారులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం సికింద్రాబాద్ నుంచి చెన్నై వరకు యాత్రను ప్రారంభించారు. యాత్రలో భాగంగా సభ్యులు దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలు, మాజీ సైనికుల కుటుంబాలను కలుస్తారు.

'ప్రజావాణి'కి 570 దరఖాస్తులు

బేగంపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 570 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి దివ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎస్సీ వెల్ఫేర్ 77, రెవెన్యూ 57, పంచాయతీ రాజ్ 47, విద్యుత్‌శాఖ 28, ఇతర శాఖలకు 93 దరఖాస్తులు వచ్చాయి. కాగా, ఈనెల 10న జరగాల్సిన 'ప్రజావాణి'ని 11న నిర్వహిస్తున్నట్టు నోడల్ అధికారి తెలిపారు. అర్జీదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయండి

● టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో సిబ్బంది, అధికారులు ఏదైనా పనిచేసేందుకు లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూకీ తెలిపారు. అవినీతిపై ఫిర్యాదులు స్వీకరించేందుకు 040-23454884, 7680901912 ప్రత్యేక ఫోన్ నంబర్లు అందుబాటులోకి తెచ్చామని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కొంతమంది సిబ్బంది, అధికారుల అవినీతి వల్ల సంస్థకు చెడ్డపేరు వస్తోందన్నారు. వినియోగదారులకు ఇబ్బంది కలిగించినా, విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించే సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎండీ హెచ్చరించారు.

విత్తన రంగంలో మేధో సంపత్తి హక్కులు అమలు చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): విత్తన రంగంలో మేధో సంపత్తి హక్కులను అమలు చేయాల్సిన అవశ్యకత ఉన్నదని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐకార్) మాజీ డీజీ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీల సహకారంతో ఫెడరేషన్ ఆఫ్ సీడ్స్ ఇండస్ట్రీ(ఎఫ్ఎస్ఐఐ) నిర్వహించిన 'విత్తనాల్లో ఐపీఆర్ అమలు' సదస్సులో ఆయన మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న లింబాద్రి

ప్రైవేట్ టీచర్, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషి

● ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి

రాంనగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి హామీఇచ్చారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యారంగాభివృద్ధిలో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఫెడరేషన్ కన్వీనర్ విజయ్‌కుమార్, బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లోని టీచింగ్ ఫ్యాకల్టీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయాలని, వెల్ఫేర్ బోర్డుతోపాటు గుర్తింపు కార్డులు, బీమా సౌకర్యం, ఈఎస్ఐ, పీఎఫ్ తదితరవి అమలు చేయాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలోని ప్రభుత్వ సిటీ కళాశాలలో తాత్కాలిక గెస్ట్ లెక్చరర్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బాలభాస్కర్ తెలిపారు. ఇంగ్లీషు, కామర్స్, కామర్స్ ఫైనాన్స్, కామర్స్(టాక్సేషన్), బీబీఏ, బీబీఏ(రిటైల్), బీబీఏ(టూరిజం మేనేజ్‌మెంట్) బీసీఏ, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్ కంప్యూటర్ సైన్స్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), గణితం, స్టాటిస్టిక్స్, బయోటెక్నాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బాటనీ సబ్జెక్టులు బోధించాలని, అర్హులైన వారు ఈనెల 10న ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 9440136451 ను సంప్రదించాలన్నారు.

ఏఐ స్టాళ్లు అదరహో!

● వివిధ రంగాల ప్రగతిలో కృత్రిమ మేధ ముద్ర
● సందర్శకులను అబ్బురపర్చిన పరికరాల పనితీరు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ హెచ్ఐసీసీలో జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సదస్సులో ఆరోగ్య, రక్షణ, వ్యాపారాభివృద్ధి కోసం కృత్రిమ మేధతో పనిచేసే పరికరాల స్టాల్స్‌ను ప్రదర్శించారు. వీటి పనితీరు పలువురిని ఆకర్షించింది. అందులో కొన్ని...

ఉద్యోగుల హాజరుకు స్ప్రైపల్ హెచ్ఆర్

ఫీల్డ్‌లో పనిచేసే ఉద్యోగుల హాజరు సమస్యను పరిష్కరించేందుకు ఏఐ స్టార్టప్ స్ప్రైపల్ హెచ్ఆర్, సీఆర్ఎం పేర్లతో అప్లికేషన్లను అందుబాటులోకి తెచ్చింది. ఉద్యోగుల ఫేస్ స్కాన్ చేయడంతోపాటు వారు ఎంత సమయం ఆఫీసులో గడిపారు అనే అంశాన్ని కూడా నమోదు చేస్తోంది. ఫీల్డ్‌లో పనిచేసే వారి కోసం సీఆర్ఎం వినియోగించడం ద్వారా ఉద్యోగుల లోకేషన్‌లు నిరంతరం ట్రాక్ చేసే అవకాశం ఉంటుంది. ఈ డాటా ఆధారంగా ఉద్యోగుల జీతభత్యాలను పక్కాగా గణించడం కూడా చేయవచ్చు.


పూర్తి సంరక్షణ అందించే పుష్పక్ ఏఐ

సంస్థలు, కార్యాలయాలు, ఫ్యాక్టరీలు, ఇళ్లలో సంపూర్ణ సంరక్షణను అందించే చిన్నపాటి పరికరమిది. కార్యాలయాల్లో, ఫ్యాక్టరీలో దీనిని అమర్చుకుని సీసీ కెమెరాలకు అనుసంధానం చేయడం ద్వారా ఆయా ప్రదేశాల్లో పనిచేస్తున్న వారి వివరాలు, ప్రమాదాలు, చోరీ ప్రయత్నం, ప్యాకింగ్, వస్తువులను ఇటే లెక్కిస్తుంది. అంతేకాదు కొత్తవారిని గుర్తించడం, బార్ కోడ్ స్కానింగ్‌తోపాటు అనేక పనుల్లో సహకారం అందిస్తోంది. ఏదైనా పొరపాటు జరిగినా, కొత్తవారు అక్రమంగా ప్రవేశించినా, చోరీ జరిగినా వెంటనే సంబంధిత ఫోన్‌కు అలర్ట్‌లను పంపుతుంది. ఇంటర్నెట్, క్లౌడ్ అవసరం లేకుండా పనిచేయడం వల్ల సమాచారం, వీడియోలు, ఆడియోలు బయటకు వెళ్లే ఆస్కారం లేదని పుష్పక్ ఏఐ తయారీదారులు హామీ ఇస్తున్నారు.


హెచ్ఆర్‌ల కోసం ప్రైమ్ హైర్

సంస్థల్లో కీలకంగా ఉన్న హెచ్ఆర్‌ల కోసం ప్రైమ్ హైర్ సంస్థ ఏఐ బాట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆయా సంస్థలకు అవసరమైన మానవ వనరులను గుర్తించేందుకు ఏఐ బాట్ సహకరిస్తోంది. లక్షలాది రెజ్యూమ్‌లలో, తగిన వారిని గుర్తించడంతోపాటు, ఉద్యోగానికి తగిన టెక్నాలజీ, అనుభవం, అర్హత వంటి అంశాలను బేరీజు వేసి సమాచారాన్ని అందిస్తోంది. ఉద్యోగానికి అభ్యర్థి ఎంతవరకు సరిపోతాడనే విషయాన్ని కచ్చితంగా లెక్కచేసి చూపుతుంది.

ఆరోగ్య సమాచారాన్ని చూపే రింగ్



మన దైనందిన కార్యక్రమాలను నమోదు చేసి, సమాచారాన్ని విశ్లేషించే చిన్నపాటి ఉంగరాన్ని (రింగ్) ఓ స్మార్ట్ సంస్థ అభివృద్ధి చేసింది. హృదయ స్పందన, బ్లడ్ ఆక్సిజన్ లెవల్స్, స్ట్రెస్ మానిటర్, ఫిట్‌నెస్, హృదయ స్పందనలో తేడాలు, మహిళల్లో నెలసరి సమస్యలు, నిద్ర సమయం ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుంది. ఏదైనా ఆపద వాటిల్లే అవకాశం ఉంటే వెంటనే అలర్ట్ చేస్తుంది.



రైతుల కోసం ఏఐ ట్రాక్టర్

మెట్ట పంటల కోసం కృత్రిమ మేధతో పనిచేసే చిన్నపాటి ట్రాక్టర్‌ను ఐఐటీ, ఐఎస్‌బీ, ఇక్రిశాట్ సహకారంతో ఎక్స్ మెషీన్స్ సంస్థ అభివృద్ధి చేసింది. మొక్కలకు ఎటువంటి హాని జరగకుండా చిన్న సైజులో ఉండే ట్రాక్టర్ ద్వారా దుక్కి దున్నడం, విత్తనాలు నాటడం, పురుగుమందుల పిచికారి, కలుపుతీయడం వంటి పనులు సునాయాసంగా చేయవచ్చు. మూడు వేరియంట్లలో అందుబాటులో ఉన్న బుల్లి ఏఐ ట్రాక్టర్ రైతులకు దన్నుగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తయారీ దారులు చెబుతున్నారు.

రూ.2వేల కోట్లతో అధునాతన ఉస్మానియా ఆస్పత్రి

● రెండు నెలల్లో పనులకు శంకుస్థాపన
● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
● కోఠి మెడికల్ కళాశాలలో వసతి భవనాలకు భూమిపూజ



వసతి భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): చరిత్రలో నిలిచిపోయేలా ప్రభుత్వం రూ.2వేల కోట్లతో 31 ఎకరాల స్థలంలో గోషామహల్‌లో అధునాతన ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మరో రెండు నెలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం కోఠిలోని మెడికల్ కళాశాల ఆవరణలో వైద్య విద్యార్థుల కోసం నూతనంగా నిర్మించనున్న వసతి భవనాల అభివృద్ధి పనులకు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, వైద్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూలతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రూ.121 కోట్లతో ఈ హాస్టల్ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రోజురోజుకు పుట్టుకొస్తున్న కొత్త రోగాలు, కిడ్నీ సంబంధిత, గుండె సంబంధిత, డయాలసిస్, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. చిన్న వయస్సులో వస్తున్న రోగాలపై అవగాహన కల్పించి పరిష్కరించే విధంగా జూనియర్ వైద్యులు పని చేయాలన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ వైద్యులకు మెరుగైన సదుపాయాలు ఉండాలనే మంచి ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి వైద్య వృత్తికి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ బోర్కాడే, చీఫ్ ఇంజనీర్ పి.దేవేందర్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.నాయుడు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.వాణి, సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్‌రెడ్డి, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.నరేంద్ర కుమార్, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైశ్వాల్ తదితరులు పాల్గొన్నారు.



నయాబ్ తొలి ఎడిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించాలి

● పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపమైన ప్రాచీన హస్తకళలను ఆదరించి హస్త కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హోటల్ తాజ్‌కృష్ణాలో యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఫ్లో) ఆధ్వర్యంలో హ్యాండీక్రాఫ్ట్ స్టార్టప్ క్రాఫ్ట్ మాస్ట్రోస్ నిర్వహిస్తున్న నయాబ్ తొలి ఎడిషన్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. సంప్రదాయ కళలు, హస్తకళల నైపుణ్య పరంగా తెలంగాణకు విశిష్ట స్థానం ఉన్నదని గుర్తుచేశారు. పద్మవిభూషణ్, పద్మశ్రీ, శిల్పగురు వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాల గ్రహీతలతో సహా దేశంలోని ప్రఖ్యాత కళాకారుల నైపుణ్యంతో రూపొందించిన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు.

వుయ్ ఓన్ ఇన్‌ఫ్రా గ్రూప్ భారీ మోసం

● అధిక వడ్డీ ఆశచూపి వందమందికి కుచ్చుటోపీ

హైదర్‌నగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వుయ్‌ఓన్ ఇన్‌ఫ్రా గ్రూప్ రియల్ ఎస్టేట్ సంస్థ భారీ మోసానికి పాల్పడింది. కూకట్‌పల్లి సర్దార్ పటేల్‌నగర్‌లో ఈ సంస్థను ఏర్పాటు చేసిన ఎండీ సురేశ్‌కుమార్ ఈ మోసానికి పాల్పడినట్టు బాధితులు ఆరోపించారు. బాధితుల వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం నర్సాపూర్‌లో తనకు 30 ఎకరాల్లో వెంచర్ ఉన్నదంటూ సురేశ్ 120 గజాలకు రూ.5 లక్షలు చొప్పున స్థలాన్ని విక్రయించాడు. రిజిస్ట్రేషన్ చేసి 25 నెలల్లో అధిక వడ్డీతో పాటు అసలు చెల్లించి తిరిగి భూమిని వెనక్కి తీసుకుంటానని నమ్మించి పలువురి నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశాడు. కొంతకాలంగా సురేశ్ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పలువురు శుక్రవారం కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా, రియల్ ఎస్టేట్ సంస్థ మోసంపై ఫిర్యాదు అందిందని, దీని విలువ రూ.10కోట్ల వరకు ఉండటంతో కేసును ఈవోడబ్ల్యు విభాగానికి బదిలీ చేస్తున్నట్టు తెలిపారు.

ద.మ.రైల్వే ఉద్యోగుల కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు రూ.15 కోట్ల వరద సాయం

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో నివాసముండే దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులకు వరద సాయం అందిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు స్వామి తెలిపారు. సాయం కోసం దరఖాస్తు చేసుకున్న 5 వేల మందికి రూ.30 వేల చొప్పున రూ.15 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్టు పేర్కొన్నారు. విజయవాడ, రాయనపాడు, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ ప్రాంతాల్లోని తమ సొసైటీ సభ్యులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు.

రైతు ఆత్మహత్య బాధాకరం

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో సురేందర్‌రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ వైఫల్యాన్ని ఒప్పుకోవాలని, ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని శుక్రవారం 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు. అలాగే, సిరిసిల్ల చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ మరణవార్త తీవ్ర బాధ కలిగించిందని, సాహిత్య రంగంలో ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈనెల 9న ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘననివాళి ప్రకటించారు.

ముఠాలుగా ఏర్పడి గంజాయి విక్రయం

● ఎక్సైజ్ పోలీసుల దాడులు
● 29 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్ట్ చేసిన నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులో ముగ్గురు మహిళల మధ్య ఏర్పడిన స్నేహం ధూల్‌పేటలో గంజాయి హోల్‌సేల్ వ్యాపారానికి తెర తీసింది. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, ధూల్‌పేట ఎక్సైజ్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి వారిని అరెస్ట్ చేయడంతోపాటు 29 కిలోల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా కాలికట్‌కు చెందిన గంజాయి స్మగ్లర్ సంగీత సాహో రెండేళ్ల కిందట గంజాయి తరలిస్తుండగా పోలీసులకు పట్టుకొని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ధూల్‌పేటలో గంజాయి అమ్ముతూ అరెస్టయి ఇదే జైలులో ఉన్న శీలాబాయి, నేహాబాయిలతో సంగీతకు స్నేహం ఏర్పడింది. వీరు బయటకొచ్చిన తర్వాత సంగీత కిలో గంజాయి రూ.5 వేల చొప్పున శీలాబాయి, నేహాబాయిలకు విక్రయించగా.. వారు ధూల్‌పేట, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లో గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకొని విక్రయిస్తున్నారు. కొంతకాలలంగా వీరి కదలికలపై నిఘా ఉంచిన ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చిన సంగీత సోదరి సాంటా పరిదా, విశాల్ సింగ్, గోపాల్‌సింగ్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి 29 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు.

భగీరథ చెరువు, రంగ్‌లాల్ కుంటల పరిశీలన

● శిఖం భూమిలో నిర్మాణాలను కూల్చివేస్తాం
● హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



భగీరథ చెరువు ఆక్రమణలపై హైడ్రా కమిషనర్‌కు వివరిస్తున్న కాలనీవాసులు

రాయదుర్గం, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలతో కుంచించుకపోతున్న ఖాజాగూడ భగీరథ చెరువు, నానక్‌రామ్‌గూడలోని రంగ్‌లాల్ కుంటలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. చెరువు విస్తీర్ణం, కాల్వల మార్గం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏడాది పొడవునా చెరువు నీటితో ఉంటుందని, కొందరు ఉద్దేశపూర్వకంగా తూములు తెరిచి నీళ్ల నిల్వ లేకుండా చేశారని పలు కాలనీల వారు కమిషనర్‌కు వివరించారు. చెరువు శిఖంలో నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చి వేస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు. అయితే, కమిషనర్‌ను అధికారులు తప్పుదోవ పట్టించారు. పలు వివరాలు దాచిపెట్టడంతోపాటు కబ్జాల వైపు ఆయన వెళ్లకుండా ముందే పక్కాగా రూట్‌మ్యాప్ నిర్ణయించినట్టు తెలిసింది.

ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామని వంచన

● మద్యం దుకాణం, ప్రభుత్వ పథకాల కాంట్రాక్టులు కూడా.. ● లక్షలు గుంజుతున్న ఘరానా ముఠా ● ముగ్గురి అరెస్టు.. నగదు,నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, మద్యం దుకాణాలు, ప్రభుత్వ కాంట్రాక్టులు ఇప్పిస్తామని విపరీతంగా ప్రచారం చేసుకొని డబ్బులు దండుకొని నకిలీ నియామక పత్రాలిచ్చిన ముగ్గురు సభ్యుల ముఠాను రాచకొండ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4 లక్షల నగదు, 3 ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్, మూడు ఫోన్లు, నకిలీ నియామక పత్రాలు, ఐడీ కార్డులు, రబ్బర్ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో కమిషనర్ సుధీర్‌బాబు దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఎల్బీనగర్‌కు చెందిన షేక్ బడేసాహెబ్ అలియాస్ షేక్‌మున్నా, దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ముత్తోజు లక్ష్మణ్‌చారి, కొత్తపేటకు చెందిన మడక రామస్వామి స్నేహితులు. సూర్యాపేట జిల్లా చిలుకూరుకు చెందిన బడేసాబ్ 2017లో నగరానికి వచ్చి దిల్‌సుఖ్‌నగర్‌లోని ప్లెక్సీ సొల్యూషన్స్‌లో కొంతకాలం ఉద్యోగం చేశాడు. ఆ సమయంలో తనకున్న పరిచయాలతో కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఓ యువకుడిని మోసం చేసి జైలుకు వెళ్లాడు. బయటకొచ్చిన తర్వాత స్నేహితులతో కలిసి 2021లో ఒక కన్సల్టెన్సీని ప్రారంభించాడు. వారికి జిల్లా కోర్టు, హైకోర్టుకు చెందిన డాక్యుమెంట్స్‌తోపాటు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన ధ్రువపత్రాలు స్కానింగ్ చేసే సబ్ కాంట్రాక్టు లభించింది. అలా విడతల వారీగా కన్సల్టెన్సీ స్థాయిని పెంచారు. అలా పరిచయాలు పెంచుకున్న బడేసాబ్.. ఐటీ, నాన్ ఐటీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని ప్రచారం చేసుకున్నాడు. తన స్నేహితులనే ఏజెంట్లుగా చేసుకొని రూ.లక్షల్లో దండుకొని వారికి కమీషన్లు ఇచ్చేవాడు.

ఉద్యోగాలంటూ రూ.28 లక్షలు

మహబూబాబాద్‌కు చెందిన రామచందర్, బాచుపల్లికి చెందిన సమ్మయ్యలు ఘట్‌కేసర్ మండలం పోచారంలో ఉంటున్న స్నేహితుడు కాసారపు తిరుపతి ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల విషయమై చర్చ జరిగింది. అదే సమయంలో ముఠాలోని నిందితుడైన మడక రామస్వామితో తిరుపతికి పరిచయం ఉంది. స్టేట్/సెంట్రల్ ఏ ఉద్యోగమైనా ఇప్పిస్తానని చెప్పిన విషయం గుర్తొచ్చి వారిని రామస్వామికి పరిచయం చేసి, ఎలాగైనా వారి పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించాలని కోరాడు. అందుకు సరే అన్న రామస్వామి.. తన ముఠాలోని ఇతర ప్రధాన నిందితులైన బడేసాబ్, లక్ష్మణ్‌లకు చెప్పాడు. ఇదే అవకాశంగా భావించిన ముఠా.. రామచందర్, సమ్మయ్య పిల్లలకు మంచి సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించారు. వారి స్థాయిని బట్టి రామచందర్ వద్ద రూ.12 లక్షలు, సమ్మయ్య వద్ద రూ.16 లక్షలు తీసుకున్నారు. ఆ తర్వాత నకిలీ ఐడీకార్డులు, అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అవన్నీ నకిలీవని తేలడంతో వారు తన స్నేహితుడు తిరుపతి ద్వారా మోసగించిన ముఠాను సంప్రదించగా.. డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని కాలం దాటవేసి తప్పించుకు తిరుగుతున్నారు. విసిగిపోయిన బాధితుడు పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం సీపీ సుధీర్‌బాబు దృష్టికి వెళ్లడంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ టీమ్‌ను రంగంలోకి దింపారు. రెక్కీ చేసిన పోలీసులు మాటు వేసి నిందితుల ముఠాను పట్టుకొని అరెస్టు చేశారు.



నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

విచారణలో విస్తుపోయే విషయాలు

వారిని విచారించిన క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రజాపాలనకు సంబంధించిన గృహజ్యోతి, గృహలక్ష్మి పథకానికి సంబంధించిన కాంట్రాక్టులు ఇప్పిస్తానని కోదాడకు చెందిన శంకర్ వద్ద రూ.33 లక్షలు, మద్యం దుకాణం ఇప్పిస్తానని సూర్యాపేటకు చెందిన భూక్యా రవీంద్రనాయక్ వద్ద రూ.10 లక్షలు తీసుకున్నట్టు తేలింది. నకిలీ ఐడీ కార్డులు, నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు తయారు చేయడానికి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఆకాశ్, బెంగళూరుకు చెందిన మహ్మద్ మాలిక్‌లను సంప్రదించేవాడని పోలీసులు గుర్తించారు. వారిని విచారిస్తే మరిన్ని అక్రమాలు, మోసాలు వెలుగులోకి వస్తాయని సీపీ తెలిపారు.




హీరోగా ఎంట్రీ

టాలీవుడ్ అగ్రకథానాయకుడు, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అభిమానులకు శుభవార్త. ఆయన తనయుడు మోక్షజ్ఞ సినీ అరంగేట్రం ఖరారైంది. శుక్రవారం మోక్షజ్ఞ పుట్టిన రోజు సందర్భంగా ఈ విషయాన్ని ప్రకటించారు. 'హనుమాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో సత్తా చాటిన ప్రశాంత్‌వర్మ దర్శకత్వం వహిస్తున్నాడు. బాలకృష్ణ తనయ ఎం తేజస్విని నందమూరి సమర్పణలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మోక్షజ్ఞ స్టైలిష్ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'మోక్షజ్ఞను పరిచయం చేయడం గొప్ప గౌరవం. అలాగే పెద్ద బాధ్యత కూడా. బాలకృష్ణ గారు కథపై, నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు. మన ఇతిహాసాల నుంచి స్ఫూర్తి పొందిన కథతో తెరకెక్కిస్తున్నాం. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌ను మరో స్థాయికి తీసుకెళుతుంది' అన్నారు. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ 'మోక్షజ్ఞ సినిమాను లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ఆయన అరంగేట్రానికి సరిపోయే కథతో అద్భుతమైన స్క్రిప్ట్‌తో ప్రశాంత్ వర్మ ముందుకు వచ్చారు. మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తాం' అన్నారు. ప్రేక్షకులను అలరించేందుకు మోక్షజ్ఞ డాన్స్, ఫైట్స్‌లో కఠోర శిక్షణ పొందారు. జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ సోషల్‌మీడియా ద్వారా మోక్షజ్ఞకు అభినందనలు తెలిపారు.

'గేయ కిరీటి' వడ్డేపల్లి కృష్ణ ఇకలేరు

- లలితగీతాల రచయితగా ఖ్యాతి
- సినిమా పాటలతోనూ పేరు
- ఉమ్మడి ఏపీ సెన్సార్ బోర్డు సభ్యుడిగా, నంది అవార్డు కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు
- ఆదివారం అంత్యక్రియలు

ప్రముఖ లలితగీతాల రచయిత, సినిమా పాటల కవి, 'గేయ కిరీటి' బిరుదాంకితుడు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ (76) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. వడ్డేపల్లి కృష్ణ స్వస్థలం సిరిసిల్ల. వెయ్యికి పైగా గేయాలు రాసిన వడ్డేపల్లిని వేములవాడ రాజరాజేశ్వరి ఆలయ నిర్వాహకులు 'గేయ కిరీటి' బిరుదుతో సత్కరించారు. నిరుపేద చేనేత కుటుంబంలో పుట్టిన ఆయన సినారె స్ఫూర్తితో విద్యార్థి దశలోనే గేయ రచన ప్రారంభించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ నుంచి 'లలిత గీతాల' మీద ఆయన చేసిన పీహెచ్‌డీ పరిశోధన అత్యంత ప్రామాణికమైనదిగా విమర్శకులు చెబుతారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన "పిల్ల జమీందార్" సినిమాలో 'నీచూపులోన విరజాజివాన...' పాటతో సినీగేయ రచయితగా ఆయన ప్రస్థానం ప్రారంభించారు. "పెద్దరికం" సినిమాలో 'ముద్దుల జానకి పెళ్లికి మబ్బుల పల్లకి తేవలెనే', "భైరవద్వీపం" - 'అంబా శాంభవి...', "పిలిస్తే పలుకుతా" - 'సమతా మమతల సాకారం... పిలిచిన పలికే ఓంకారం' తదితర గీతాలు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. వడ్డేపల్లి కలం నుంచి జాలువారిన దేశ భక్తి గీతాలెన్నో ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి. మరికొన్ని 60 ఆడియో ఆల్బమ్స్‌గానూ వచ్చాయి. ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటాన్ని కళ్ళకు కట్టే 'జయజయహే తెలంగాణ', 'ఆమ్రపాలి', 'రమణీయ రామప్ప' తదితర నలభైకు పైగా సంగీత, నృత్యరూపకాలను రచించారు.



'బలగం' సినిమా నటుడిగా...

వడ్డేపల్లి రాసిన గేయం పూణె బాలభారతి తెలుగు వాచకాల్లో పాఠ్యాంశంగా చేర్చారు. సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు, బతుకమ్మ, గోభాగ్యం తదితర అంశాలపై డాక్యుమెంటరీలు రూపొందించారు. 'లావణ్య విత్ లవ్ బాయ్స్', 'ఎక్కడికెళ్తుందో మనసు' సినిమాలకు, 'భక్త పోతన' వంటి టెలివిజన్ ధారావాహికలకు దర్శకత్వం వహించారు. 'బలగం' సినిమాలో నటించారు. తెలుగు సినీ రచయితల సంఘం త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా వారం కిందట వడ్డేపల్లి కృష్ణను జీవిత సాఫల్య పురస్కారంతో సన్మానించారు. ఉమ్మడి ఏపీలో నంది అవార్డుల కమిటీ చైర్మన్‌గా, సెన్సార్ బోర్డు సభ్యుడిగా, అంతర్జాతీయ బాలల చిత్రోత్సవం, బాలల నంది నాటక పోటీలకు న్యాయనిర్ణేతగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఆదివారం మధ్యాహ్నం వడ్డేపల్లి కృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన అల్లుడు పత్తిపాక ఈశ్వర్ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా



'హుషారు' చిత్రంతో అందరినీ అలరించిన నటుడు తేజస్ కంచర్ల నటించిన తాజా చిత్రం 'ఉరుకు పటేలా' శనివారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా తేజస్ మీడియాతో మాట్లాడుతూ "హుషారు' తర్వాత చాలా కథలు విన్నాను. ఏదైనా కొత్త ఉంటే సినిమా చేద్దామనుకుంటున్న నాకు దర్శకుడు వివేక్ చెప్పిన పాయింట్ బాగా నచ్చింది. ఆ తర్వాత ఇద్దరం కలిసి కథ తయారు చేశాం. స్క్రిప్ట్ బాగా వచ్చింది. చాలా మంది నిర్మాతలను కలసి కథ వినిపించాం. అందరూ బాగుందని అన్నారు కానీ నా మీద అంత బడ్జెట్ పెట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. చివరకు మా నాన్న (కంచర్ల బాలభాను) ఈ కథ విన్నారు. ఆయనకు నచ్చడంతో సినిమా తీయడానికి ముందుకు వచ్చారు" అని చెప్పారు. 'తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ కథ ఉంటుంది. అయినా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. లాక్ డౌన్‌లో మూఢ నమ్మకాల గురించి వార్తలు ఎక్కువగా చదివాను. అలాంటి కొన్ని సంఘటనల చుట్టూ కథ అల్లాను. థ్రిల్లర్, కామెడీ జానర్‌లో వినోదభరితంగా ఉంటుంది.' అని చెప్పారు తేజస్. దర్శకత్వం చేయాలనే కోరిక ఉందనీ, అలాగే పాత్ర నచ్చితే స్పెషల్ రోల్స్ కూడా చేస్తానని తెలిపారు.













రాఖీ, తిలకం, మెహిందీ వంటి వాటితో వచ్చే విద్యార్థులకు పనిష్‌మెంట్ వద్దు

» విద్యాశాఖ అధికారుల సర్క్యులర్ జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాఖీలు, తిలకం, మెహిందీ వంటి వాటితో స్కూళ్లకు వచ్చే విద్యార్థులకు పనిష్‌మెంట్ ఇవ్వకూడదని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి సర్క్యులర్‌ను జారీ చేశారు. ఇలాంటి వాటితో స్కూళ్లకు వచ్చే విద్యార్థులను కొందరు కార్పొరల్ పనిష్‌మెంట్ పేరిట వేధిస్తున్నట్టు మీడియాలో వార్తలు వస్తున్నాయని, అటువంటి చర్యలకు పాల్పడవద్దని ఆయన సూచించారు. ఒకవేళ ఇలాంటి ఘటనలు జరిగితే ఆర్‌టీఈ యాక్టు-2009 సెక్షన్ 17 ప్రకారం చర్యల్ని తీసుకోవాల్సి ఉంటుందని గుర్తుచేశారు.

వేగంగా రుణమాఫీ లబ్ధిదారుల కుటుంబ నిర్ధారణ

» ఇప్పటిదాకా 2.65 లక్షల మంది వివరాల సేకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో రుణమాఫీ పొందలేకపోయిన రైతుల వివరాల సేకరణ ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. బ్యాంకుల ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం.. రుణమాఫీ పథకాన్ని అమలు చేసే సమయానికి రాష్ట్రంలో పట్టాదారుపాసు పుస్తకాలు ఉండి, బ్యాంకులో రుణం తీసుకుని, రేషన్‌కార్డు లేనివారు 4.50లక్షల మంది ఉన్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో రుణ మాఫీ పొందలేకపోయిన వీరందరికీ కూడా రుణ మాఫీ అందజేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ క్రమంలోనే రేషన్‌కార్డు లేని లబ్ధిదారుల వద్దకు స్వయంగా వెళుతున్న వ్యవసాయ అధికారులు కుటుంబ నిర్ధారణ ప్రక్రియ చేస్తున్నారు. వివరాలన్నింటినీ ప్రభుత్వం సూచించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇలా ఇప్పటిదాకా 2.65లక్షల మందికి కుటుంబ నిర్ధారణ ప్రక్రియ పూర్తయినట్టు తెలిసింది. మొత్తం 4.50 లక్షల మంది వివరాలు ప్రభుత్వానికి చేరిన తర్వాత తొలి విడతలో రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నారు.

భక్తి శ్రద్ధలతో గణేశుడిని పూజించుకుందాం

» వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ మండపాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది గణేష్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. అడ్డంకులు తొలగించే గణేశుడు రాష్ట్రం, దేశ ఐక్యత, శాంతి, పురోగతి, శ్రేయస్సు మార్గంలో ఉన్న అన్ని అడ్డంకుల్ని తొలగించాలని ప్రార్థించారు. వినాయక చవితిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.


సీఎంకు చెక్కు అందజేస్తున్న అపోలో గ్రూప్ జేఎండీ సంగీతారెడ్డి

వరద బాధితులకు అపోలో సాయం

» ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం అపోలో ఆస్పత్రుల యాజమాన్యం తమ వంతు సాయంగా సీఎం సహాయనిధికి కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించింది. సంబంధిత చెక్కును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అపోలో గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి శుక్రవారం అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ... ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయని, ఎన్నో కుటుంబాలు, ఎంతో మంది నిరాశ్రయులయ్యారని వారి సహాయార్థం తమ వంతుగా ఈ విరాళం ఇచ్చామన్నారు. ఈ సవాళ్ల సమయంలో తెలంగాణ ప్రజలకు అండగా ఉంటామన్నారు.


సీఎం రేవంత్, భట్టిలకు చెక్కు అందజేస్తున్న జీఎంఆర్ ప్రతినిధులు

జీఎంఆర్ గ్రూప్ రూ.2.5 కోట్ల విరాళం

» సీఎంకు చెక్కు అందించిన ప్రతినిధులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకునేందుకు జీఎంఆర్ గ్రూపు రూ.2.5కోట్ల విరాళం ఇచ్చింది. వరద బాధితులకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఆర్థిక సాయం చేశామని జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణీకర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు రూ. 2.5 కోట్ల చెక్కును శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. జీఎంఆర్ సహాయం చేయడం అభినందనీయమని సీఎం పేర్కొన్నట్లు జీఎంఆర్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌కు ఒక్క రోజే రూ.9.50 కోట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాల వెల్లువ కొనసాగుతోంది. శుక్రవారం ఒక్కరోజే రూ.9.50కోట్లు సమకూరాయి. జీఎంఆర్ గ్రూపు రూ.2.50కోట్లు, కెమిలాయిడ్స్ కంపెనీ రూ.కోటి, శ్రీచైతన్య విద్యాసంస్థలు రూ.కోటి, విక్రోఫార్మా రూ.కోటి, అపోలో హాస్పిటల్స్ రూ.కోటి, ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ రూ.కోటి చొప్పున విరాళాలను ప్రకటించాయి. తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య కార్పొరేషన్ తరపున రూ.2కోట్ల చెక్కును సీఎంకు అందించారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్ ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇచ్చారు.


ఏపీలో వరద బాధితుల సహాయార్థం జాస్తి వెంకట్, సుధ కుటుంబం సీఎం సహాయ నిధికి రూ.5కోట్ల భారీ విరాళం ప్రకటించింది. ఆ చెక్కును శుక్రవారం సీఎం చంద్రబాబుకు అందజేశారు.

కాటూరి వైద్య కళాశాల విరాళం రూ.10కోట్లు

గుంటూరు జిల్లాలోని కాటూరి వైద్య కళాశాల, ఆసుపత్రి వ్యవస్థాపకులు కాటూరి సుబ్బారావు శుక్రవారం సీఎం చంద్రబాబును కలిశారు. వరద బాధితుల సహాయార్థం సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.10 కోట్ల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

కేంద్రం అండగా ఉంటుంది

వర్షం నష్టాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్తా.. రైతులు ధైర్యంగా ఉండాలి: కేంద్ర మంత్రి చౌహాన్

» మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో ఏరియల్ సర్వే



రైతు నర్సింహారావును ఓదారుస్తున్న కేంద్ర మంత్రి చౌహాన్, ఖమ్మం జిల్లా కూసుమంచిలో వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

ఖమ్మం (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/కూసుమంచి, సెప్టెంబరు6: "వర్షం, వరదల వల్ల ఖమ్మం జిల్లాలోని మధిర, ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో జరిగిన నష్టాన్ని ఏరియల్ సర్వే ద్వారా కళ్లారా చూశాను. నష్టం అపారంగా జరిగింది. కేంద్రం అన్ని విధాలా ఆదుకుంటుంది. రైతులెవరూ కన్నీళ్లు పెట్టుకోవద్దు. మళ్లీ పంటలు వేసుకుని సాగు చేసేందుకు ధైర్యంగా ఉండాలి. జరిగిన నష్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తాం. రైతులకు, వరద బాధితులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తాం" అని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భరోసా ఇచ్చారు. కేంద్రమంత్రులు చౌహాన్, బండి సంజయ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. శుక్రవారం హెలికాప్టర్ ద్వారా వరద నష్టాన్ని ఏరియల్ సర్వే ద్వారా తిలకించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నష్టం జరిగిన తీరును స్వయంగా చూపించారు. అనంతరం పాలేరులోని నవోదయ కళాశాలలో ఏర్పాటు చేసిన ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో జరిగిన పంటల నష్టం, వరదల బీభత్సంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రులు తిలకించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రైతుల ముఖాముఖి కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పంటల నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. బాధపడొద్దని, ధైర్యంగా ఉండాలని రైతులను ఓదార్చారు. కేంద్ర మంత్రి చౌహాన్ మాట్లాడుతూ.. జిల్లాలో వరి, మిర్చి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, వరద ఉధృతికి పంటలే కాక పశువులు, ఇళ్లు, సామాన్లు కోల్పోవడం బాధాకరమన్నారు. వేలాదిమంది రైతులు పెట్టుబడులతో పాటు పంటలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు కేంద్రం అండగా ఉంటుందని చెప్పారు. తాను రాజకీయాలు చేయడానికి రాలేదని, రైతుల కోసం వరద నష్టాన్ని చూసేందుకు వచ్చానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు వాడుకుంటేనే మళ్లీ కొత్త నిధులు వస్తాయని, వాటిని దారిమళ్లించవద్దన్నారు. గత ప్రభుత్వం ఎన్డీఆర్‌ఎఫ్ నిధులను సక్రమంగా వినియోగించుకోలేదని, ఇచ్చిన నిధులు పక్కదారి పట్టాయని, వాటికి యూసీలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఫసల్‌బీమా అమలు చేయలేదని, కేంద్రం తరఫున అమలు చేస్తామని చెప్పినా గత ప్రభుత్వం ఒప్పుకోలేదని చెప్పారు. ప్రస్తుతం వరదల నష్టపోయిన రైతులకు కావాల్సిన విత్తనాలను అందిస్తామని, జరిగిన నష్టంపై తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి పూర్తి నివేదిక అందించాలని సూచించారు. గత వందేళ్లలో ఎన్నడూ రాని వరద ఈ ప్రాంతంలో వచ్చిందని చెబుతున్నారని, వరద నష్టంపై కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా ఆదుకోనున్నట్లు ఆయన చెప్పారు.

అండగా ఉండాలి: తుమ్మల, పొంగులేటి

వరదల వల్ల పెద్ద నష్టమే జరిగిందని, అవసరమైన సహాయం కేంద్రం నుంచి అందించనున్నట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులు పెట్టిన పెట్టుబడులు, పంటలు కోల్పోవడంతో తీవ్రంగా నష్టం జరిగిందని, ఈ కష్టకాలంలో తెలుగు రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు మూడున్నర నుంచి 4 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. పత్తి, మిర్చి, వరి పంటలకు తీవ్రంగా దెబ్బతిన్నాయని, గ్రామాలు నీట మునిగాయని, చాలా మంది ఇళ్లతో పాటు.. సర్వం కోల్పోయారని కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు. అనంతరం కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు కూసుమంచి మండలం నాసుతండా వద్ద దెబ్బతిన్న వరిపొలాలను తిలకించారు. అక్కడ వేసిన ఇసుక మేటలను కూడా పరిశీలించారు.

కేంద్ర మంత్రి కాళ్లపై పడిన రైతు

ముఖాముఖిలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వద్ద రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ఖమ్మం జిల్లా భూక్యాతండాకు చెందిన హలావత్ నర్సింహారావు తన గోడును వెళ్లబోసుకున్నారు. 'నేను వేసిన పత్తి, మిర్చి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నాలుగు ఎకరాల పంట వరదకు నాశనమైంది. పెట్టిన పెట్టుబడి నేలపాలైంది. కోలుకోలేని దెబ్బ తిన్నాం. వ్యవసాయం చేయాలంటే చేతిలో చిల్లిగవ్వ లేదు. నష్టపోయిన రైతులను కేంద్రం ఆదుకోవాలి' అని కోరారు. కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ కాళ్లపై పడి కన్నీరు పెట్టుకున్నారు. దీంతో కేంద్ర మంత్రి చలించి ఆ రైతును అక్కున చేర్చుకుని ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మరోవైపు.. తొలుత పాలేరు రిజర్వాయర్ పక్కన రైతులతో ముఖాముఖి, ఫొటో ఎగ్జిబిషన్ వేదిక ఏర్పాటు చేశారు. ఆకస్మికంగా భారీవర్షం కురవడంతో టెంట్లు, ఫొటో ఎగ్జిబిషన్ బోర్డులు పడిపోగా.. నవోదయ పాఠశాలలోకి వేదికను మార్పు చేశారు.

వరద బాధిత జిల్లాలు 29

ఈ జిల్లాలకు రూ. 3కోట్ల చొప్పున సాయం

వర్షాల కారణంగా 29మంది మృతి: సీఎస్

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా 29 జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని, ఆ జిల్లాలను వరద బాధిత జిల్లాలుగా ప్రకటిస్తున్నట్లు సీఎస్ శాంతి కుమారి పేర్కొన్నారు. ఇటీవల నాలుగు జిల్లాలకు నిధులు విడుదల చేశామని, మిగిలిన 25 జిల్లాలకు రూ.3 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాల కలెక్టర్లతో శాంతి కుమారి శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు, వరదలపై సోమవారంలోగా సమగ్ర నివేదికను ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 3వ తేదీ మధ్య కురిసిన వర్షపాతం ఆధారంగా వరద బాధిత జిల్లాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. వర్షాల కారణంగా ఇప్పటిదాకా రాష్ట్రవ్యాప్తంగా 29 మంది మృతి చెందారని, ఎక్స్‌గ్రేషియా అందజేసేందుకు వివరాలు పంపాలని కలెక్టర్లకు సూచించారు.

నష్టం అంచనాలు పంపండి

కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం

వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం, మృతుల వివరాలపై 9వ తేదీగా నివేదిక పంపాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. పశువుల మరణాలపైనా నివేదిక కోరింది. ఈ మేరకు విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.

33% మేర దెబ్బతిన్న పంటలకు పరిహారం

భారీ వర్షాలు, వరద వల్ల నష్టపోయిన పంటలకు పరిహారాన్ని అందించేందుకు ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేసింది. 33శాతం మేర నష్టపోయిన పంటలకు పరిహారాన్ని అందజేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వ్యవసాయ డైరక్టర్ గోపి జారీ చేశారు. అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, 12వ తేదీలోగా వివరాలు అందజేయాలని సూచించారు. ఆ వివరాలను జిల్లా వ్యవసాయ అధికారులు నిర్ధారించాలని తెలిపారు. కలెక్టర్ల ఆమోదంతో అర్హులైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ప్రతిపాదనలను పంపాలని సూచించారు.

ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి

టన్నుకు కనీసం రూ.15 వేలు వచ్చేలా చూడండి

ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయండి.. శివరాజ్‌కు తుమ్మల విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ రైతులకు మంచి ధర వచ్చేలా చూడాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.15 వేల కనీస మద్దతు ధర కల్పించి రైతులకు భరోసా కల్పించాలని కోరారు. రాష్ట్రంలో వరద నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర మంత్రి శివరాజ్‌ను సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మంత్రి తుమ్మల కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడడంతోపాటు రాష్ట్రంలో ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డును భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రైబల్ వెల్ఫేర్ ఆర్గానిక్ ఫార్మింగ్‌ను అశ్వారావుపేటలో ఏర్పాటు చేయాలని తుమ్మల కోరారు. కనీస మద్దతు ధర లభించక ఆయిల్‌పామ్ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో టన్ను రూ.20 వేల వరకు ఉండగా ఇటీవల కాలంలో కస్టమ్ డ్యూటీని ఎత్తివేశారని తెలిపారు. దీంతో టన్ను రూ.12 వేలకే కొనుగోలు చేస్తున్నారని, ఫలితంగా రైతులకు గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. కనీస మద్దతు ధర 2024-25లో రూ.15వేలు ఉండేలా సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి.. త్వరలోనే మూడు అంశాలపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కృష్ణా ప్రాజెక్టులకు మళ్లీ పెరిగిన వరద

» 'సాగర్'కు 2,34,707 క్యూసెక్కులు.. ఇరవై గేట్ల నుంచి నీటి విడుదల

» గరిష్ఠ నీటిమట్టం దిశగా 'మూసీ'.. 'పులిచింతల' 4 గేట్లు ఎత్తివేత

» ఏడుపాయల్లో పోటెత్తిన మంజీర.. నవంబరు దాకా ప్రాజెక్టులకు వరదలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న వర్షాలకు మళ్లీ వరదలు ప్రారంభమయ్యాయి. దాంతో వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర, సుంకేశుల, శ్రీశైలం, నాగార్జునసాగర్.. ఇలా అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం అధికారులు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడం ప్రారంభించారు. వరద రాకకు అనుగుణంగా గేట్ల సంఖ్యను పెంచుతూ సాయంత్రానికి 20గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050) కాగా, శుక్రవారం సాయంత్రానికి 589.90 అడుగులతో (311.7412టీఎంసీలు) నిండుకుండలా ఉంది. 2,04,064 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇక.. వారం రోజులుగా వరద నీటితో పొంగిపొర్లిన మూసీ నది శుక్రవారం కొంత నెమ్మదించింది. 645 అడుగుల (4.46 టీఎంసీలు) గరిష్ఠ నీటిమట్టం కలిగిన మూసీ జలాశయం శుక్రవారం సాయంత్రానికి 642.65 అడుగులకు (3.86 టీఎంసీలు)చేరింది. అటు.. ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు నాలుగు గేట్లను మూడు మీటర్లమేర ఎత్తి 95,568 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు.. తుంగభద్ర ప్రాజెక్టు పూర్తిగా నిండింది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 2.75 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 2.44 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 78 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... ఔట్‌ఫ్లో 28వేలుగా ఉంది. ఇక..సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో వనదుర్గా ప్రాజెక్టు నుంచి మంజీర నది పరవళ్లు తొక్కుతోంది. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద శుక్రవారం వరద ప్రవాహం మరింత పెరిగి ఆలయం ముందు నుంచి పరుగులు పెడుతోంది.

18 జాతీయ రహదారుల అభివృద్ధిపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): పీఎం గతిశక్తిలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ చేపట్టనున్న 18 జాతీయ రహదారుల నిర్మాణంపై కేంద్రం దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి పీఎం గతిశక్తి.. నెట్‌వర్క్ ప్లానింగ్ గ్రూప్ 78వ సమావేశం ఢిల్లీలో శుక్రవారం జరిగింది. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య విభాగం అదనపు కార్యదర్శి రాజీవ్ సింగ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 18 హైవే ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ ప్రాజెక్టుల్లో ఒకటైన అహ్మద్ నగర్- సోలాపూర్ కారిడార్‌లో భాగంగా మహారాష్ట్ర- తెలంగాణ మధ్య నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణం జరగనుంది. ఆర్మూరు-జగిత్యాల-మంచిర్యాల మీదుగా 131.90 కిలోమీటర్ల మేర నిర్మించనున్న నాలుగు లేన్ల రహదారి జగిత్యాల-కరీంనగర్ హైవేతో అనుసంధానం కానుంది.

సాయం చేయండి


కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వరద తీవ్రతను వివరిస్తున్న రేవంత్

(1వ పేజీ తరువాయి)

సీఎం రేవంత్ శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో వాటిల్లిన వరద నష్టం తీవ్రతను సీఎం రేవంత్.. శివరాజ్‌కు వివరించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్, సూర్యాపేటతో పాటు పలు జిల్లాల్లో ఒకే రోజు అత్యధికంగా 40 సెంటీమీటర్ల మేర వర్షం కురిసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణ నష్టం తప్పిందన్నారు. కానీ, వరద నష్టం తీవ్రంగా ఉందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా కేంద్ర మంత్రులకు చూపించినట్లు సీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది.

తీవ్ర నష్టం

రాష్ట్రంలో అంచనాలకు మించి వర్షం కురవడంతో ప్రధాన రహదారులతో పాటు రోడ్లు, వంతెనలు, ఇళ్లు చాలాచోట్ల పూర్తిగా దెబ్బతిన్నాయని, రాకపోకలు స్తంభించాయని సీఎం రేవంత్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో వరద ప్రవాహానికి రైల్వే ట్రాక్ కింద మట్టి కొట్టుకుపోయిన విషయాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వరద ప్రభావిత జిల్లాల్లోని గ్రామాల్లో బాధిత కుటుంబాలు కోలుకోలేని విధంగా నష్టపోయాయని తెలిపారు. తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున వరద బాధిత కుటుంబాలకు రూ.10 వేలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. దెబ్బతిన్న చెరువులు, కుంటలు, రోడ్లు, వంతెనల తాత్కాలిక మరమ్మతులకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. శాశ్వత పునరుద్ధరణ పనులకు కూడా తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు.

నిబంధనలు సడలించండి..

కేంద్రం నుంచి విపత్తు నిధులను రాష్ట్రాలకు విడుదల చేసే విషయంలో ఇప్పుడు అమల్లో ఉన్న నిబంధనలను సడలించాలని సీఎం రేవంత్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్డీఆర్‌ఎఫ్ నిధుల్లో 50 శాతం ఉపయోగిస్తే.. ఎన్డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్) నిధులు వాడుకునేలా గతంలో రాష్ట్రాలకు వెసులుబాటు ఉండేదన్నారు. ఇప్పుడు వంద శాతం ఎస్డీఆర్‌ఎఫ్ నిధులు రాష్ట్రాలు వినియోగిస్తేనే, శాశ్వత మరమ్మతు పనులకు ఎన్డీఆర్‌ఎఫ్ నిధులు వాడుకోవాలనే నిబంధన విధించారని తెలిపారు. ఈ నిబంధనను సడలించి, గతంలో మాదిరిగానే ఉంచాలని కోరారు. అదేవిధంగా వరద బాధిత ప్రాంతాల్లో తక్షణ మరమ్మతులకు, శాశ్వత పునరుద్ధరణ పనులకు అంశాల వారీగా నిర్దేశించిన యూనిట్ రేట్లను పెంచాలని విజ్ఞప్తి చేశారు. వరదలతో దెబ్బతిన్న చెరువులు, కుంటల తక్షణ మరమ్మతులకు రూ.60కోట్లు అవసరమవుతాయని, కానీ ఇప్పుడున్న నిర్దేశిత రేట్ల ప్రకారం రూ.4కోట్లు కూడా విడుదల చేసే పరిస్థితి లేదని అధికారులు వివరించారు.

ఏపీకి ఇచ్చినట్లులాగే మాకూ ఇవ్వండి

సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టంపైనా చర్చకు వచ్చింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎక్కువగా వరద నష్టం సంభవించిన ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలు ఆంధ్రప్రదేశ్‌కు సమీపంలోనే ఉన్నాయని, అందుకే ఏపీకి అందించినట్లుగానే తెలంగాణకూ సాయం చేయాలని సీఎం రేవంత్ కేంద్ర మంత్రిని కోరారు. స్పందించిన కేంద్రమంత్రి శివరాజ్.. విపత్తులు సంభవించినప్పుడు, ఆపదలో ఉన్న ప్రజలకు సాయం చేసే విషయంలో పార్టీలు, రాజకీయాలకు తావు లేదని స్పష్టం చేశారు. ఈ విషయంలో కలిసికట్టుగా బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సి ఉంటుందన్నారు. వరదలతో వాటిల్లిన నష్టం, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను తెలిపేలా సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని సీఎం, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు తిలకించారు.

ఒకే వేదికపై రేవంత్, సంజయ్

కేంద్రమంత్రి చౌహాన్‌తో నిర్వహించిన సమావేశంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. రాజకీయంగా నిత్యం మాటల తూటాలతో ఒకరిపై ఒకరు విరుచుకుపడే రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ ఒకే వేదికపై కూర్చున్నారు. కేంద్ర సహాయ మంత్రిగా అధికారిక హోదాలో సంజయ్ సచివాలయానికి రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

రాజధానిలో భారీ వర్షం

రోడ్లపై మోకాలు వరకు నీరు.. కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్

» సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు

» ఆరెంజ్ అలర్ట్ జారీ

హైదరాబాద్ సిటీ, ఖమ్మం, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం.. ఉద్యోగులు ఆఫీసు పని ముగించుకుని ఇళ్లకు బయల్దేరే సమయంలో భారీ వర్షం కురిసింది. శనివారం వినాయకచవితి కావడంతో పూలు, పత్రి వంటివి కొనుగోలు చేయడానికి అప్పటికే ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు. అలాంటి సమయంలో వాన దంచికొట్టి.. రోడ్లపై మోకాటిలోతు నీరు నిలవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. గచ్చిబౌలిలో అత్యధికంగా 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. రామచంద్రాపురంలో 3.9 సెం.మీ వర్షం కురిసింది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే శుక్రవారం నారాయణపేట్ జిల్లా కొత్తపల్లి మండలంలో 8.9 సెంటీమీటర్లు, అదే జిల్లా మద్దూరులో 8 సెంటీమీటర్లు, వనపర్తి జిల్లా రేవెళ్లలో 7.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా.. జంటజలశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌కు భారీగా వరద వస్తోంది. హుస్సేన్ సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 513.41 మీటర్లు కాగా.. ప్రస్తుతం 513.54 మీటర్ల మేర నీళ్లున్నాయి. అయితే, సాగర్ సర్‌ప్లస్ నాలాలో ప్రవాహం పెరిగిన దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని పరిసరప్రాంతాల ప్రజలకు అధికారులు సూచించారు. ఇక.. 9, 10 తేదీల్లో (సోమ, మంగళవారాల్లో) రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. ఆదిలాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. శని, ఆదివారాల్లోనూ చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా.. ఖమ్మం జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు రహదారులు ధ్వంసమై రూ.100కోట్ల దాకా నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు.


హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చింతకుంట వద్ద రోడ్డుపై నిలిచిన వరద నీరు

ఆ బ్రిడ్జిపై ఆర్నెల్లపాటు రాకపోకలు బంద్

ఖమ్మం క్రైం: వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలు, మున్నేరు వరదలకు ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి ఆరు శ్లాబులు కదిలిన నేపథ్యంలో.. దానిపై రాకపోకలను ఆరునెలలపాటు నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. 2013లో నిర్మించిన ఈ బ్రిడ్జి శ్లాబులు.. భారీ వరదల దెబ్బకు 10 అంగుళాల మేర పక్కకు జరిగినట్టు నిపుణుల బృందం వెల్లడించడంతో మరమ్మతులు నిర్వహించే దాకా రాకపోకలను నిలిపివేయాలనే నిర్ణయం తీసుకున్నారు.

లిక్కర్ ఐస్‌క్రీమ్ ముఠా గుట్టు రట్టు

- ఐస్‌క్రీమ్‌లో 100పైపర్స్ విస్కీ
- లిక్కర్ ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తున్న ముఠా
- గుట్టు రట్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు
- 11.5కేజీల లిక్కర్ ఐస్‌క్రీమ్ స్వాధీనం

బంజారాహిల్స్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): ఐస్‌క్రీమ్‌లో లిక్కర్ కలిపి చిన్నారులను మత్తుకు అలవాటు చేసి వారి జీవితాలతో చెలగాటమాడుతున్న ముఠా గుట్టు రట్టు చేశారు ఎక్సైజ్ శాఖ పోలీసులు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 11.5 కేజీల లిక్కర్ ఐస్‌క్రీమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆబ్కారీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషీ వివరాలు వెల్లడించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు-1, 5లోని అరికో ఐస్‌క్రీమ్ పార్లర్‌లో ఐస్‌క్రీంలో 100 పైపర్స్ విస్కీ కలిపి అధిక దరలకు అమ్ముతున్నారు. రకరకాల రుచుల ఐస్‌క్రీమ్ గురించి నిర్వాహకులు సోషల్ మీడియాలో కూడా ప్రచారం నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ టీం లీడర్ ప్రదీప్‌రావు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. 60 గ్రాముల ఐస్‌క్రీంకు 100 ఎంఎల్ విస్కీ కలుపుతున్నట్టు తేలింది. మొత్తం 11.5 కేజీల విస్కీ కలిపిన లిక్కర్ ఐస్‌క్రీంను సీజ్ చేశారు. రకరకాల రుచుల్లో చిన్న పిల్లలకు ఈ ఐస్‌క్రీంను అమ్ముతున్నట్లు తేలడంతో పార్లర్‌లో ఉన్న దయాకర్‌రెడ్డి, శోభన్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. పార్లర్ నిర్వాహకుడు శరత్‌చంద్రారెడ్డి పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్ట్ చేసి లిక్కర్ ఐస్‌క్రీమ్ తయారీ గుట్టును పూర్తిగా రట్టు చేస్తామన్నారు. నగరంలో ఇలాంటి లిక్కర్ ఐస్‌క్రీమ్‌లు అమ్ముతున్న పార్లర్‌లను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ డైరెక్టర్ ఖురేషీ తెలిపారు.

సివిల్ అసిస్టెంట్ సర్జన్ అభ్యర్థుల వివరాలు వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో 435 సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్) పోస్టుల భర్తీకై వచ్చిన అభ్యర్థుల వివరాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. వీటిలో అభ్యర్థులకు ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 6 నుంచి 10వ తేదీ సాయంత్రం ఐదుగంటల వరకు ఆన్‌లైన్ ద్వారా తెలపాలని మెడికల్ బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 4838 మంది అభ్యర్థుల వివరాలను మెడికల్ బోర్డు తన అధికారిక వెబ్‌సైట్‌లో శుక్రవారం అందుబాటులో ఉంచింది. అభ్యర్థుల దరఖాస్తు నంబరు, పుట్టిన తేదీ, ఒకటి నుంచి ఏడో తేదీ వరకు ఎక్కడ చదివారు? వారి సామాజిక వర్గం, ఎంబీబీఎస్‌లో వారు సాధించిన మార్కుల వివరాలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సర్కారీ దవాఖానాల్లో ఎన్నిరోజులుగా పనిజేస్తున్నారు? లాంటి వివరాలను కూడా అందులో పేర్కొంది. అభ్యంతరాలను, సవరించవలసిన వివరాలను పీడీఎఫ్ ఫార్మాట్‌లో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఫార్మాసిటీ భూముల్లో లైఫ్ సైన్సెస్ పార్క్

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 12 వేల ఎకరాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టు భూముల్లో లైఫ్ సైన్సెస్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. ఫార్మాసిటీ ప్రాజెక్టు ఇప్పటికీ కొనసాగుతోందా? రద్దయిందా? స్పష్టంగా చెప్పాలని ఈనెల 3న హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ సమాచారం ఇచ్చింది. ఫార్మాసిటీ భూసేకరణను గతేడాది హైకోర్టు కొట్టేసినప్పటికీ తమ భూములపై ఇప్పటికీ ప్రభుత్వం ఆంక్షలు కొనసాగిస్తోందని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లికి చెందిన ఆరేపల్లి జంగయ్య సహా 49 మంది రైతులు, హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఫార్మాసిటీపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. శుక్రవారం మరోసారి విచారణ జరిగినప్పుడు ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఫార్మా సిటీ భూముల్లో లైఫ్‌సైన్సెస్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. దాంతో ఇదే విషయాన్ని పేర్కొంటూ రెవెన్యూ ముఖ్యకార్యదర్శి 20లోగా అఫిడవిట్ రూపంలో సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయని మహంకాళి ఆలయ ఈవోకు జైలుశిక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ కాంట్రాక్టు విషయంలో హైకోర్టు ఆదేశాలు అమలు చేయనందుకు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ ఈవోకు నెలరోజుల జైలుశిక్ష, రూ. 2 వేలు జరిమానా విధిస్తూ ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఇస్తూ 15 రోజులపాటు జైలుశిక్ష అమలును సస్పెండ్ చేసింది.

గోదావరిలో దూకిన కానిస్టేబుల్

- మానసికంగా కుంగిపోయి అఘాయిత్యం
- సెల్ఫీ వీడియోలో తన సమస్యల వెల్లడి.. భద్రాచలంలో ఘటన

భద్రాచలం, సెప్టెంబరు 6: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న భార్య, అనుకోకుండా కారుతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడం, ఎంతో కష్టపడి కట్టుకున్న ఇలు వరద ముంపునకు గురి కావడం.. ఒకదాని తర్వాత మరొకటి నిత్యం ఏదో ఒక సమస్య ఎదురవుతుండడంతో మానసిక ఆందోళనకు గురైన ఓ పోలీసు కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం చేశాడు. ఖమ్మం జిల్లా తల్లాడకు చెందిన నీలం నాగరమణారెడ్డి.. పాల్వంచలో స్థిరపడ్డారు. కొత్తగూడెం టూ టౌన్‌లో పోస్టింగ్‌లో ఉన్న రమణారెడ్డి కొంతకాలంగా జిల్లా క్లూస్ టీంలో పని చేస్తున్నారు. గత నెల 24న పాల్వంచలో కారు నడుపుతూ ఆగి వున్న లారీని ఢీ కొట్టి గాయపడిన రమణారెడ్డి ప్రస్తుతం సెలవు పెట్టి విధులకు దూరంగా ఉన్నారు. అయితే, భద్రాచలంలోని గోదావరి వారధిపైకి శుక్రవారం వెళ్లిన రమణారెడ్డి తన చెప్పులు, సెల్‌ఫోన్‌ను వంతెనపై ఉంచి నదిలోకి దూకేశారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించారు. చీకటి పడే వరకు గత ఈతగాళ్లు గాలించినా రమణారెడ్డి ఆచూకీ లభ్యం కాలేదు. గాలింపు చర్యలను శనివారం కొనసాగించనున్నారు. కాగా, 'నా కుటుంబం మీద ఏదో విషం చిమ్మినట్లు అనిపిస్తోంది. నేను నా జీవితాన్ని ఇంతకంటే ముందుకు తీసుకెళ్లలేకపోతున్నాను. ఈ మానసిక ఒత్తిడిని తట్టుకోలేను.. దయచేసి క్షమించండి' అని రమణారెడ్డి సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. కారు ప్రమాదం ఎలా జరిగిందో అర్థం కావడం లేదని, భయం భయంగా ఉంటోందని రమణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కష్టపడి కట్టుకున్న ఇల్లు వరద ముంపునకు గురైందని, 40 ఏళ్లకే తన భార్యకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయని బాధపడ్డారు. మానసిక సమస్యల వల్లే రమణారెడ్డి అఘాయిత్యానికి పాల్పడ్డారని భావిస్తున్నారు.

మంత్రి సీతక్కకు ఫోన్లో దూషణలు

- పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

పంజాగుట్ట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి డి.అనసూయ(సీతక్క)కు పదే పదే ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు అయ్యింది. బేగంపేట జ్యోతిరావు పూలే ప్రజా భవన్ ఆవరణలోని ఓ భవనంలో మంత్రి అనసూయ నివాసం ఉంటున్నారు. ఈ నెల 4న గుర్తు తెలియని వ్యక్తి సాయంత్రం 4.03, 4.05, 4.56 గంటల ప్రాంతంలో మంత్రి మొబైల్‌కు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించాడు. ఆమె సూచనతో కారు డ్రైవర్ ఎం.శ్రీను పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.మొబైల్ నెంబర్ ఆధారంగా నిందితుణ్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

హరీశ్‌రావు వ్యాఖ్యలు దురుద్దేశపూరితం

- విమర్శలను ఖండించిన పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ వ్యవస్థపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను పోలీస్ అధికారుల సంఘం ఖండించింది. బీఆర్ఎస్ హయాంలో పోలీస్ అధికారులకు ఏ మాత్రం స్వేచ్ఛ ఉండేదో మీకు తెలియదా? అని ప్రశ్నించింది. కాంగ్రెస్ పాలనలో పోలీస్ వ్యవస్థ మొత్తం కుప్పకూలిందని, బూటకపు ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని హరీశ్ శుక్రవారం విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి స్పందించారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు దురుద్దేశపూరితమైనవని వ్యాఖ్యానించారు. తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో ఉన్న వారే.. ఈ విధంగా పోలీసులను విమర్శించడం సరి కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారులకు ఏ మాత్రం స్వేచ్ఛ ఉండేదో హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు.

మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్టీ పగ్గాలు

(మొదటిపేజీ తరువాయి)



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నిర్ణయం తీసుకున్నారని, ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. ఇంతకాలం పీసీసీ అధ్యక్షుడిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించిన సేవలను పార్టీ ప్రశంసిస్తోందని ఆయన పేర్కొన్నారు. కాగా, తెలుగు రాష్ట్రాల్లో గౌడ సామాజికవర్గం నుంచి ఎంపికైన తొలి పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నిలిచారు. అలాగే టీపీసీసీకి నాలుగో అధ్యక్షుడిగా నియమితుడయ్యారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. మూడేళ్లుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ సంస్థాగత వ్యవహారాలు చూస్తున్నారు. కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సీఎం రేవంత్‌రెడ్డి పదవీకాలం పూర్తయిన దగ్గర్నుంచి నూతన అధ్యక్ష నియామకంపై అధిష్ఠానం కసరత్తు ముమ్మరం చేసింది. రెడ్డి సామాజిక వర్గానికి సీఎం పదవి ఉన్న నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు కేటాయించాలంటూ ఆ వర్గానికి చెందిన పలువురు నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చారు. అలాగే ఎస్సీ, ఎస్టీ నేతలూ తమ సామాజిక వర్గాలకు కేటాయించాలని హైకమాండ్‌ను అడిగారు.

అన్ని వర్గాల నుంచి డిమాండ్లు వచ్చినా..

రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యులతో అధిష్ఠానం ప్రాథమికంగా చర్చించినప్పుడు.. బీసీ వర్గం నుంచి మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ సురేశ్ షెట్కార్, అంజన్‌కుమార్ యాదవ్, ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎస్టీల నుంచి మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్లు ప్రతిపాదనలోకి వచ్చాయి. అధిష్ఠానంతో పలుమార్లు భేటీ అయిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్.. ఓవైపు సామాజికవర్గాల వారీగా ప్రతిపాదిత పేర్లపై చర్చిస్తూనే.. మరో వైపు ఏ సామాజిక వర్గం నుంచి నూతన చీఫ్‌ను ఎంపిక చేయాలన్నదానిపై చర్చలు జరిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ మాదిగకు ఇవ్వాలన్న ప్రతిపాదనపై చర్చ నడిచినా.. ప్రస్తుత పరిస్థితుల్లో వివాదాలకు తావివ్వకూడదన్న ఉద్దేశంతో దానిని పక్కన పెట్టారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా బీసీలే అయినందున.. ఈ వర్గం నుంచే ఎంపిక చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం అధిష్ఠానం పెద్దలు వ్యక్తం చేశారు. అయితే ఎస్టీలకు టీపీసీసీ చీఫ్ పోస్టు ఇస్తే.. దేశ వ్యాప్తంగా దీని ప్రభావం ఉంటుందన్న అభిప్రాయాన్ని సీఎం రేవంత్ అధిష్ఠానం ముందు వెలిబుచ్చినట్లు సమాచారం. ఎంపీ బలరాంనాయక్ పేరును ఆయన సూచించినట్లు తెలిసింది. బీసీల్లోనైతే ఎవరికి ఇచ్చినా పరస్పరం సహకరించుకుంటామన్న అభిప్రాయాన్నీ ఆయన వ్యక్తం చేసినట్లు సమాచారం.

అధిష్ఠానం మార్కు నిర్ణయం..

సంప్రదాయకంగా సీఎం రేవంత్ సహా పార్టీ ముఖ్య నాయకులందరి అభిప్రాయాలనూ తీసుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. తాను అనుకున్నట్లుగా బీసీలకే టీపీసీసీ చీఫ్ పోస్టు ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చింది. ప్రతిపాదిత పేర్లపై సమీక్ష చేసి మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్‌లలో ఒకరిని నియమించాలనుకుంది. దీనిపై రాష్ట్రంలో ఫ్లాష్ సర్వేలు నిర్వహించి.. మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకానికే ఓటేసింది. మొత్తమ్మీద అధ్యక్ష నియామకంలో తన ముద్రను బలంగా చూపించింది. విద్యార్థి దశనుంచీ కాంగ్రెస్ రాజకీయాల్లోనే ఉండడం, ఎన్ఎస్‌యూఐ నుంచి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరకు పని చేసిన అనుభవం ఉండడం.. ముఖ్యంగా గత మూడేళ్లుగా పార్టీ సంస్థాగత వ్యవహారాలను చక్కబెడుతుండడాన్ని పరిగణనలోకి తీసుక్ను అధిష్ఠానం.. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీకి కొత్త చీఫ్‌గా నియమించింది.

దత్తాత్రేయుని సన్నిధిలో ఉండగా..

కర్ణాటకలోని గానుగాపురం దత్తాత్రేయుని సన్నిధిలో మహేశ్‌కుమార్‌గౌడ్ ఉండగా.. అధిష్ఠానం పెద్దలు ఆయనకు ఫోన్ చేసి టీపీసీసీ చీఫ్‌గా నియమితులైనట్లు తీపి కబురు చెప్పారు. ఆ ఉత్సాహంలో దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న మహేశ్‌కుమార్‌గౌడ్.. అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శనివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. సీఎంతో భేటీలో.. బాధ్యతల స్వీకరణ ముహూర్తం ఎప్పుడన్నది స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

అధిష్ఠానానికి ధన్యవాదాలు: మహేశ్

తనపై అత్యంత నమ్మకముంచి కీలకమైన టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించిన అధిష్ఠానానికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు,, పార్టీ కోసం అనునిత్యం పాటుపడుతున్న నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుకొంటున్నానన్నారు. పార్టీ అప్పగించిన ఈ గొప్ప బాధ్యతను చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేసి.. పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. నిరంతరం నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తానని, రాష్ట్రాభివృద్ధికి, పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు.

మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రస్థానం...

పేరు	బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
తండ్రి పేరు	గంగాధర్‌గౌడ్
పుట్టిన తేదీ	ఫిబ్రవరి 24, 1966
పుట్టిన ఊరు	రహమత్‌నగర్(నిజామాబాద్)
విద్యార్హత	బీకాం
భార్య పేరు	సంధ్యారాణి
కుమారులు	రిత్విక్, ప్రణవ్

ఎన్ఎస్‌యూఐ నుంచి పార్టీలోనే...

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం రహమత్‌నగర్‌కు చెందిన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐలో చేరారు. అప్పటినుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సామాజిక సమీకరణాల వల్ల అవకాశం రాకున్నా.. వివిధ హోదాల్లో పార్టీలో పనిచేశారు. నిజామాబాద్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా 1986 నుంచి 1990 వరకు పనిచేశారు. ఆ తర్వాత 1990లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై 1998 వరకు పనిచేశారు. అనంతరం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా 1998 నుంచి 2000 వరకు పనిచేశారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో ఆయన సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. మొదట పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా 2000 నుంచి 2003 వరకు పనిచేశారు. పార్టీ అధికార ప్రతినిధిగా 2012 నుంచి 2016 వరకు చేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా 2016 నుంచి 2021 వరకు కొనసాగారు. 1994లో డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన 2014లో నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ పడ్డారు. తర్వాత మళ్లీ అవకాశం రాలేదు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో 2013లో రాష్ట్ర వేర్ హౌజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులై ఆయన రెండేళ్ల పాటు కొనసాగారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పలువురు నేతలు పార్టీ మారినా ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగారు. పీసీసీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు 2021లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవకాశాన్ని కల్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయనను గత జనవరిలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు.

కార్యవర్గం కూర్పుపైనా కసరత్తు..

టీపీసీసీకి కొత్త చీఫ్‌ను ప్రకటించిన అధిష్ఠానం.. కార్యవర్గం కూర్పుపైనా కసరత్తు చేసింది. టీపీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, ప్రచార.. ఇతర కమిటీల చైర్మన్ల నియామకంపైనా కసరత్తు జరిగినట్లు చెబుతున్నారు. నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను రెడ్డి, మైనారిటీ, ఎస్సీ మాదిగ, ఎస్టీ లంబాడాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించే అవకాశం ఉన్నట్లు పేర్కొంటున్నారు. ప్రచార కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పేరు వినిపిస్తోంది. టీపీసీసీ చీఫ్ పదవికి చివరి వరకూ పోటీలో ఉన్న మధుయాష్కీగౌడ్‌కు ఏఐసీసీలోగానీ, రాష్ట్రంలోగానీ కీలక పదవి ఇచ్చే ఆస్కారం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక.. కళకళలాడనున్న గాంధీభవన్!

టీపీసీసీ అధ్యక్షుడిగానూ సీఎం రేవంత్‌రెడ్డే ఉన్న నేపథ్యంలో.. పార్టీ కార్యక్రమాల కోసం ఆయన వచ్చిన వచ్చినప్పుడే గాంధీభవన్.. నేతలతో కళకళలాడుతున్న పరిస్థితి ఇప్పటి వరకూ ఉంది. అధ్యక్ష బాధ్యతలను మహేశ్‌కుమార్‌గౌడ్ స్వీకరించిన తర్వాత.. ఆయన నిత్యం గాంధీభవన్‌లో అందుబాటులో ఉండనున్నారు. దీంతో ఇక మీదట గాంధీభవన్ నిత్యం నేతలతో కళకళలాడనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నిజామాబాద్ నుంచి డీఎస్ తర్వాత రెండో వ్యక్తి..

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా డి.శ్రీనివాస్ తర్వాత నిజామాబాద్ జిల్లా నుంచి మళ్లీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కే అవకాశం దక్కింది. ఉమ్మడి రాష్ట్ర హయాంలో పీసీసీ అధ్యక్షుడిగా రెండు దఫాలు డి.శ్రీనివాస్ పనిచేశారు. ఉమ్మడి రాష్ట్ర హయాంలో జిల్లా నుంచి డీఎస్‌కు అవకాశం దక్కగా.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహేష్‌కుమార్‌గౌడ్‌కే దక్కింది. ఇద్దరు కూడా బాల్కొండ నియోజకవర్గానికి చెందిన నేతలే. కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమించడంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. నిజామాబాద్‌లోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు.

విధేయతకు దక్కిన గౌరవం

- మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ నేతల అభినందనలు
- బీసీలకు సముచిత ప్రాధాన్యం దక్కింది: పొన్నం ప్రభాకర్
- రాష్ట్రంలో కాంగ్రెస్ మరింత బలపడుతుంది: జూపల్లి

హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీకి నూతన అధ్యక్షుడిగా నియమితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌కు కాంగ్రెస్ ముఖ్య నాయకులు వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు. ఇది విదేయతకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకంతో బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం దక్కిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇది బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు నిదర్శనమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్గదర్శకత్వం, మహేశ్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. కాగా, మహేశ్‌కుమార్ గౌడ్ సారథ్యంలో బీసీలకు పూర్వవైభవం వస్తుందని ఆశిస్తున్నట్లు మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అధ్యక్ష పదవి చేపట్టడం సరైనదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకం పట్ల టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు తూర్పు జగ్గారెడ్డి, గీతారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తదితరులు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు అభినందనలు తెలిపారు. గాంధీభవన్‌లో పలువురు నేతలు బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుతూ ఆనందం వ్యక్తం చేశారు.

రిజిస్ట్రేషన్ శాఖ.. చాలా పూర్ గురూ!

- ఆ శాఖ చెల్లించాల్సిన అద్దె బకాయిలు రూ.2.97 కోట్లు
- స్టాంప్ పేపర్లకు సంబంధించి.. రూ.ఇరవై కోట్లు
- సాఫ్ట్‌వేర్ సేవలు అందించినవారికి.. రూ.80 కోట్లు
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనబకాయిలు రూ.2.6 కోట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖ సేవా లోపాలపై నిత్యం ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతూనే ఉంటుంది. స్లాట్ బుకింగ్ దగ్గర నుంచి దస్తావేజు రిజిస్ట్రేషన్ దాకా.. దళారీల ద్వారా వెళితేనే పని అవుతుందనే బలమైన నమ్మకం ప్రజల్లో నాటుకుపోయింది. ఇలాంటి సేవా లోపాలను అధిగమించలేకపోతున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు.. బకాయిల చెల్లింపులోనూ జాప్యం చేస్తున్నారు. ఏటా రూ.18 వేల కోట్ల ఆర్జనను లక్ష్యంగా పెట్టుకున్న ఈ శాఖ.. బకాయిల చెల్లింపుల మీద దృష్టిసారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉదాహరణకు.. ఈ శాఖలో అన్ని సేవలను ఆన్‌లైన్ చేయాలనే లక్ష్యంతో కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) వ్యవస్థను ఏర్పాటు చేశారు. సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ సేవలు అందించడానికి, సిస్టమ్స్, స్కానర్స్ నిర్వహణకు సర్వీస్ ప్రొవైడర్‌ను నియవించుకున్నారు. కానీ ఐదేళ్లుగా సదరు సర్వీస్ ప్రొవైడర్‌కు చెల్లింపులు చేయట్లేదు. ఆ బకాయిలు దాదాపుగా రూ.80 కోట్ల దాకా ఉన్నాయి. బడ్జెట్ విడుదల కాకపోవడం వల్లనే బకాయిలు చెల్లించడంలో జాప్యం జరిగిందని రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. అలాగే స్టాంప్ పేపర్లకు సంబంధించిన బకాయిలు సుమారు రూ.20 కోట్ల దాకా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖలో పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు కూడా భారీగానే ఉన్నాయి. సకాలంలో వేతనాలు అందించాలని ఉద్యోగులు వేడుకుంటున్నా అలా జరగట్లేదనే విమర్శలున్నాయి. ఆ బకాయిలు.. 2.66 కోట్ల దాకా ఉన్నాయి.

అద్దెలు కడ్తలేరు!

రిజిస్ట్రేషన్ శాఖకు.. రాష్ట్రవ్యాప్తంగా చెల్లించాల్సిన అద్దె బకాయిలు రూ.2.97 కోట్లు ఉన్నాయి. హైదరాబాద్ దక్షిణ కార్యాలయం పరిధిలో రూ.40 లక్షలు, రంగారెడ్డి కార్యాలయం పరిధిలో రూ.కోటి, మహబూబ్‌నగర్‌లో రూ.19 లక్షలు, నిజామాబాద్ రూ.46 లక్షలు, ఖమ్మంలో రూ.48 లక్షలు చొప్పున బకాయిలు ఉన్నాయి. అలాగే.. విద్యుత్తు చార్జీల బకాయిలు రూ.1.49 కోట్ల మేరకు ఉన్నాయి. అద్దె వాహనాలకు సంబంధించిన బకాయిలైతే రూ.72 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది.



ఆకునూరి మురళి



కోదండరెడ్డి

బీసీ కమిషన్ చైర్మన్‌గా నిరంజన్

(మొదటిపేజీ తరువాయి)

సీనియర్ నేత ఎం.కోదండరెడ్డిని సారథులుగా ప్రకటించింది. వీరు రెండేళ్ల పాటు బాధ్యతల్లో కొనసాగుతారని పేర్కొంది. రైతు కమిషన్ ఏర్పాటు, దానికి చైర్మన్‌ను ఒకే రోజు నియమించింది. కమిషన్‌లో మొత్తం ఆరుగురు ఉంటారు. బీసీ, విద్య, రైతు కమిషన్ల చైర్మన్లుగా నిరంజన్, మురళి, కోదండరెడ్డిల నియామకంపై 'ఆంధ్రజ్యోతి' గతంలోనే చెప్పింది.

విధి విధానాలివీ..

రాష్ట్రంలో వ్యవసాయ రంగ పునరుత్తేజం, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి అవకాశాలు, సాగులో ఎదురయ్యే కీలక సవాళ్ల పరిష్కారం, అన్ని వర్గాల రైతుల సంక్షేమం-అభివృద్ధి.. తెలంగాణ వ్యవసాయ-రైతు సంక్షేమ కమిషన్ లక్ష్యం. భవిష్యత్ తరాలకు పోషకాహార భద్రత, వ్యవసాయ కుటుంబాల జీవనోపాధి మెరుగుదల, పర్యావరణ సుస్థిరతకు కమిషన్ మార్గదర్శకంగా ఉండనుంది. కమిషన్ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో గుణాత్మక మార్పులు, రైతు కుటుంబాల ఆదాయం పెంపు మార్గాలపై ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది. దీని కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు సభ్య కార్యదర్శిని నియమిస్తారు. కాగా, కమిషన్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించనున్నారు. ఇది ప్రైవేట్ రంగ భాగస్వామ్యాలు, అంతర్జాతీయ ఏజెన్సీల నుంచి గ్రాంట్లు, విరాళాలను సేకరించవచ్చు.

బుడమేరులో రంగంలోకి సైన్యం

- 120 మంది మద్రాస్ బెటాలియన్ జవాన్ల రాక
- యుద్ధ ప్రాతిపదికన మూడో గండి పూడ్చే పనులు
- నేటి ఉదయానికి పూర్తయ్యే అవకాశం



నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు రాడ్లలతో వంతెన నిర్మిస్తున్న సైన్యం

జి.కొండూరు, సెప్టెంబరు 6: వరద కారణంగా బుడమేరు వరద మళ్లింపు కాలువ (బీడీసీ) ఎడమ కట్టకు పడిన గండ్ల పూడిక పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మొత్తం 3 ప్రధాన గండ్లలో ఇప్పటికే 2 గండ్లు పూడ్చగా అతి పెద్దదైన మూడో గండి పూడ్చివేత శనివారం ఉదయానికి పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. విజయవాడ పల్లపు ప్రాంతాలను అతలాకుతలం చేసిన బుడమేరు వరద నుంచి బాధితులను కాపాడేందుకు, సహాయ చర్యలు ముమ్మరంగా చేసేందుకు బుడమేరు వరద గండ్ల ద్వారా విజయవాడ వైపు రాకుండా చేయాల్సి ఉంది. దీనిపై సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి సైన్యాన్ని రంగంలోకి దించారు. మద్రాసు 6వ బెటాలియన్ నుంచి 120 మంది జవాన్లు వచ్చారు. వారు తాత్కాలికంగా రాడ్లలతో వంతెన నిర్మాణం చేసి.. అందులో రాళ్లు వేసి గండి పూడ్చేందుకు యత్నిస్తున్నారు. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి 4వ కిమీ వద్ద 60 మీటర్లు, 4.1 కిమీ వద్ద 50 మీటర్ల మేర పడిన గండ్లలో 4.1, 4 కిమీ వద్ద ఏర్పడిన గండ్లను శుక్రవారం మధ్యాహ్నానికి పూడ్చివేశారు. 3.9వ కిమీ వద్ద పడిన 100 మీటర్ల గండిని సాయంత్రానికి 20 శాతం పూర్తి చేశారు.

పాత ఫ్యాకల్టీని తీసుకునేలా పోరాడుతాం

- గౌలిదొడ్డి గురుకుల పాఠశాల విద్యార్థులకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రుల భరోసా

రాయదుర్గం, సెప్టెంబర్6(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో పాత ఫ్యాకల్టీని ప్రభుత్వం తిరిగి తీసుకునేలా తాము పోరాడుతామని.. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జగదీశ్వర్ రెడ్డి, గురుకులాల మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు భరోసా ఇచ్చారు. గురువారం వారు గౌలిదొడ్డిలోని బాల, బాలికల ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలను సందర్శించి, విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ కళాశాలలో ఉపాధ్యాయులను ఉన్నపళంగా తొలగించారని.. కొత్త ఫ్యాకల్టీ చెప్పే పాఠాలు అర్థం కావడానికి కొంత సమయం పట్టేలా ఉందని విద్యార్థులు వారికి తెలిపారు. పోటీ పరీక్షల గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ సమస్య తమకు ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. తమ విద్యా సంవత్సరం పూర్తయ్యేదాకా కొత్త వారితో పాటు పాత వారిని కొనసాగిస్తే తమకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మాజీ మంత్రులు.. దశాబ్ద కాలంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారు మంచి ర్యాంకులు సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను ఒక్క సంతకంతో రాత్రికి రాత్రి తొలగించడమంటే విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేయడమేనని మండిపడ్డారు. గురుకుల పాఠశాల వ్యవస్థనే ఈ ప్రభుత్వం ప్రశ్నార్థకంగా మారుస్తోందన్నారు. విద్యార్థులంతా మెచ్యూరిటీతో మాట్లాడుతున్నారని.. వారిని చూసైనా ముఖ్యమంత్రి, మంత్రులు బుద్ధి తెచ్చుకోవాలని జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. వారితో వారానికి ఒకసారైనా ఇంటరాక్ట్ అయితే సీఎంకు, మంత్రులకు జ్ఞానం పెరుగుతుందన్నారు. పేద విద్యార్థుల విద్యాలయాలపై ఈగ కూడా వాలకుండా చూద్దామని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

ఎర్రవల్లి ఫాంహౌస్‌లో
కేసీఆర్ చండీయాగం

ప్రతికూల పరిస్థితులు అధిగమించే సంకల్పం


చండీయాగానికి వెళ్తున్న కేసీఆర్

హైదరాబాద్, మర్కుక్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో యాగం నిర్వహించారు. తన సతీమణి శోభతో కలిసి ఆయన నవగ్రహ మహా యాగం, చండీయాగం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటలవరకు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యాగక్రతువును నిర్వహించారు. రాజకీయంగా ప్రతికూల వాతావరణం ఏర్పడటం, కేసుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితుల నుంచి బయటపడేందుకు వేద పండితుల సూచనమేరకు కేసీఆర్ ఈ యాగం నిర్వహించినట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అధికారం చేపట్టాక కేసీఆర్ 2015లో చండీయాగం, 2018, 2023లో రాజశ్యామల యాగం చేశారు. అయితే, శుక్రవారం జరిపిన నవగ్రహ మహాయాగానికి అతికొద్ది మందే హాజరయ్యారు. మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఆమె భర్త అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

లంచం అడిగితే ఫోన్ చేయండి

» వినియోగదారులకు దక్షిణ డిస్కమ్ సూచన

హైదరాబాద్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త కనెక్షన్, కేటగిరీ మార్పు, సర్వీసు టైటిల్ మార్పు, బిల్లింగ్‌లో లోపాల సవరణ వంటి సేవలు అందించే క్రమంలో విద్యుత్ సిబ్బంది ఎవరైనా లంచం అడిగితే ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని దక్షిణ డిస్కమ్(టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ కోరారు. ఇందుకోసం సీఎండీ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శాఖలోని సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తే 040 -23454884 లేదా 76809 01912 నంబర్లకు కాల్ లేదా వాట్సాప్ మెస్సేజ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వినియోగదారుల సమస్యలు/ఫిర్యాదులను నేరుగా తెలుసుకోవడంతోపాటు అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంస్థ పరిధిలో సేవలు పొందేందుకు వెబ్‌సైట్ (tgsouthpower.org) లేదా మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌మోసం.. విద్యార్థి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో మోసపోయిన ఓ విద్యార్థి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొన్నాడు. వికారాబాద్ జిల్లా మద్దూరు గ్రామానికి చెందిన ఆర్.నర్సింహులు, క్రిష్ణవేణి దంపతుల కుమారుడు రూమాండ్ల భానుప్రకాష్(21) షాపూర్‌నగర్‌లోని సంజయ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటూ రామాంతపూర్‌లోని అరోరా కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. టెలిగ్రామ్ చానల్‌లో చూసి ఓ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో మొదట రూ.5 వేలు పెట్టి కొంత రాబడి రాగానే అత్యాశతో స్నేహితుల దగ్గర అప్పులు చేసి మళ్లీ రూ.65 వేల పెట్టుబడి పెట్టాడు. అయితే ఆ యాప్‌లో పెట్టిన పెట్టుబడికి తిరిగి డబ్బు రాకపోవడంతో మోసపోయానని తెలుసుకొని జీవితంపై విరక్తి చెంది ఈ నెల 5న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రం ఫాక్స్‌సాగర్ చెరువు కట్ట వద్ద తన ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ వదిలేసి చెరువులో దూకాడు. మెసేజ్ ద్వారా విషయం తెలుసుకొన్న స్నేహితులు ల్యాప్‌ట్యాప్ ద్వారా భానుప్రకాష్ ఫోన్ ట్రేస్ చేసి చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ అతని ద్విచక్రవాహనం, ఫోన్ గమనించి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమాచారం అందించారు. దీంతో జీడిమెట్ల పోలీసులు తమ పరిధిలోకి రాదని పేట్‌బషీర్‌బాద్ పోలీసుల పరిధిలోకి వస్తుందని తెలిపారు. మరుసటిరోజు జీహెచ్ఎంసీ, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీయగా పోలీసులు శవపరీక్ష నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

10వ తేదీ 'ప్రజావాణి' 11కు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఈ నెల 10న(మంగళవారం) నిర్వహించాల్సిన 'ప్రజావాణి' కార్యక్రమాన్ని 11వ తేదీ(బుధవారం)కి వాయిదా వేసినట్లు రాష్ట్ర నోడల్ అధికారిణి దివ్య తెలిపారు. 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో జరిగే సమావేశాల కారణంగా దీనిని వాయిదా వేశామని పేర్కొన్నారు. ప్రజలు మంగళవారం కాకుండా బుధవారం వచ్చి వినతిపత్రాలు ఇవ్వాలని ఆమె సూచించారు. శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 570 దరఖాస్తులు అందాయి.

విచారణ లేకుండా
తహసీల్దార్లు, ఆర్డీవోలపై కేసులు పెట్టొద్దు: ట్రెసా

ఎలాంటి విచారణ, ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా మేజిస్ట్రేట్ హోదా కలిగిన తహసీల్దార్లు, ఆర్డీవోలపై కేసులు పెట్టవద్దని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) కోరింది. ఈ మేరకు డీజీపీ జితేందర్‌ను కలిసిన ట్రెసా బృందం ఓ వినతి పత్రాన్ని అందజేసింది. మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న అధికారిపై కేసు నమోదు చేయాలన్నా, విచారణ చేపట్టాలన్నా కలెక్టర్ లేదా ప్రభుత్వం నుంచి ముందుగా అనుమతి తీసుకోవాలని చట్టం చెబుతోందని ట్రెసా బృందం డీజీపీకి వివరించింది. ఇటీవల బాచుపల్లి తహసీల్దార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసిన విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లింది. ఎఫ్ఐఆర్ నుంచి తహసీల్దార్ పేరు తప్పించాలని విన్నవించింది. కాగా, తమ విజ్ఞప్తికి డీజీపీ సానుకూలంగా స్పందించారని ట్రెసా అధ్యక్ష, కార్యదర్శులు వి.రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్ తెలిపారు.

జైనూరు ఘటనలో డీఎస్పీపై బదిలీ వేటు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 6: కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ చెలరేగడంతో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యపై బదిలీ వేటు వేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక జైనూరులో రెండో రోజు కూడా ఆంక్షలు కొనసాగుతున్నాయి. 144 సెక్షన్ అమలులో ఉంది. రాష్ట్ర అదనపు డీజీ మహేశ్ భగవత్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పలు జిల్లాల ఎస్పీలతో పాటు వెయ్యి మంది పోలీసులు కట్టుదిట్టమైన బందో బస్తు నిర్వహిస్తున్నారు. ఘటనలో చోటుచేసుకున్న ఆస్తి నష్టంపై అంచనాలను రూపొందించేందుకు ప్రత్యేకాధికారిగా డీఎస్పీ కరుణాకర్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఈ మేరకు ఆస్తి నష్టంపై అంచనాలు వేస్తున్నారు. జైనూరు ఘటనతో జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో బంద్ కొనసాగుతోంది. రెండు రోజులుగా స్వచ్ఛందంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలను మూసేసి బంద్ పాటిస్తున్నారు.

ఆదిమూలంపై అత్యాచారం కేసు

» బాధిత మహిళ ఫిర్యాదుతో తిరుపతి పోలీసుల కేసు నమోదు

» వైద్య పరీక్షలకు బాధితురాలి నిరాకరణ

» చెన్నైలోని ఆసుపత్రిలో ఎమ్మెల్యే కోనేటి విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాలు

తిరుపతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. ఆదిమూలం తనను బెదిరించి బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారంటూ తెలుగు మహిళా నాయకురాలు గురువారం రాత్రి తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు క్రైమ్ నంబరు 430/24తో ఐపీసీ 376, 506(భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 64, 351-2) కింద కేసు నమోదు చేశారు. సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలానికి చెందిన బాధితురాలు గురువారం హైదరాబాద్‌లో మీడియా ఎదుట ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని టీడీపీ నుంచీ సస్పెండ్ చేశారు. ఆ క్రమంలో గురువారం రాత్రి బాధితురాలు తన భర్తతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెలంగాణ పాలిట దశమ గ్రహం కేసీఆర్

» కేటీఆర్‌ను సీఎం చేసేందుకే నవగ్రహ యాగం

» ఎంపీలు, ఎమ్మెల్యేలు వెళ్లకుండా వశీకరణ పూజలు

» సచివాలయంలో 3 అంతస్థుల డోమ్‌లు.. విడ్డూరం

» బీజేపీ అధికారంలోకి వచ్చాక వాటిని బరాబర్ కూల్చేస్తాం

» ఏపీ, తెలంగాణకు కేంద్రం అండగా ఉంటుంది: సంజయ్



హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ పాలిట దశమ గ్రహం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దుయ్యబట్టారు. ప్రజల మంచి కోసం యాగం చేస్తే ఆయన కేసీఆరే కాదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నవగ్రహ యాగం చేయడంపై సంజయ్ తనదైన శైలిలో స్పందించారు. "కేసీఆర్ ఓ దశమ గ్రహం. బీఆర్ఎస్ ఓడిపోవడంతో తెలంగాణ ప్రజలకు ఆ పీడ విరగడైంది. పదేళ్లు కేసీఆర్ సహా ఆయన కుటుంబమంతా అధికారం అనుభవించింది కదా. ఇంకా దేనికోసం నవగ్రహం యాగం చేస్తున్నట్లు? బహుశా కేటీఆర్‌నో కవితనో సీఎం చేసేందుకే అయి ఉంటుంది"అని వ్యాఖ్యానించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడకుండా కేసీఆర్ వశీకరణ పూజలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో సంజయ్ మీడియాతో మాట్లాడారు. మెడకాయమీద తలకాయ ఉన్నోడెవ్వడూ తొమ్మిది అంతస్థుల సచివాలయంలో మూడంతస్థుల మేర డోమ్‌లు కట్టరని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక సచివాలయం పై భాగంలో ఉన్న డోమ్‌లను బరాబర్ కూల్చివేస్తామని పునరుద్ఘాటించారు. రాజకీయంగా కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు పది నెలల క్రితమే నో ఎంట్రీ ప్రకటించారని, ఇక రీ ఎంట్రీ ఎక్కడిది? అని ప్రశ్నించారు. కాగా, వరదలతో తీవ్రంగా నష్టపోయిన ఏపీ, తెలంగాణకు కేంద్రం సాయం చేస్తుందని సంజయ్ ప్రకటించారు. ఇది రాజకీయ కోణంతో చూసే అంశం కాదన్నారు. ప్రజలను ఆదుకోవాలన్న ఉద్దేశంతోనే కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో ఏరియల్ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. తనతోపాటు మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి సైతం ఆయన వెంట ఉన్నామని చెప్పారు. "క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాం. రైతులతో మాట్లాడినం. వరద నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించాం. అనంతరం హైదరాబాద్‌లో సచివాలయానికి వెళ్లి సీఎంతో సమావేశమయ్యాం. వరద నష్టం వివరాలను తెలుసుకున్నాం. నిబంధనల ప్రకారం సాయం అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. రాజకీయాలకతీతంగా ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. దురదృష్టమేమిటంటే గత కేసీఆర్ ప్రభుత్వం ఎస్డీఆర్ఎఫ్ నిధులను పక్కదారి మళ్లించింది. ఎన్ని నిధులివ్వాలనే అంశంపై వాస్తవ అంచనాల ఆధారంగా, నిబంధనల మేరకు కేంద్రం కచ్చితంగా సాయం చేస్తుంది" అని సంజయ్ స్పష్టం చేశారు.

ఏఐ సిటీలో వరల్డ్ ట్రేడ్ సెంటర్

10 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు.. డబ్ల్యూటీసీఏతో రాష్ట్ర సర్కారు ఎంవోయూ

» ఈ సెంటర్ పూర్తయితే ఐటీ ఎగుమతులు 200 బిలియన్ డాలర్లకు : మంత్రి దుద్దిళ్ల


మంత్రి దుద్దిళ్ల సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకుంటున్న డబ్ల్యూటీసీఏ ప్రతినిధులు

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కృత్రిమ మేధ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ప్రతిపాదిత ఏఐ సిటీలో ప్రపంచ స్థాయి వరల్డ్ ట్రేడ్ సెంటర్(డబ్ల్యూటీసీ) ఏర్పాటుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. ఇప్పటికే శంషాబాద్, జీనోమ్ వ్యాలీలో రెండు వరల్డ్ ట్రేడ్ సెంటర్లు ఉన్నాయి. వీటికి అదనంగా ఏఐ సిటీలో మరో వరల్డ్ ట్రేడ్ సెంటర్ రానుంది. హైదరాబాద్‌లో ప్రారంభమైన ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో మరో డబ్ల్యూటీసీని ఏర్పాటు చేయడానికి వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ అసోసియేషన్(డబ్ల్యూటీసీఏ) ముందుకొచ్చింది. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో డబ్ల్యూటీసీఏ ప్రతినిధులు అవగాహన ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 'ఫోర్త్ సిటీ' ఏర్పాటుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఇందులోనే 10 లక్షల(మిలియన్) చదరపు అడుగుల విస్తీర్ణంతో వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచ కృత్రిమ మేధ రంగంలో అత్యధిక విస్తీర్ణంతో ఏర్పాటవుతున్న సెంటర్ ఇదే కావడం గమనార్హం. ఇందులో ప్రపంచ స్థాయి ఆఫీస్ స్పేస్, వాణిజ్య సేవలు, శిక్షణ సౌకర్యాలు, చిల్లర వ్యాపారం, ఇతర వినోద జోన్లు, నివాస ప్రదేశాలు, విలాసవంతమైన హోటల్, ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఒక మినీ సిటీని ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభిమతం మేరకు డబ్ల్యూటీసీ ఏర్పాటు కానుంది. 'వాక్-టు-వాక్' విధానంలో ఇక్కడ సకల సౌకర్యాలు కల్పిస్తారు. అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... ఏఐ సిటీలో మరో వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటు కానుండడంతో రాష్ట్ర నుంచి ఐటీ ఎగుమతులు 32 బిలియన్ డాలర్ల నుంచి 200 బిలియన్ డాలర్లకు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో మమేకమై ఆర్థిక వృద్ధిని సాధిస్తుందనడానికి, ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుందనడానికి ఇదే తార్కాణమని అన్నారు. ఏఐని పూర్తిగా ప్రజాస్వామ్యీకరించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీని ఫలాలను అన్ని వర్గాలకు సమానంగా పంచుతామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతి సాధించాలంటే ఏఐ సేవలు అవసరమని అభిప్రాయపడ్డారు. డబ్ల్యూటీసీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాబిన్ వాన్ పుయెన్‌బ్రోక్ మాట్లాడుతూ ఏఐ సిటీలో ఏర్పాటు చేసే డబ్ల్యూటీసీకి తెలంగాణ ప్రభుత్వం వెంటనే లైసెన్స్ మంజూరు చేయడాన్ని అభినందించారు. కొత్త వరల్డ్ ట్రేడ్ సెంటర్లకు లైసెన్సులు పొందడం సుదీర్ఘ కసరత్తు అని, ఇక్కడ రికార్డు స్థాయిలో వారంలోనే లైసెన్సు పొందామన్నారు.

వైద్య రంగంలో ఏఐతో సమస్యలూ ఉన్నాయ్!

దేశంలో పూర్తిస్థాయిలో కృత్రిమ మేధ అమల్లోకి రావాలంటే ఇంకా ఐదారేళ్లు పడుతుంది

ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ)తో వైద్య రంగంలో సమస్యలు కూడా ఏర్పడవచ్చని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. అమెరికా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే భారత్‌లో పలు సమస్యలు ఉన్నాయని చెప్పారు. అంతర్జాతీయ ఏఐ సదస్సులో భాగంగా శుక్రవారం 'ఏఐ- ట్రాన్స్‌ఫార్మింగ్ పేషెంట్ కేర్- డయాగ్నసిస్ అండ్ ట్రీట్మెంట్' అనే అంశంపై నిర్వహించిన చర్చాగోష్ఠిలో మాట్లాడారు. భారత్‌లో సైబర్ సెక్యూరిటీ అతిపెద్ద సమస్య అన్నారు. ఇటీవలే ఎయిమ్స్ సమాచారాన్ని చైనాకు చెందిన హ్యాకర్లు తస్కరించారని గుర్తుచేశారు. ఇతర ప్రైవేటు ఆస్పత్రుల వద్ద ఉన్న రోగుల డేటా భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ సెక్యూరిటీ లేకుండా ఏఐ వినియోగం ప్రతికూల ప్రభావం చూపిస్తుందని అభిప్రాయపడ్డారు. అమెరికా ఆస్పత్రుల్లోని 80 శాతం వెంటిలేటర్లు ఏఐ టెక్నాలజీతో అనుసంధానమై ఉంటాయని, వాటిని ఎక్కడి నుంచైనా నియంత్రించవచ్చని చెప్పారు. అక్కడ పటిష్ఠ వ్యవస్థ అందుబాటులో ఉన్నందున ఏఐ సాంకేతికతను విజయవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. కానీ, భారత్‌లో ఇంకా అలాంటి పరిస్థితి లేదన్నారు. ఇక్కడ వైద్య రంగంలో ఏఐ పూర్తిస్థాయిలో అమల్లోకి రావాలంటే ఐదారేళ్ల సమయం పడుతుందని పేర్కొన్నారు.

నోట్లో నాగుపాముతో
దుస్సాహసం

పాము కాటుకు గురై యువకుడి మృతి


నాగుపామును నోట్లో పెట్టుకున్న శివరాజులు

బాన్సువాడ, సెప్టెంబరు 6: సోషల్ మీడియా సంచలనంగా మారిపోవాలనే పిచ్చి ఆలోచనతో ఓ యువకుడు దుస్సాహసం చేశాడు. విషపూరితమైన నాగుపామును నోట్లో పెట్టుకుని వీడియో తీయించుకుంటూ.. అదే పాము కాటుకు గురయ్యాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది కానీ ఆ యువకుడే లోకంలో లేకుండా పోయాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేటలో శుక్రవారం జరిగిన ఈ ఘటనలో మోచి శివరాజులు(23) అనే యువకుడు మరణించాడు. దేశాయిపేటకు చెందిన మోచి గంగారం పాములు పడుతూ స్నేక్ క్యాచర్‌గా జీవిస్తున్నాడు. గంగారం కుమారుడు శివరాజులు కూడా పాములు పడుతుంటాడు. గంగారం ఇటీవల ఓ నాగుపామును తెచ్చి శివరాజులుకు ఇచ్చాడు. స్నేక్ క్యాచర్‌గా పేరు సంపాదించేందుకు ఆ పాముతో వీడియోలు, ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో పెట్టాలని సూచించాడు. దీంతో శివరాజులు నాగుపాము తల భాగాన్ని తన నోట్లో పెట్టుకుని విన్యాసాలు చేస్తూ స్నేహితులతో వీడియో తీయించుకున్నాడు. శివరాజులు సుమారు పది నిమిషాలు పాటు పామును తన నోట్లోనే ఉంచుకున్నాడు. ఈ క్రమంలో ఆ పాము శివరాజులు నోట్లో కాటేసినట్టు తెలిసింది. పాము కాటును గుర్తించని శివరాజులు యథావిధిగా ఇంటికి వెళ్లగా.. ఆ తర్వాత అరగంటకే చనిపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో
ఎంసెట్, నీట్ కోచింగ్!

» రోజూ ప్రత్యేక తరగతులు.. విద్యా శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా ఎంసెట్, నీట్ కోచింగ్ ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ఒకేషనల్ కోర్సులు చదువుతున్న వారి నైపుణ్యాలను అభివృద్ధి పరచి ప్రత్యేక జాబ్‌మేళాలను నిర్వహించనున్నారు. ఈమేరకు శుక్రవారం విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులతో పోటీ పడేలా ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులను తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ముఖ్యంగా ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షలను ఎదుర్కోవడానికి వీలుగా రాష్ట్రంలోని 400 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్, నీట్, జేఈఈ, సీఏ వంటి కోర్సుల కోచింగ్ నిర్వహించడానికి వీలుగా ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. ఇందులో భాగంగా రోజు 50 నిమిషాల పాటు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. ఇందుకు ఇప్పటికే జూనియర్ లెక్చరర్లకు నిపుణులతో ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించారు. ఈ కోచింగ్‌లో ప్రతీ వారం విద్యార్థులకు ప్రత్యేక టెస్ట్‌లను కూడా నిర్వహిస్తారు. విద్యార్థులకు అందించడానికి వీలుగా ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను తెలుగు అకాడమీ ద్వారా సిద్ధం చేస్తున్నారు. అంతేగాక ప్రభుత్వ జూనియర్ ఒకేషనల్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాలను పెంచి, వారికి ఉద్యోగాలు వచ్చేలా చర్యల్ని తీసుకోవాలని విద్యా శాఖ అధికారులు నిర్ణయించారు. రాష్ట్రంలో సుమారు 187 కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. మొత్తం 22 రకాల కోర్సులను నిర్వహిస్తున్నారు. ఇందులో కంప్యూటర్ సైన్స్, మెకానికల్, సివిల్ వంటి 7 ఇంజనీరింగ్ కోర్సులు కూడా ఉన్నాయి. ఈ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడానికి వీలుగా ప్రత్యేక చర్యల్ని తీసుకోనున్నారు. ముఖ్యంగా ఆయా రంగాల కంపెనీలు, సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుని కళాశాలలతో అనుసంధానం చేయాలని నిర్ణయించారు. కోర్సు ముగిసిన తర్వాత ఒక ఏడాది పాటు ఆయా కంపెనీలు, సంస్థల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నారు. అనంతరం జాబ్‌మేళాలను నిర్వహించి ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలను అమలుపరచడం కోసం ప్రత్యేక అకడమిక్ గైడెన్స్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సెల్‌లో పనిచేయడం కోసం ముగ్గురు జూనియర్ లెక్చరర్లను డిప్యూటేషన్‌పై నియమించనున్నారు. మరో ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమిస్తారు. ఇక నుంచి రెగ్యులర్‌గా అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందించడం, దానిని అమలుచేయడం, ఆడిట్‌ను నిర్వహించడం వంటి వాటిపై దృష్టి పెట్టనున్నారు. అలాగే. ప్రత్యేక యాప్‌ను రూపొందించి కోచింగ్ తరగతులు ఎలా కొనసాగుతున్నాయనే విషయాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. కొత్త కోర్సుల్ని ప్రవేశపెట్టడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో బయో మెట్రిక్ హాజరు అమలుపరచనున్నారు. సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

మూడు నాలుగు రోజుల్లో డీఎస్సీ ఫలితాలు!

డీఎస్సీ తుది 'కీ'ని శుక్రవారం విడుదల చేశారు. విద్యా శాఖ వెబ్‌సైట్‌లో ఇది అందుబాటులో ఉంది. ఈ నేపథ్యంలో మూడు నాలుగు రోజుల్లో డీఎస్సీ ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, సెకండరీ గ్రేడ్ టీచర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టులకు సంబంధించి వేర్వేరుగా తుది కీ అందుబాటులో ఉంది. అభ్యర్థులు www.schooledu. telangana.gov.in వెబ్‌సైట్‌లో తుది కీతోపాటు ఫైనల్ రెస్పాన్స్ షీట్‌ను పరిశీలించుకోవచ్చు. ప్రిలిమినరీ కీతో పోలిస్తే.. తుది కీలో సుమారు 109 ప్రశ్నలకు సంబంధించి జవాబులను మార్చినట్టు సమాచారం. 50 ప్రశ్నలకు జవాబులు సరిగ్గా లేకపోవడంతో వాటికి మార్కులను జతచేశారు. డీఎస్సీ పరీక్షలో అభ్యర్థులకు వచ్చిన మార్కులు, టెట్‌లో వచ్చిన మార్కుల వెయిటేజీని కలిపి డీఎస్సీ ఫలితాలు వెల్లడిస్తారు. అనంతరం జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందిస్తారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 7 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఎన్ఐడీలో డిజైన్ ప్రోగ్రామ్‌లు

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ సహా అహ్మదాబాద్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో బీ డిజైన్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. దీని వ్యవధి నాలుగేళ్లు. అహ్మదాబాద్, బెంగళూరు, గాంధీనగర్ క్యాంపస్‌లలో ఎం డిజైన్ ప్రోగ్రామ్ ఉంది. దీని వ్యవధి రెండున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లను ఆంగ్ల భాషలో నిర్వహిస్తారు. డిజైన్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (డీఏటీ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో ప్రిలిమ్స్, మెయిన్స్ దశలు ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత పొందినవారిని మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ప్రతి కేటగిరీలో సీట్ల సంఖ్యకు మూడు రెట్లమందిని మెయిన్స్‌కు అనుమతిస్తారు. ప్రిలిమ్స్, మెయిన్స్ స్కోర్ ఆధారంగా తదుపరి అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.



బీ డిజైన్

విభాగాలు: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్.

సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థుల కోసం అహ్మదాబాద్ క్యాంపస్‌లో 19 సీట్లు, మధ్యప్రదేశ్ క్యాంపస్‌లో 11 సీట్లు, హరియాణా క్యాంపస్‌లో 11 సీట్లు అదనంగా ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2004 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. సీబీఎస్ఈ/ఐబీ/ఐసీఎస్ఈ/ఇతర గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2024-25 విద్యా సంవత్సరం నాటికి సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యూమానిటీస్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 15 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల 'జాయింట్ సర్వీసెస్ వింగ్ కోర్సు' ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్) నుంచి కనీసం అయిదు సబ్జెక్టులతో సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ పాసైనవారు; బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నిర్వహించే మూడేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఎగ్జామ్(లండన్/శ్రీలంక) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను 'పేపర్-పెన్సిల్/పెన్' విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు. మెయిన్స్ ఎగ్జామ్‌ను స్టూడియో సెటప్ ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ టెస్ట్‌లు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 40 శాతం, మెయిన్స్ స్కోర్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు.

- ★ **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు రూ.5,000
- ★ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 3
- ★ **ఎడిట్ విండో ఓపెన్:** డిసెంబరు 4 నుంచి 9 వరకు
- ★ **ప్రిలిమ్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** డిసెంబరు 24 నుంచి
- ★ **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- ★ **ప్రిలిమ్స్ తేదీ:** 2025 జనవరి 5న
- ★ **ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 1న; ఎం డిజైన్‌కు 2025 ఫిబ్రవరి 17న
- ★ **మెయిన్స్ అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 14 నుంచి; ఎం డిజైన్‌కు 2025 ఫిబ్రవరి 24 నుంచి
- ★ **మెయిన్స్ తేదీలు:** బీ డిజైన్‌కు 2025 ఏప్రిల్ 26 నుంచి మే 4 వరకు; ఎం డిజైన్‌కు 2025 మార్చి 3 నుంచి ఏప్రిల్ 6 వరకు
- ★ **మెయిన్స్ ఫలితాలు విడుదల:** బీ డిజైన్‌కు 2025 మే 16న; ఎం డిజైన్‌కు 2025 మే 6
- ★ **సీట్ అలాట్‌మెంట్, డాక్యుమెంట్స్ అప్‌లోడింగ్:** బీ డిజైన్‌కు 2025 మే 27 నుంచి 30 వరకు; ఎం డిజైన్‌కు 2025 మే 6 నుంచి 7 వరకు
- ★ **వెబ్‌సైట్:** admissions.nid.edu

ఎం డిజైన్

విభాగాలు-సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, ఫర్నిచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు; సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్‌లో 12 సీట్లు ఉన్నాయి. గాంధీనగర్ క్యాంపస్‌లో ఫొటోగ్రఫీ డిజైన్, ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఆటోమొబైల్ డిజైన్, న్యూ మీడియా డిజైన్, స్ట్రాటజిక్ డిజైన్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ డిజైన్, లైఫ్ స్టయిల్ యాసెసరీ డిజైన్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు; టాయ్ అండ్ గేమ్ డిజైన్‌లో 12 సీట్లు ఉన్నాయి. బెంగళూరు క్యాంపస్‌లో యూనివర్సల్ డిజైన్, డిజిటల్ గేమ్ డిజైన్, ఇన్ఫర్మేషన్ డిజైన్, ఇంటరాక్షన్ డిజైన్, డిజైన్ ఫర్ రిటైల్ ఎక్స్‌పీరియెన్స్ విభాగాల్లో ఒక్కోదానిలో 19 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 1993 జూలై 1 తరవాత జన్మించి ఉండాలి. ఇంటర్ తరవాత మూడేళ్లు/నాలుగేళ్ల వ్యవధిగల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; డిజైన్, ఫైన్ ఆర్ట్స్, అప్లయిడ్ ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ విభాగాల్లో నాలుగేళ్ల డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 జూన్ 28 నాటికి డిగ్రీ/డిప్లొమా చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అర్హులే. వీరు 2025 జూలై 31 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను 'పేపర్-పెన్సిల్/పెన్' విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ఆంగ్ల మాధ్యమంలో ప్రశ్నలు అడుగుతారు. మెయిన్స్ ఎగ్జామ్‌లో స్టూడియో టెస్ట్, ఇంటర్వ్యూలు ఉంటాయి. ప్రిలిమ్స్ స్కోర్‌కు 30 శాతం, స్టూడియో టెస్ట్ స్కోర్‌కు 40 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఐఐటీ మద్రాస్‌లో
బీఎస్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్



మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- బీఎస్ ఇన్ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారు. ఇప్పటికే వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఉద్యోగార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు ఇంజనీరింగ్ అర్హత లేకున్నా ప్రోగ్రామర్లుగా, డేటా సైంటిస్టులుగా రాణించవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి. ఇందులో నాలుగు దశలు ఉన్నాయి. అవి ఫౌండేషన్ లెవెల్, డిప్లొమా లెవెల్, బీఎస్సీ డిగ్రీ లెవెల్, బీఎస్ లెవెల్.
- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు అసైన్‌మెంట్స్ స్కోర్, క్వాలిఫయర్ ఎగ్జామ్ ద్వారా ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ ఇస్తారు. దీనిని పూర్తిచేసిన తరవాత డిప్లొమా లెవెల్ ప్రోగ్రామ్‌లో ఆ తరవాత బీఎస్సీలో, తరవాత బీఎస్‌లో అడ్మిషన్ లభిస్తుంది.
- ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ 2024కు అర్హత పొందినవారికి ఫౌండేషన్ లెవెల్ ప్రోగ్రామ్‌లో నేరుగా అడ్మిషన్ ఇస్తారు.
- ప్రోగ్రామ్ నుంచి ఏ దశలోనైనా అభ్యర్థులు నిష్క్రమించే వీలుంది. పూర్తిచేసిన కోర్సులకు సంబంధించి సంస్థ సర్టిఫికెట్ ప్రదానం చేస్తుంది.
- ఫౌండేషన్ లెవెల్లో ఎనిమిది కోర్సులు ఉంటాయి. 32 క్రెడిట్లు నిర్దేశించారు.
- డిప్లొమా లెవల్లో ఆరు థియరీ కోర్సులు, రెండు ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. 27 క్రెడిట్లు నిర్దేశించారు. ఈ లెవెల్లో ప్రోగ్రామింగ్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉంటాయి. వీటిలో ఏదైనా ఒకదాన్ని లేదా రెంటినీ ఎంచుకోవచ్చు.
- బీఎస్సీ, బీఎస్ లెవెల్లో ఒక్కోదానికి 28 క్రెడిట్స్ నిర్దేశించారు.
- లెవెల్ వారీగా నిర్దేశించిన ఒక్కో అంతర్గత కోర్సు పన్నెండు వారాలు ఉంటుంది. ప్రతి వారం వీడియో క్లాసులు, అసైన్‌మెంట్స్ ఉంటాయి. మంత్లీ క్విజ్‌లు, ఎండ్ టర్మ్ ఎగ్జామ్‌లు కూడా నిర్వహిస్తారు.

అర్హత: ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ నిర్వహించే రెండేళ్ల జాయింట్ సర్వీసెస్ వింగ్ ఫైనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు; జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్(జీసీఈ) అడ్వాన్స్‌డ్ లెవెల్ ఉత్తీర్ణులు; కనీసం అయిదు సబ్జెక్టులతో ఎన్ఐఓఎస్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

క్వాలిఫయర్ ఎగ్జామ్

- రెగ్యులర్ ఎంట్రీ విధానంలో దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులకు మొదట నెల రోజులు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లీష్, మేథమెటిక్స్ ఫర్ డేటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఫర్ డేటా సైన్స్, కంప్యూటేషనల్ థింకింగ్ అంశాలపై తరగతులు ఉంటాయి. ఒక్కో అంశంపై వారానికి 2 నుంచి 3 గంటల వీడియో కంటెంట్ పంపుతారు. అభ్యర్థులకు ఇచ్చిన అసైన్‌మెంట్లను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పంపాలి. వీటికి మార్కులు ఉంటాయి. మొదటి మూడు అసైన్‌మెంట్లలో కనీసం రెంటిలో 40 శాతం స్కోర్ సాధించిన వారిని క్వాలిఫయర్ ఎగ్జామ్‌కు అనుమతిస్తారు. రిజర్వుడు వర్గాలకు 30 శాతం వస్తే చాలు.
- పరీక్ష సమయం 3 గంటలు ఉంటుంది. అంటే ఒక్కో సబ్జెక్టుకు 45 నిమిషాలు ఇస్తారు. ఒక్కో దానిలో కనీసం 40 శాతం చొప్పున మొత్తమ్మీద 50 శాతం మార్కులు రావాలి. ఈ ఎగ్జామ్ రిజల్ట్ వ్యాలిడిటీ ఏడాది లేదా మూడు టర్మ్‌ల వరకు ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.3,000; జనరల్ కేటగిరీ దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన దివ్యాంగులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **క్వాలిఫయిర్ ఫేజ్ ప్రారంభం:** సెప్టెంబరు 20 నుంచి
- **క్వాలిఫయిర్ ఎగ్జామ్ తేదీ:** అక్టోబరు 27
- **ఫలితాలు విడుదల:** నవంబరు 1
- **ప్రోగ్రామ్ రిజిస్ట్రేషన్:** నవంబరు 6 నుంచి 7 వరకు
- **వెబ్‌సైట్:** study.iitm.ac.in

జాబ్ కార్నర్

కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్/రైఫిల్‌మన్ పోస్టులు

ఖాళీలు 39,481

వివిధ కేంద్ర సాయుధ బలగాల్లో కానిస్టేబుల్/రైఫిల్‌మన్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన నోటిఫికేషన్‌ను స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ), సశస్త్ర సీమ బల్(ఎస్ఎస్‌బీ), సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఏఆర్)లో మొత్తం 39,481 ఖాళీలు భర్తీ చేస్తారు.

కేటగిరీ వారీ ఖాళీల వివరాలు

- **కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ)/రైఫిల్ మన్(జనరల్ డ్యూటీ), సిపాయి:** 39,481 పోస్టులు
- **పురుషులు:** ఎస్సీ-5254; ఎస్టీ-4021; ఓబీసీ-7747; ఈడబ్ల్యూఎస్-3496; యూఆర్-15094
- **మహిళలు:** ఎస్సీ-564; ఎస్టీ-433; ఓబీసీ-829; ఈబ్ల్యూఎస్-355; యూఆర్-1688

విభాగాల వారీ ఖాళీలు

1. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్): 15654 పోస్టులు
2. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్): 7145
3. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్): 11541
4. సశస్త్ర సీమ బల్(ఎస్ఎస్‌బీ): 819
5. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ): 3017
6. అస్సాం రైఫిల్స్(ఏఆర్): 1248
7. సెక్రటేరియట్ సెక్యూరిటీ ఫోర్స్(ఎస్ఎస్ఎఫ్): 35
8. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ): 22

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి మెట్రిక్యులేషన్ లేదా పదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. పురుష అభ్యర్థుల ఎత్తు 170 సెం.మీ.లకు, మహిళా అభ్యర్థులకు 157 సెం.మీ.లకు తగ్గకూడదు.

వయోపరిమితి: 2025 జనవరి 1 నాటికి 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి. అభ్యర్థులు2002 జనవరి 2 కంటే ముందు, 2007 జనవరి 1 తర్వాత జన్మించి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు: పే లెవల్-1 కింద ఎన్‌సీబీలో సిపాయి ఉద్యోగాలకు రూ.18,000 - రూ.56,900 చొప్పున చెల్లిస్తారు. ఇతర పోస్టులకు పే లెవల్-3 కింద రూ.21,700 నుంచి రూ.69,100 వరకు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

సీబీఈ పరీక్ష విధానం: ప్రశ్న పత్రంలో మొత్తం 80 ప్రశ్నలు ఉంటాయి. 160 మార్కులు కేటాయించారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(20 ప్రశ్నలు-40 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్(20 ప్రశ్నలు- 40 మార్కులు), ఎలిమెంటరీ మేథ్స్(20 ప్రశ్నలు - 40 మార్కులు), ఇంగ్లీష్/హిందీ(20 ప్రశ్నలు - 40 మార్కులు) నుంచి ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది.

దరఖాస్తు రుసుము: రూ.100. మహిళలు/ఎస్సీ/ఎస్టీ/మాజీ సైనిక అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 14

వెబ్‌సైట్: https://ssc.gov.in/

ఎన్‌టీహెచ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

కోల్‌కతాలోని వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఫుడ్ అండ్ పీడీకు చెందిన నేషనల్ టెస్ట్ హౌజ్(ఎన్‌టీహెచ్)...ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 6

విభాగాలు: టెక్నికల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ ఫుడ్ అనలిస్ట్, టెక్నికల్, మేనేజ్‌మెంట్.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, పీజీ, డాక్టరేట్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు సీనియర్ యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు రూ.70,000; జూనియర్ యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు రూ.40,000.

పని ప్రదేశాలు: ఘజియాబాద్, జైపూర్

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 11

వెబ్‌సైట్: https://www.nth.gov.in/



లిటిల్స్

తెలివి తక్కువ తోడేలు



ఒక పావురం మరియు కోడిపుంజు అనుకోకుండా అడవిలో కలుసుకుని,మంచి స్నేహితులయ్యాయి.రోజూ అవి కాసేపు కలుసుకుని, కబుర్లు చెప్పుకునేవి. ఒక రోజు ఆ రెండూ అలాగే కలుసుకుని పావురం చెట్టుమీద వాలి, కోడిపుంజు నేలమీద గింజలు వెతుక్కుంటూ ఉండగా, బాగా ఆకలి మీద ఉన్న ఓ తోడేలు అటుగా వచ్చి, మేత కోసం తిరుగుతున్న కోడిపుంజును చూసింది.

చూడగానే మనసులో ఇలా అనుకుంది, 'ఈ కోడిపుంజు చక్కగా కొవ్వు పట్టి ఉన్నది. దీన్ని కానీఇంటికి పట్టుకెళ్లగలిగితే నాకు ఇవాళ విందు భోజనమే' అనుకుని, అదను చూసి, చాటునుండి కోడిపుంజు మీద దాడి చేసింది. దాన్ని అలాగే పట్టుకుని తన దగ్గరున్న సంచీలో వేసుకుంది. కోడిపుంజు చాలా భయపడిపోయి, సంచీలోనుంచే గట్టిగా అరవసాగింది. చెటుట్ల పైన కొమ్మమీద కూర్చుని ఇదంతా గమనించిన పావురం తన మిత్రుడికి ఏదైనా సాయం చేయాలి అనుకుంది. అనుకున్నదే తడవుగా వెళ్లి, తోడేలు వెళ్లే దారిలో చచ్చిపోయినట్టు కదలకుండా పడుకుంది. అది చూసిన తోడేలు' అదృష్టమంటే ఇవాళ నాదే, ఒకేసారి పావురం, కోడిపుంజు ఇవాళ రెండు పూటలా విందు నాకుఅనుకుంటూ పావురాన్ని సంచీలో వేయడానికి సంచీ తెరిచి పక్కన పెట్టింది, ఇదే అదనుగా సంచీలోఉన్న కోడిపుంజుమెల్లగా బయటపడి, తన స్థానంలో ఆ సంచీలో ఒక రాయిని పెట్టింది ఈ లోగా తోడేలు దగ్గరికి రావడం గమనించిన పావురం చటుక్కున లేచి, ఎగిరిపోయింది. 'అమ్మ పావురమా పిడికెడు ఉన్నావు నువ్వు నన్ను ఇంత మోసం చేస్తావా?'అనుకున్నది తోడేలు. అలా సంచీని మోసుకుంటూ ఆనందంగా ఇంటికి వెళ్లి, సంచీ తెరిచి చూసి, అందులో కోడిపుంజు కాక పెద్ద రాయి ఉండటంతో అయోమయంగా కోడిపుంజు రాయిగా ఎలా మారిందా అని ఆలోచిస్తూ, ఆ పూట విందు

కాదు కదా అసలు భోజనమే పోగొట్టుకున్నందుకు ఏడ్చింది తోడేలు. ఆ రోజు సాయంత్రం మరలా పావురం కోడిపుంజు రెండూ కలిసి తోడేలు తెలివి తక్కువ తనాన్ని తలచుకుని నవ్వుకున్నాయి. సమయస్ఫూర్తితో ,ఉపాయంతో అపాయాల నుండి తప్పించుకోవచ్చు. మనమేకాక మన మిత్రులను కూడా కాపాడుకోవచ్చు.

7 తేడాలను కనిపెట్టండి





సరైన నీడను గుర్తించండి





డైలీ సుడోకు - 404

	4		7	3			9	
	2		8		9			3
					2			
9						7		8
	7						3	
6		1						5
			6					
5			3		8		1	
	8			2	4		6	

సుడోకు - 403 సమాధానం

4	2	5	8	6	3	7	9	1
6	8	9	1	7	4	2	5	3
1	7	3	5	9	2	8	4	6
2	1	8	3	5	6	9	7	4
5	9	4	7	8	1	6	3	2
3	6	7	2	4	9	5	1	8
8	4	6	9	3	7	1	2	5
9	3	2	6	1	5	4	8	7
7	5	1	4	2	8	3	6	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.